వాసుల్
గత వారం పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

4-8-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 184 పేజీలు: 10+4 వెల: 6.50

## దేశ వ్యాప్తంగా 35 మందుల ధరలు తగ్గింపు

5లో

## కాలువలోకి దూసుకెళ్లిన కారు: 11 మంది దుర్మరణం

# జెండాలో నాగలి అజెండాలో రైతు సంక్షేమం

## అన్ని రంగాల్లో శరవేగంతో అభివృద్ధి

### 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అమలు

### కొత్తగా రూ. 6 వేల కోట్లతో రవాణా ప్రాజెక్టులు

### అన్ని పథకాలకు రెట్టింపు నిధులు: సిఎం చంద్రబాబు



**విజయవాడ, ఆగస్టు3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి శరవేగంతో జరుగుతుందని సిఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో కొత్తగా దగ్గర దగ్గర రూ.ఆరువేల కోట్లుతో రవాణా ప్రాజెక్టులు అమల్లోకి రానున్నాయని తెలిపారు.సింగపూర్ దేశం మన రాష్ట్రంలో కీలకంగా రాజధానిలో రూ.45వేల కోట్లు పెట్టుబడులు రాబోయే అయిదేళ్లలో వచ్చే దిశలో ఒప్పందాలు జరిగాయన్నారు. రాబోయే అయిదళ్లలో రాష్ట్రం అతి శక్తివంతంగా మారు తుందన్నారు. ఆ మేరకు సిఎంవో కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. రైతులకు టిడిపి చేసినంత లబ్ది ఇతర పార్టీలేవీ చేయలేదు. రైతు సంక్షేమం కోసం నిధులుఇస్తున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా సాగు నీరు అందిస్తున్నాం.. వారికి అవసరమైన యంత్ర పరికరాలను అంద చేస్తున్నాం. గత ప్రభుత్వం అరకొర సంక్షేమం చేసింది.. పంటలబీమాకు ప్రీమియం చెల్లించకుండా గుండు సున్నా చుట్టింది. ఈ విషయాన్ని కేంద్రమే స్పష్టంగా తెలియజేసింది. ఇలాంటివి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. ఏ కష్టమొచ్చినా.. మన ప్రభుత్వం ఉందనే భరోసా రైతుల్లో నింపాలి. రైతు సంక్షేమం కోసం పని చేసే పార్టీ టిడిపి. మన జెండాలోనే నాగలి గుర్తు ఉంది. మన అజెండాలో రైతు సంక్షేమం ఉంది. ఎన్టీఆర్ సిఎం అయ్యాక రూ.50లకే హార్స్ పవర్ విద్యుత్ అందించారు. అన్నదాతబాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. ఇది మన పార్టీ సిద్ధాంతం. రాయలసీమలో 90 శాతం ప్రాజెక్టులు టిడిపి హయాంలో చేపట్టినవే. ప్రాజెక్టులన్నీ నీళ్లతో కళకళలాడుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు జూలై నెలలోనే 2 సార్లు నిండింది. హంద్రీనీవా ఫేజ్1లో భాగంగా నీళ్ల విడుదల చేశాం. ఏడాదిలో రూ.3,890 కోట్లు ఖర్చు చేసి హంద్రీనీవా పనులు పూర్తి చేస్తున్నాం. ఇవన్నీ రైతులకు మేలు చేకూర్చేవే." అని చంద్రబాబు చెప్పారు. మనం చేపట్టిన ప్రాజెక్టులను గత ప్రభుత్వం నిలిపివేసింది. రైతుల కోసం ప్రవేశ పెట్టిన పథకాలను నిర్వీర్యం చేసింది. వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద ఏడాదికి రూ.12,500 ఇస్తామని రూ.7,500 మాత్రమే ఇచ్చింది. ధాన్యం రైతులకు రూ.1,674 కోట్లు బకాయిలు పెడితే మన ప్రభుత్వం వచ్చాక చెల్లించింది. మనం వచ్చాక మళ్లీ90శాతం సబ్సీడీతో డ్రిప్ ఇస్తున్నాం. అగ్రిటెక్ ద్వారా రైతులకు పరికరాలు అందజేస్తున్నాం.

అన్నదాత సుఖీభవ పథకం సహా.. ఇతర సంక్షేమ పథకాలన్నీ గతానికంటే రెండింతలు అదనంగా అందిస్తున్నాం. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే లబ్దిదారుల సంఖ్య పెరిగింది.. ఆర్థిక చేయూతను పెంచాం. ఈ నెలలోనే సూపర్ సిక్స్‌లోని రెండు హామీలు నెరవేరుస్తున్నాం. రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులను విడుదల చేస్తున్నాం. ఆగస్టు 15వ తేదీ నుంచి >>2

## బల్లికురవ క్వారీలో ఘోర ప్రమాదం

# బండ పైనపడడంతో ఆరుగురు కూలీలు దుర్మరణం

### వెంటిలేటర్‌పై మరో ముగ్గురు

### ఒకరికి తెగిపోయిన కాలు

### మరో 8 మందికి తీవ్ర గాయాలు

### అంతా ఒడిశా వలస కార్మికులే

### సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ఊడిపడిన బండ

**బల్లికురవ, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రెక్కాడితే డొక్కాడని బ్రతుకులు వాళ్లవి. ఒరిస్సా రాష్ట్రం నుండి వలస వచ్చి గ్రానైట్ క్వారీలలో అనుక్షణం ప్రమాదంతో సహవాసం చేస్తూ అదృష్టం వెనకడుగు వేస్తే మృత్యు కౌగిలి చేరుతుంటారు. అదే తరహాలో ఆదివారం ఉదయం 10గంటల ప్రాంతంలో సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో కింద భాగంలో ఆరు జాకీలతో డ్రిల్లింగ్ చేస్తున్న కార్మికులపై పైనుండి పది టన్నులకు పైబడిన బండ ఊడిపడటంతో సంఘటన స్థలంలోనే ఆరుగురు మృతి చెందారు. సంఘటన స్థలంలోని ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు ఉదయం 10గంటల ప్రాంతంలో ఆరు జాకీలతో 18 మంది రిల్లింగ్ పనులలో నిమగ్నమై ఉన్నారు. 10.20 గంటల ప్రాంతంలో ఒక్క సారిగా వీరు పని చేస్తున్న ఎగువుభాగాన రాయి ఊడి కార్మికులపై పడిపోయింది. దీంతో సంఘటన స్థలంలోనే ఆరుగురు మృతి చెందారు. మృతి చెందిన వారిలో దండా బడిత్య(48), టక్కున దళాయి (37), పనకుల చెహరా(30), భాస్కర్ బిషోయ్(40), సంతోష్ గౌడ్(37), మూస జన(37) అనే కార్మికులు ఉన్నారు. మరొక కార్మికుడికి కాలు పూర్తిగా తెగిపోయింది. నరసరావుపేట గజ్జల బ్రహ్మారెడ్డి హాస్పిటల్‌లో ముగ్గురు కార్మికులు చావు బ్రతుకుల మధ్య వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మరో ఎనిమిది మంది తీవ్ర గాయాలతో నరసరావుపేట వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారు. హృదయ విచారకంగా చనిపోయిన వారి బాడీలను గ్రానైట్ టిప్పర్లతో అనాధలలాగా పడవేశారు. పత్రికల వారికి సమాచారం అందకుండా చేసేందుకు తమ వంతు ప్రయత్నం విజయవంతంగా పూర్తి చేశారు. ప్రమాద విషయం తెలుసుకొని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా న్యాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రమాద తీరు పట్ల విస్మయం వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించారు. తహాశీల్దార్ ఎం.రవినాయక్, ఎంపిడిఒ పాండురంగ స్వామి సంఘటన స్థలానికి చేరుకున్నారు. తహాశీల్దార్ రవి నాయక్ ఎప్పటికప్పుడు ప్రమాద ఘటనపై ప్రభుత్వానికి >>2



మీడియాతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

## నోటిఫైకాని స్టేషన్‌లో

# కేసు చెల్లదు..

### అవినీతి నిరోధక శాఖ కేసులపై హైకోర్టు కీలక తీర్పు

### 2016-20 నాటి 15 కేసులు రద్దు



**విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి:** నోటిఫై కాని పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేయడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. నోటిఫై కాని స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) నమోదు చేసిన 15 కేసులను రద్దు చేసింది. వీటికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను కూడ రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయా కేసులు నమోదు చేసే నాటికి విజయవాడలోని ఎసిబి సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(సిఐయూ)కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్‌గా నోటిఫై చేయలేదని, దీనిపై ప్రభుత్వం ఎలాంటి గెజిట్ నోటిఫికేషణ్ జారీ చేయలేదని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో విజయవాడ ఎసిబి సిఐయూలో నమోదైన ఎఫ్ఐఆర్‌లకు చట్టబద్ధత ఉండదని పేర్కొంది. సదరు ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ తీర్పు ఇచ్చారు. ఆదాయానికి మించి ఆస్థులున్నాయనే ఆరోపణలతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన 15 మంది అధికారులు,ఉద్యోగులపై విజయవాడలోని ఏసీబీ సిఐయూ కార్యాలయం ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది.

నోటిఫై కాని పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినందున వాటికి ఎలాంటి చట్టబద్ధత ఉండదని, వాటిని కొట్టివేయాలని కోరుతూ 15 మంది అధికారులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. పిటీషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... సిఆర్పీసీ సెక్షన్-2(ఎస్) ప్రకారం పోలీస్‌స్టేషన్‌గా గుర్తించేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుందనాన్నరు. విజయవాడలోని ఎసిబి సిఐయూ కార్యాలయాన్ని పోలీస్ స్టేషన్‌గా నోటిఫై చేస్తూ ప్రభుత్వం ఎటాంటి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వం >>2



## అమరావతిలో భారీ పార్కులు

### మలేసియాలో వెట్‌ల్యాండ్ పార్కును పరిశీలించిన మంత్రి నారాయణ

**విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రి నారాయణ మలేషియా పర్యటన కొనసాగుతోంది. పుత్రజయ సర్కిల్, వెట్‌ల్యాండ్ పార్కును ఆయన పరిశీలించారు. 138 హెక్టార్లలో నిర్మితమైన వెట్‌ల్యాండ్‌ల ప్రపంచ ప్రసిద్ధ వృక్ష జాతులున్నాయి. మలేసియా టూరిజంలో కీలకంగా ఉన్న పార్కు గురించి అక్కడి అధికారులు వివరించారు. అమరావతిలో భారీ పార్కుల ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. పుత్రజయలో మలేసియా తెలుగు అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి నారాయణ సమావేశమయ్యారు. అమరావతి నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని >>2

## తొలి రోజు జైలులో దీనంగా రేవణ్ణ

## రష్యాలో బద్ధలైన అగ్నిపర్వతం

### పరుగులు తీసిన ప్రజానీకం

5లో

# పల్నాడు, రాయలసీమకు భారీ వర్షసూచన

## ఉత్తర తమిళనాడుకు నైరుతి దిశగా ఉపరితల ఆవర్తనం

**గుంటూరు,ఆగస్టు 3,ప్రభాతవార్త ప్రతినిధి :** ఉత్తర తమిళనాడుకు నైరుతి దిశగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజులు పల్నాడుతో పాటు రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న మూడు రోజులు వాతావరణం వివరాలను ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. సోమ, మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. సోమవారం అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు,మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

మంగళవారం పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల,అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.బుధవారం. >>2

## కొడాలి నానిపై మరో కేసు

### నోటీసులిచ్చిన విశాఖ పోలీసులు



**విజయవాడ, ఆగస్టు3, ప్రభాత వార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి కొడాలి నానిపై మరో కేసు నమోదైంది. కొడాలి నాని అధికారంలో ఉన్నప్పుడు మూడేళ్లపాటు చంద్రబాబు,లోకేష్‌లను సామాజిక మాధ్యమాల్లో దుర్భాషలాడారని, ఓమహిళగా ఆ తిట్లు భరించలేకపోయానని ఎయు న్యాయ కళాశాల విద్యార్థిని అంజనప్రియ 2024లో విశాఖ త్రీ టౌన్ పోలీసులు ఫిర్యాదు >>2



ఆదివారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన ప్రధాని మోడీ

## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ, అమిత్‌షా భేటీ

### అమెరికా సుంకాల ప్రభావం, ఆపరేష్ సిందూర్‌పై చర్చ

**న్యూఢిల్లీ,ఆగస్టు 3:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షాలు భేటీ అయ్యారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో ప్రధానిమోడీ భేటీ అయితే కొన్ని గంటల వ్యవధిలోనే హోంమంత్రి అమిత్‌షా కూడా రాష్ట్రపతి ముర్మును కలుసుకున్నారు. ప్రస్తుత పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్న >>2

## తిరుమలలో సామాన్యుడికి 'దర్శన' కష్టాలు తప్పవా?

### మూడు, నాలుగు గంటల్లో శ్రీవారి దర్శనం అసాధ్యమే!

### మాజీ సిఎస్ వాఖ్యలపై టిటిడిలో చర్చ

**తిరుమల,ఆగస్టు 3ప్రభాతవార్తప్రతినిధి:** కృత్రిమ మేధస్సుతో (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఎఐ) వేంకటేశ్వరస్వామి దర్శనం సామాన్యభక్తులకు మూడునాలుగుగంటల్లోనే చేయించాలనుకోవడం సంభవమేనా?! ఆలాంటి ప్రయత్నాలు చేయడం మంచిదికాదా??అనే ప్రశ్నలు ఇప్పుడు టిటిడి వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మొన్నటి వరకు ఎఐ సాంకేతిక వినియోగించుకోవడంలో టిటిడి పాలక మండలి, అధికారులు గూగుల్, టిసిఎస్ సహకారం కోరామని, దశలవారీగా ప్రయోగాత్మకంగా పరిశీలన చేయాల్సి ఉందని ప్రకటనచేశారు.దీనికి తాజాగా ఆదివారం ఉదయం తిరుమలలో టిటిడి మాజీ ఇఒ,ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రమణ్యం వ్యాఖ్యలు టిటిడిని ఇరకాటంలో పడేశాయనేది భక్తుల్లో ఆలోచన. కృత్రిమ మేధస్సును(ఎఐ)సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవుడు తన శక్తితో ఎంత గ్రహించినా ఆలయం లోపల దర్శన పరిమితులు ఉన్నాయని అనుభవపూర్వకమైన వాదన వినిపించారు.



ఇదే సమయంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచనలతో కూడిన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అసలు ఎఐతో గంట, రెండుగంటల్లోనే శ్రీవారిదర్శనాన్ని చేయిస్తామన్న విధానాన్ని విరమించుకోవాలని సూచనలు చేశారు. ఇప్పటికే కొందరు భక్తుల సంభాషణను విన్నానని, రెండు మూడు గంటల్లోనే దేవుని దర్శనం చేయిస్తామని ఆలోచన విధానం గురించి వారు చర్చించారన్నారు. ఇదీ ఆలయంలోపల అమలుచేయడం సాధ్యంకానిదని అన్నారు. టిటిడి ఈ ఆలోచనలకు స్వస్తిపలకాలని తెలిపారు. ఇప్పటి పరిస్థితుల్లో రోజుకు లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. సరాసరి 70-80వేలమందివరకు మాత్రమే ఆలయం లోపల జయలఘుల వరకే మహాలఘు దర్శనం చేయించగలుగుతున్నారు. గంటకు 4,500మంది భక్తులకు శ్రీవారి దర్శనభాగ్యం కల్పిస్తున్నా మరీ అంతకుమించి భక్తులకు క్షణకాలంకూడా దర్శనం చేయించలేక పోతారనేది వినిపిస్తున్న వాదనలు, ఇప్పటికే ఆలయం లోపల బంగారు వాకిలిలో మహాలఘులో మూడువరుసలు విధానం అమలవుతున్నా ఎక్కడో కులశేఖరపడిదాటాక కొలువైన దేవదేవుడ్ని క్షణకాలం అటుచూసేలోపే సిబ్బంది,శ్రీవారిసేవకులు లాగేస్తుండటంతో భక్తులు సంతృప్తిచెందడంలేదు. తిరుమల ఆలయంలో ఉదయంవేళ ప్రోటోకాల్ విఐపి బ్రేక్ దర్శనాలు, శ్రీవాణి బ్రేక్ దర్శనాలు తప్ప మిగిలిన అన్ని రకాల దర్శనాలు మహాలఘువిధానమే అమలవుతోంది.

**ప్రయోగాత్మకంలోనూ సందిగ్ధాలు!:** సామాన్యభక్తుడికి మూడుగంటల్లోనే వేంకటేశ్వర స్వామి దర్శనం చేయించే విషయం ఎలాఉన్నా గత ఏడాదికాలంగా ఎఐ అమలుపై కసరత్తు చేస్తూనే ఉన్నారు. పైగా ఈ విధానం >>2



## ఐసియులో జెఎంఎం నేత శిబుసోరెన్ ఆరోగ్య పరిస్థితి విషమం

**రాంచి,ఆగస్టు 3:** జార్ఖండ్ రాజకీయ కురువృద్ధుడు జార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకులు రాజ్యసభ ఎంపి శిబుసోరెన్ ఆరోగ్యం విషమంగా ఉంది. ఢిల్లీలోని సర్‌గంగారామ్ ఆసుపత్రిలోచేరిన శిబుసోరెన్ ఆరోగ్యంపై జెఎంఎం కూడా ఆందోళన వ్యక్తంచేస్తోంది. వైద్యులు నిరంతరం ఆయన్ను >>2



# ఎర్త్ డ్యామ్ గ్యాలరీపై ఇంత నిర్లక్ష్యమా?

### అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంలో మరింత జాప్యం

### గ్యాలరీని నిపుణుల కమిటీ చూడలేదా?

### ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోపై పొంతనలేని లెక్కలు

**రాజంపేట, ఆగస్టు 03, ప్రభాతవార్త:** ఆసియా ఖండంలోనే రెండు గ్యాలరీలు కలిగిన ఒకే ప్రాజెక్టు ఇది. ముఖ్యంగా ఎర్త్ డ్యాంలో గ్యాలరీ కలిగిన ప్రాజెక్ట్ ఇది. నదీ గర్భంలో ప్రాజెక్ట్ నిర్మాణం సందర్భంగా బయటపడిన సొరంగాలతో ఇబ్బంది లేకుండా కట్టిన ప్రాజెక్టు ఇది. ప్రాజెక్టు నుంచి నీరు లీకేజి అయితే వెంటనే తెలుసుకునేందుకు ఎర్త్ డ్యాం గ్యాలరీ దోహదపడుతుంది. అలాంటి కీలకమైన గ్యాలరీని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ చూడకుండానే వెళ్లిపోయిందా? అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ పరిశీలనకు వచ్చి నేటికి మూడు వారాలు..

ఉమ్మడి కడప జిల్లా రాజంపేట మండలంలో చెయ్యేరు నదిపై నిర్మించిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి నిపుణుల కమిటీ నివేదిక కీలకంగా మారనుంది. ప్రాజెక్టును గత నెల 13న రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీకి నాయకత్వం వహించిన కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజనీర్ రమేష్‌కుమార్ నేతృత్వంలో మరో విశ్రాంత జియాలజీ డైరెక్టర్ ఎం.రాజు, హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్ కే.సత్యనారాయణ, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్ పరిశీలించి వెళ్లారు. ఇదిలా ఉండగా నిపుణుల కమిటీ అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించినప్పుడు అతీ ముఖ్యమైన ఎర్త్ డ్యాం గ్యాలరీని భౌతికంగా పరిశీలించలేదని సమాచారం. ఎర్త్‌డ్యాం కిందనే నిర్మించిన గ్యాలరీకి దారి కూడా ఉంది. ఈ దారికి సంబంధించిన కట్టడం ప్రస్తుతం కనిపిస్తోంది. కాదంటే గ్యాలరీ లోపలికి వెళ్లేందుకు అవకాశం లేదనేది ప్రాజెక్టు అధికారుల అభిప్రాయం. ఎర్త్ డ్యాం గ్యాలరీ వరదల వల్ల పూడి పోయిందని చెబుతున్నారు. కనీసం లోపలికి వెళ్లేవరకైనా నిపుణుల కమిటీ పరిశీలించలేదని సమాచారం. అందుకు తగిన ఏర్పాట్లు కూడ చేయలేదని సమాచారం. ప్రాజెక్టుకు వరదలు వచ్చి ఎర్త్ డ్యాం కొట్టుకుపోయి 4సంవత్సరాలు కావస్తున్న కనీసం ఎర్త్ డ్యాం గ్యాలరీ ఏ పరిస్థితిలో ఉందో ఒక్క >>2



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద గంగా నదికి భారీ వరద రావడంతో ఆదివారం రాజాపూర్ ప్రాంతంలోని ప్రజలను సురక్షి త ప్రాంతాలకు పడవల్లో తరలిస్తున్న దృశ్యం

## మహారాష్ట్రలో రెచ్చిపోయిన ఎంఎన్‌ఎస్ సేన

**ముంబయి,ఆగస్టు 3:** మహారాష్ట్రలో రాజ్‌థాకరే మద్దతుదారులు మరోమారు రెచ్చిపోయారు. ముంబై సమీపంలోని పన్వేల్‌లో గత రాత్రి డ్యాన్స్‌బార్‌పై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. రాయ్‌గడ్ జిల్లాలో డ్యాన్స్‌బార్లపై మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) చీఫ్ రాజ్‌థాకరే చేసిన వ్యాఖ్యల అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది. డజను మందికిపైగా వ్యక్తులు కర్రలతో నైట్ రైడర్స్ బార్‌పై దాడిచేసి, ధ్వంసం చేశారు. లోపలికి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. ఫర్నిచర్‌తోపాటు మద్యం బాటిళ్లపై ప్రతాపం చూపించారు. బార్‌లోని టేబుళ్లు, అద్దాలు పగిలిపోయినట్టు ఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరాఠీ ఆత్మగౌరవం పేరుతో పదేపదే హింసకు మద్దతిస్తున్న రాజ్‌థాకరే నిన్న పన్వేల్‌లో జరిగిన కిసాన్ మజ్దూర్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ శివాజీ మహరాజ్ రాజధాని అయిన రాయ్‌గడ్‌లో డ్యాన్స్ బార్లు ఉండటానికి వీల్లేదని అన్నారు. ఆయన వ్యాఖ్యలతో ఎంఎన్‌ఎస్ కార్యకర్తలు చెలరేగిపోయారు. అర్ధరాత్రి డ్యాన్స్‌బార్‌కు చేరుకుని విధ్వంసం సృష్టించారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని, తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అయితే, ఈ ఘటనను ఎంఎన్‌ఎస్ నేత సందీప్ దేశ్‌పాండే సమర్థించుకున్నారు. దీనిని ఆయన 'ప్రతీకాత్మక నిరసన' గా అభివర్ణించారు. బార్లు ఉండటం చట్ట విరుద్ధమని, అందుకనే వారు ఆ పని చేశారని చెప్పారు. ప్రభుత్వం వీటిపై దృష్టిసారించాలని సూచించారు.



ప్రమాదం జరిగిన బల్లికురవలోని గ్రానైట్ క్వారీ

# అజెండాలో రైతు సంక్షేమం

>> మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం అమలు చేయనున్నాం. పేదల సేవలో భాగంగా నెలకు వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు పింఛను ఇస్తున్నాం. దివ్యాంగులకు రూ.6 వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం. కొత్తగా స్పౌజ్ పెన్షన్లు 1.09 లక్షల మందికి ఇస్తున్నాం. గత ప్రభుత్వం రద్దు చేసిన అన్న క్యాంటీన్లను పునరుద్ధరించాం. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సింది పార్టీ యంత్రాంగమే. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండాలి.. ప్రజల కోసం పని చేయాలి. ప్రజలు ఓట్లేస్తేనే మనం అధికారంలో ఉన్నామనే విషయాన్ని ఎప్పటికీ మరువొద్దు. గత ఎన్నికల్లో మనకు ఓటేసిన వారు నిత్యం మనతోనే ఉండాలి.. మరింత మంది మన పాలనను మెచ్చాలి. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిస్తే..ఆనందంలో మనమే గుర్తుకు వస్తాం. మంచి చేసిన వారిని ప్రజలెన్నడూ మరువరు. ప్రజలతో సఖ్యతగా లేకుంటే.. నాకు దగ్గర కాలేరు." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

మనం చేసిన మంచి ఎక్కడికి పోదని... అది మనతోనే ఉంటుందని సింగపూర్ పర్యటనలో స్పష్టమైంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో లబ్ది పొందిన వాళ్లు.. ఇప్పుడు పెద్ద ఎత్తున సింగపూర్ దేశంలో స్థిరపడ్డారు. సుమారు 40 వేల మంది సింగపూర్ దేశంలో తెలుగు ప్రజలు ఉన్నారు. ఆ దేశ పర్యటనకు వెళ్లినప్పుడు అద్భుతమైన స్వాగతం మన తెలుగు వారి నుంచి లభించింది. ఐదేళ్ల పాటు గత ప్రభుత్వం అన్ని వర్గాలను వేధించింది. పెట్టుబడిదారులను బెదిరించి రాష్ట్ర బ్రాండ్‌ను పూర్తిగా దెబ్బతీశారు. దాన్ని తిరిగి నిర్మించేందుకు శ్రమిస్తున్నాం. పెట్టుబడులు సాధన, రాష్ట్రాభివృద్ధిలో సహకారం కోసం సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో 1996 నుంచి హైదరాబాద్, రాష్ట్రాభివృద్ధికి సింగపూర్ సహకరించింది. గత ప్రభుత్వం వారిని కూడా వేధించింది. దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరిస్తున్నాం." అని చంద్రబాబు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇంత సంక్షేమం చేస్తుంటే.. కొందరు ఓర్చులేకపోతున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ఇప్పుడు ఇంకా కుట్రలు పన్నుతూనే ఉన్నారు. ఇలాంటి కుట్రల వల్ల రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరుగుతుంది.. దాని వల్ల ప్రజలు, పేదలు ఎలా ఇబ్బందులు పడతారనేది అర్థమయ్యేలా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీనేతలదే. కుట్రలు పన్నుతూ.. అడుగడుగునా అడ్డంకులు కల్పించే దుర్మార్గుల నైజాన్ని ప్రజల్లో ఎండగట్టాలి. గత పాలకులు చెప్పలేనన్ని ఘోరాలు చేశారు. వ్యవస్థలను నిర్వీర్యంచేశారు. వ్యవస్థలను గాడిలో పెడుతూ.. సంక్షేమం, అభివృద్ధి సమానంగానడుపుతూ పాలన చేస్తున్నాం. గతంలో అధికారంలో ఉన్నప్పుడు జరిగిన తప్పులను మళ్లీ మనం చేయకూడదు. చేసిన మంచిని చెప్పుకోవడంలో గతంలో విఫలమయ్యాం. నాడు ప్రతిపక్షాలు చేసిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంలో కొంత అలక్ష్యం ప్రదర్శించాం. ఈసారి అలా జరగకూడదు. మనం అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుంది. ఇది చరిత్ర చెబుతున్న నిజం. ఇక పార్టీలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుంది. ఎవరెవరు ఏం చేస్తున్నారనేది నిరంతరం ట్రాక్ చేస్తూనే ఉన్నాం. పార్టీకోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తున్నాం. గతంలో ఎన్నడూ లేనంతగా నామినేటెడ్ పదవుల భర్తీపై ఫోకస్ పెట్టాం. ఇప్పటికే చాలా వరకు భర్తీ చేస్తాం.. మిగిలినవి కూడా చేసేస్తాం. జిల్లా, నియోజకవర్గ నేతలు పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను గుర్తు పెట్టుకోవాలి. ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానంగా ఉండేది పార్టీ కార్యకర్తలే. ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి వారితో ఓట్లు వేయించింది కార్యకర్తలేనన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా కోటి కుటుంబాలను కలిశారు. ఇది మంచి పరిణామం అన్నారు. కోటి కుటుంబాలను కలిసిన మనం... వారి మనస్సులను కూడా గెలుచుకునేలా వ్యవహరించాలి." అని సిఎం సూచించారు.

"చెప్పిన విధంగా హామీలు అమలు చేస్తున్నామన్నారు.అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం అమలులోకి తీసుకుని వచ్చామన్నారు. ఏడాదికి రూ. 20 వేలు చొప్పున అర్హులైన ప్రతి రైతుకూ అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభించి మొదటి విడతగా రైతులకు రూ.7 వేలు జమచేస్తాం. ఇందులో రాష్ట్రం వాటా రూ.5 వేలు, కేంద్రం వాటా రూ.2 వేలు ఉంటుంది. 46,85,838 మంది రైతులకు లబ్ధి కలుగుతుంది. అన్నదాత సుఖీభవ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2,342.92 కోట్లు విడుదల చేసింది. కేంద్రం రూ.831.51 ఇస్తోంది. అర్హులైన రైతులందరి పేర్లు లబ్ధిదారుల జాబితాలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే ఎమ్మెల్యేలతో సమీక్షలు చేపడుతున్నాం. అప్పటికీ అర్హుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో లేకపోతే 155251 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.ఇక ఏపీ రవాణా వ్యవస్థ పటిష్టమవుతుందన్నారు.నిన్ననే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రంలో 27 రవాణా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసారన్నారు.నదులు, కాలువలు పుష్కలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచస్థాయి మన రాష్ట్రంలో డ్రై పోర్టులు మరిన్ని వస్తాయని తెలిపారు. అమరావతిలో 189 కి.మీ ఓఆర్ఆర్ నిర్మించమని సీఎం నితిని గడ్కరీని అడిగినట్లు వెల్లడించారు. విశాఖ, విజయవాడకు మెట్రో ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని, బయో ఇంధనం ఉత్పత్తిలోనూ వేగంగా చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు వివరించారు. అమరావతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మీదుగా బుల్లెట్ రైళ్లు కావాలని, వీటి ద్వారా 4 కోట్ల మంది ప్రయాణికులకు లబ్ధి జరుగుతుందని చంద్రబాబు అన్నారు. మనం అన్ని చేస్తున్నామన్నారు.వీటిని ప్రజలకు వివరించే బాధ్యతను మంత్రులు, శాసన సభ్యులు కీలకంగా తీసుకోవాలన్నారు.

## భారీ పార్కులు

>>కోరారు. అమరావతి రాజధాని నిర్మాణంపై అవగాహ నకోసం మంత్రి నారాయణ సింగపూర్‌లో పర్యటించారు. అక్కడ నుంచి మలేషియా చేరుకున్నారు. అమరావతి హరిత నగరం గాను, సమస్త వసతులు, విస్తృత రహదారులు, ఉద్యానవనాలు ఏర్పాటు వంటి అంశాలపై మంత్రి నారాయణ విస్తృతంగా దేశంలోని పలు నగరాల్లోను పర్యటించారు. తాజాగా ఆయన సింగపూర్, మలేషియాల్లో పర్యటించారు.

## నానిపై మరో కేసు

>> చేశారు. ఐటీ యాక్ట 353(2), 352, 351(4) సెక్షన్ల క్రింద సిఐ రమణయ్య అప్పట్లో కేసు నమోదు చేశారు. ఆదివారం కృష్ణాజిల్లా గుడివాడలోని కొడాలి నాని ఇంటికి వెళ్లిన పోలీసులు విచారణకు రావాలని 41 సిఆర్‌పిసి నోటీసులు ఇచ్చారు. నానిపై ఇప్పటికే కేసులున్నాయి.ఆయన ఈనడుమ తీవ్ర హృద్రోగ సమస్యకు గురై శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఇప్పుడిప్పుడే జనం మధ్యకు వస్తున్నారు.

## అమిత్ షా భేటీ

>> సమయంలో మోడీ, అమిత్‌షాలు తొలిసారి రాష్ట్రపతితో భేటీ అయ్యారు. అలాగే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించిన సుంకాల తర్వాత వీరి భేటీ ఇపుడు ప్రాధాన్యతను సంతరించుకుంది. అలాగే ఆపరేషన్ సింధూర్‌పై ఉభయసభల్లో జరిగిన చర్చలను కూడా రాష్ట్రపతి ముర్ముతో వీరిరువురూ పంచుకున్నట్లు సమాచారం. ఆగస్టు 12వరకూ జరిగే పార్లమెంటు సమావే శాల్లో చేపట్టే అజెండాపై కూడా వీరిమధ్య చర్చకు వచ్చినట్లు అధికార వర్గాల సమాచారం.

## వర్షసూచన

>> పల్నాడు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు... శ్రీకాకుళం, విజయనగరంపార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు, మిగతాజిల్లాల్లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## ఆరుగురు కూలీలు దుర్మరణం

>> నివేదిక, అందజేస్తూ ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మైనింగ్ డిడి రాజశేఖర్, ఎడి రామచంద్ర, సంతమాగులూరు సిఐ వెంకటరావు, బల్లికురవ ఎస్సై నాగరాజు,సంతమాగులూరు ఎస్సై పట్టాభి ప్రమాద స్థలంలో వివరాలను ఆరా తీస్తున్నారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మీడియాను సైతం నియంత్రించారు:**

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రమాద స్థలానికి వెళ్లేందుకు మీడియా ప్రతినిధులను సైతం వారి యాజమాన్యం అంగీకరించలేదు. పోలీసులు సైతం యాజమాన్యానికి వంతపడారు. దీంతో మీడియా ప్రతినిధులు అధికారుల తీరుపట్ల నిరసన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో గతంలో ఎన్నడు ఇలాంటి మీడియా నియంత్రణ కార్యక్రమాలు చూడలేదని జర్నలిస్టులు ఖండించారు.

**కోటి నష్టపరిహారం చెల్లించాలి: సిఐటియు డిమాండ్**

ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముసుందార్ డిమాండ్ చేశారు. గ్రానైట్ క్వారీలలో కార్మికుల భద్రతను గాలికి వదిలేసిన కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

**బల్లికుర్వ క్వారీ ఘటనపై గవర్నరు అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

బాపట్ల జిల్లా, బల్లికురవ క్వారీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంతోపాటు మరికొందరు గాయపడిన సంఘటనపై గవర్నరు అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈమేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. సంఘటనపై విచారణ చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ప్రమాదంలో ఇంతమంది ప్రాణాలు కోల్పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంపై అధికారులతో మాట్లాడిన సిఎం.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇదే ఘటనకు సంబంధించి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి.. జిల్లా కలెక్టరు, ఎస్‌పిలతో ఫోన్‌లో మాట్లాడి రెస్క్యూ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. క్వారీ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగాకోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. క్వారీప్రమాదంలో ఆరుగురు మరణించడం అత్యంత బాధాకరమని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ తరహా ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు రవాణాశాఖ మంత్రి మండపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి సూచించారు.

# నేడు మండలి శతజయంతి

### స్మృతి సంచిక ఆవిష్కరించనున్న సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఆగస్టు 3,ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగునాట మాతృభాషోద్యమాన్ని ఉధృతం చేసిన అక్షరయోధుడు మండలి వెంకట కృష్ణారావు, దివి సీమ ఉప్పెన సమయంలో ప్రాణాలకు తెగించి సేవలను అందించిన మహనీయుడు. గాంధీజీ బాటలో శుద్ధఅహింసా వాదిగా జీవిత పర్యాంతం నిబద్ధతతో నిలిచిన నాయకుడు. ఆయన శతజయంతి సోమవారం జరుగుతుంది.ఈ నెల 4వ తేదీ ఉదయం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల ప్రారంభ సభ జరుగుతుంది. ఇది ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండలి వెంకట కృష్ణారావు స్మృతి సంచికను లైట్ ఆఫ్ ది స్టార్మ్‌ను ఆవిష్కరిస్తారు. 1926 ఆగస్టు 4న కృష్ణా జిల్లా కైకలూరు తాలూకా, పల్లెవాడ గ్రామంలో మండలి వేంకట కృష్ణారావు దివిసీమ గాంధీగా ప్రజల మన్ననలనందుకున్నారు. 1997 సెప్టెంబర్ 27న తుదిశ్వాస విడిచారు. 'బాధలలో ఉన్న వారిని మనమే ముందు వెల్లి ఓదార్చాలని' వారు ఆచరించి చెప్పిన మాటలు దివిసీమ ప్రజలకు భగవద్గీతలా వినిపిస్తూనే ఉంటాయి. మండలి వేంకట కృష్ణారావు కృషి వల్లే దివిసీమలోని నిరుపేదలకు బంజరు భూములను పంచె కార్యక్రమం 1955లో ప్రారంభమైంది. 15 వేల ఎకరాల బంజరు భూములను పేదలకు పంచారు. 1974 లో ఆయన విద్యా - సాంస్కృతిక వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 1975 రాక్షస నామ సంవత్సరం ఉగాదినాడు ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణ కమిటీకి మండలి వెంకట కృష్ణారావు కార్య నిర్వాహక అధ్యక్షునిగా వ్యవహరించారు. తాము ఈ రెండు అంతర్జాతీయ తెలుగు కేంద్రం పేరును 'మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం'గా మార్చారు. వెంకట కృష్ణారావు బాటలోనే ఆయన కుమారుడు పూర్వపు అధికార భాషా సంఘం అధ్యక్షుడు, మాజీమంత్రి,ఇప్పటి జనసేన ఎంఎల్‌ఏ మండలి బుద్ధ ప్రసాద్ తెలుగు భాషకు సేవలందిస్తున్నారు. దగ్గర, దగ్గర అయిదు ప్రపంచ తెలుగు మహా సభల నిర్వాహణలో ఆయన కీలక భూమికను పోషించారు.

## గడ్కరీ నివాసం పేల్చేస్తామని బెదిరింపు: దుండగుడి అరెస్ట్

**నాగపూర్,ఆగస్టు 3:** కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి నాగపూర్ నివాసాన్ని పేల్చేస్తామంటూ అజ్ఞాత వ్యక్తి నుంచి ఆదివారం ఉదయం 8.46 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. వార్ధారోడ్డులోని గడ్కరి ఇల్లు పేల్చేస్తామని సమాచారం రావడంతో పోలీసులు స్థానిక ప్రతాప్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఆ తర్వాత కొద్దిసేపటికే బెదిరింపు కాల్‌చేసిన అనుమానితుని అరెస్టు చేశారు. అతనిని ఉమేష్ విష్ణు రౌత్‌గా గుర్తించారు. మెడికల్ చౌక్ సమీపంలోని స్థానిక సారాదుకాణంలో పనిచేస్తున్నట్టు గుర్తించారు. తన మొబైల్ నెంబర్ నుంచి అతను ఫోన్‌చేశాడు. పది నిమిషాల్లో గడ్కరి నివాసం పేల్చేస్తామని బెదిరించాడు. నాగపూర్‌లోని బీమా దవాఖానా సమీపంలో అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. తదుపరి విచారణ జరుగుతోంది. అజ్ఞాత వ్యక్తి నుంచి బెదిరింపు కాల్ వచ్చినప్పుడు గడ్కరి నాగపూర్‌లోనే ఉన్నారు. ఆయన క్షేమంగానే ఉన్నారని, అన్ని ముందస్తుచర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. మంత్రి నివాసం వద్ద గట్టి బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు 112 ఎమర్జెన్సీ హెల్ప్ లైన్‌కు గడ్కరీ ఇంటివద్ద బాంబుపెట్టామని, అది పేలడానికి సిద్ధంగా ఉందని ఒక ఫోన్‌వచ్చిందని, వెంటనే బాంబు స్క్వాడ్‌ను అక్కడికి పంపడంతో పాటు మంత్రి వ్యక్తిగత భద్రతా సిబ్బందినికూడా అప్రమత్తం చేశామని జోన్1 డీసీపీ రిషీకేష్ రెడ్డితెలిపారు. గడ్కరినివాసంలో ఎలాంటి బాంబు కనిపించక పోవడంతో అది ఉత్తుత్తి బెదిరింపేనని తేలినట్టు చెప్పారు. పట్టుబడిన నిందితుడికి ఎలాంటి క్రిమినల్ రికార్డు లేదని, అతని ఫోన్ నుంచి కాల్ రావడంతోఅరెస్టుచేసి మరింత సమాచారం రాబడుతున్నామని వివరించారు.

## ఐసియులో జెంఎంఎం నేత శిబుసోరెన్

>> పర్యవేక్షణలో ఉంచారని, ప్రస్తుతం ఐసియులో ఉన్న సోరెన్‌ను పరిమిత వ్యక్తులను మాత్రమే కలిసేందుకు అనుమతి ఉందని చెపుతున్నారు. దిశోంగురుగాపిలుచుకునే తమ నేత సత్వరమే కోలుకుని జార్ఖండ్‌కు రావాలని ప్రజలంతా ప్రార్థిస్తున్నట్లు నాయకులు చెపుతున్నారు. న్యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ నిపుణుల వైద్యబృందం ఆయన్ను పర్యవేక్షిస్తోంది. ఆయనకు బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందని ఆకారణంగా ఆయన శరీరంలోని ఎడమభాగం పక్షవాతానికి గురయిందని వైద్యులు తెలిపారు. 81 ఏళ్ల శిబుసోరెన్ చాలాకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. ఏడాదిగా ఆయనకు డయాలసిస్ చేస్తున్నారు. డయాబెటిస్‌కూడా ఉన్న ఆయన గుండెకు బైపాస్ సర్జరీకూడా చేయించుకున్నారు.

## ఎర్త్ డ్యామ్ గ్యాలరీపై ఇంత నిర్లక్ష్యమా?

>> ఇంజనీర్ కూడ ఏనాడు పత్రికా ప్రకటన చేయలేదు. నిపుణుల కమిటీ కూడ ప్రాజెక్టు పరిశీలించిన తర్వాత ఎర్త్ డ్యాం గ్యాలరీ ఎలా ఉందో చెప్పలేదు. నిపుణుల కమిటీ పరిశీలన తర్వాత కడప చీఫ్ ఇంజనీర్ శ్రీరామ చంద్రమూర్తి మాత్రమే మీడియాతో మాట్లాడారు. ఈ సంధర్భంగా కూడ గ్యాలరీకి సంబంధించిన సమాచారం ఏ మాత్రం వివరించలేదు. దీనికి సంబంధించి 'వార్త' క్షేత్ర స్థాయిలో నిపుణుల కమిటీతో పాటు వెళ్లిన ఓ ఇంజనీరింగ్ అధికారిణి ఎర్త్ డ్యాం గ్యాలరీని నిపుణుల కమిటీ పరిశీలించిందా అని ప్రశ్నించగా లోపలికి వెళ్లేందుకు అవకాశం ఉన్నట్లు కనిపించలేదని వ్యాఖ్యానించారు. ఇక పోతే ఎర్త్ డ్యాం గ్యాలరీ అన్నమయ్య ప్రాజెక్టుకు ఎందుకంతా కీలకం అంటే ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సొరంగాలు పడటంతో విదేశి, స్వదేశి నిపుణుల పరిశీలన తర్వాత డ్రిల్లింగ్, గ్రౌటింగ్ పద్ధతిలో లిక్విడ్ సిమెంట్‌తో సొరంగాలను పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. డ్రిల్లింగ్ గ్రౌటింగ్ చేపట్టిన తర్వాత 30ఏళ్ల క్రితం జరిగిన ఈ ప్రక్రియ సక్సెస్ అయిందా లేదా తెలుసుకునేందుకు అప్పటి సాంకేతిక పరిజ్ఞానం మేరకు ఎర్త్ డ్యాం గ్యాలరీని నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటు డయా ఫ్రం వాల్ నిర్మాణం కూడ కీలకమైందే. ఎర్త్ డ్యాం గ్యాలరీ డయా ఫ్రం వాల్ ఎర్త్ డ్యాం నిర్మాణం తర్వాత ప్రాజెక్టులో నీటి నిల్వ పరిశీలనకు నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టులో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం మేరకు నీరు నిల్వ చేసిన తర్వాత డయా ఫ్రం వాల్ నిర్మాణం పక్కాగా నిర్మించినట్లు తేలింది. అంతేకాకుండా నదీ గర్భంలో బయటపడిన సొరంగాలను డ్రిల్లింగ్, గ్రౌటింగ్ పద్ధతితో పూడ్చిన తర్వాత కూడ ఎలాంటి లీకేజీ లేదని నిపుణుల కమిటీ ఎర్త్ డ్యాం గ్యాలరీని పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంటే ఈ ప్రాజెక్టులో నీరు భూగర్భంలో సొరంగాల ద్వారా ఎర్త్ డ్యాం నుంచి అవతలి వైపుకు నీరు లీకేజ్ కావడం లేదని తెలుసుకునేందుకు ఏకైక మార్గం గ్యాలరీ. గ్యాలరీ నిర్మాణంలో ఎక్కడ సిపేజి కన్పించిన ప్రాజెక్టులో నీటి నిల్వ అనుమానమే. అలాంటి కీలకమైన ఎర్త్ డ్యాం గ్యాలరీని కనీస పరిశీలన ప్రాజెక్టు అధికారులు ఎందుకు చేయలేదు. ప్రాజెక్టులో పూర్తిగా నీటి ప్రవాహం నిలిచిపోయిన తర్వాత కూడ లోపల పరిస్థితి ఎలా ఉంది తెలుసుకునేందుకు కనీస ప్రయత్నం చేయలేదని తెలుస్తోంది. అదేకనుక గ్యాలరీలోపలికి వెళ్లేందుకు అవసరమైన పూడిక తొలగించి ఉన్నట్లు అయితే నిపుణుల కమిటీ ప్రాజెక్టు పునర్నిర్మాణ విషయంలో ఒక అవగాహణకు వచ్చేందుకు అవకాశం ఉండేది. అయితే నిపుణుల కమిటీ మొత్తం ప్రాజెక్టు పునర్నిర్మాణ విశయంలో నదీ అంతర్భాగంలో భౌగోళిక పరిస్థితులు తెలుసునేందుకు 'జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్' సిఫార్సు చేసినట్లు సమాచారం. ఏది ఏమైనా ఎర్త్ డ్యాం గ్యాలరీ పట్ల ప్రాజెక్టు అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపారని తెలుస్తోంది.

కాగా 2021 నవంబర్ 19 రాత్రి భారీ వరదలు పోటెత్తడం వల్ల ఎర్త్ డ్యాం గ్యాలరీ కొట్టుకుపోయిన విశయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు ఎన్ని లక్షల క్యూసెక్కుల నీరు వరద వచ్చిందనేందుకు ప్రాజెక్టు అధికారుల వద్ద స్పష్టమైన సమాచారం లేదు. ఎంత వరద వచ్చిందని తెలుసుకోవాలంటే సిడబ్ల్యూసి ప్రాజెక్టు కింది భాగంలో చెయ్యేరు వంతెన వద్ద వరద ప్రవాహాన్ని బట్టి తెలుసుకొనే అవకాశం ఉంది. అంతేకాకుండా చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతం నుంచి వచ్చిన వరద నీటిని పెన్నా నదీ క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద నీటిలో తీసివేస్తే ఆ రోజున సంగం వద్ద ఎంత వరకు వరద వచ్చిందని తెలిపోయే అవకాశం ఉంది. ఇవన్ని ఎందుకు ప్రస్తావించాల్సి వస్తుందంటే కేవలం 2.242 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం మాత్రమే కలిగిన అన్నమయ్య ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత కేంద్ర జలసంఘం డిజైన్ ప్రకారం నీటి విడుదల సామర్థ్యం 2.85లక్షల క్యూసెక్కులు. అదే 78 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న రాష్ట్రంలోనే పెద్ద ప్రాజెక్టులలో ఒకరైనా సోమశీల ప్రాజెక్టు నీటి విడుదల సామర్థ్యం కూడ దాదాపు 7లక్షలే. అన్నమయ్య ప్రాజెక్టుకు కేవలం బాహుదా, పింఛా, పాపాగ్ని, చెయ్యేరు నదుల కలయిక ద్వారా వచ్చే వరద నీరు మాత్రమే ఉంటుంది. అదే పెన్నానదికి మరెన్నో నదులు, ఉప నదులు ద్వారా వరద నీరు ప్రవహించి సోమశీలకు చేరుతుంది. ఈ విధంగా పెన్నా నదీ పరివాహక వరద నీటితో పోటెత్తే పరిస్థితితో చెయ్యేరు నదికి వచ్చే వరద నీటిని లెక్క వేస్తే సాంకేతికంగా నామమాత్రంగానే కనిపిస్తుంది. 78టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన సోమశీల ప్రాజెక్టులో నీటి విడుదల లెకానిజంను పరిశీలిస్తే అన్నమయ్య ప్రాజెక్టుకు వరదలు వచ్చినప్పుడు జరిగిన దురదృష్టకర దుర్ఘటనకు ఏదో బలమైన నిర్లక్ష్యం స్పష్టంగా తెలుస్తోంది. అధికారులు చెబుతున్న వరద నీటి లెక్కలు నిజమేనా అన్న అనుమానాన్ని కలిగిస్తున్నాయి. ఏది ఏమైనా నిపుణుల కమిటీ నివేదికలో అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సంబంధించి స్పష్టమైన సమాచారం బయట పడనుంది. అధికారుల పాత్ర కూడ తేలనుంది.

## వారం - వర్జ్యం

తేది : 04-08-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
దశమి ఉ.11.39
అనూరాధ ఉ.9.11
వర్జ్యం మ.3.17-5.01
దు.ము.12.40-1.31, 2)మ.3.14-4.05
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఓర్పు, నేర్పులతో ముఖ్య వ్యవహారాలు సానుకూలపరచుకునే యత్నాలుచేస్తారు.

**వృషభం :** ఉద్యోగులకు బదిలీల సూచన. వ్యాపారాలలో స్వల్పమార్పులు ఉంటాయి.

**మిథునం:** స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి. నూతనవ్యక్తుల పరిచయమై మాట సహాయం అందిస్తారు.

**కర్కాటకం :** నూతన ప్రయత్నాలు నిదానంగా నెరవేరతాయి. ఆర్థికపరిస్థితి అనుకూలంగా ఉంటుంది.

**సింహం:**విలాసజీవితం సాగిస్తారు. పాతబాకీలు వసూలవుతాయి. ఆస్తివివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**కన్య :** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. వివాహ, ఉద్యోగ యత్నాలు సాగిస్తారు. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి

**తుల :** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**వృశ్చికం:**ఆర్థికపరమైన లావాదేవీలలో ఆటుపోట్లు తొలుగుతాయి. ఆరోగ్యపరమైన సమస్యలు తొలుగుతాయి.

**ధనుస్సు:** శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు. గృహం, స్థలాలు కొనుగోలు చయ్యాలు సాగిస్తారు.

**మకరం:** కోర్టుకేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కుంభం:** విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**మీనం :** భాగస్వామ్యవ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి. అనుకోని అవకాశాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నోటిపైకాని స్టేషన్‌లో కేసు చెల్లదు..

>> తరపున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ...సాంకేతిక కారణాలు చూపి ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరలేరని తెలిపారు. ఎసిబి విభాగంలోని జాయింట్ డైరెక్టర్ల కార్యాలయాలను పోలీస్ స్టేషన్‌లుగా గుర్తిస్తూ 2003లో ప్రభుత్వం జిఒ ఇచ్చిందన్నారు. పునర్విభజన చట్టం లోని సెక్షన్లు 101,102 ప్రకారం రాష్ట్ర విభజన అనంతరం ఆ చట్టాలు అమల్లో ఉంటాయని తెలిపారు. విజయవాడ లోని ఏసీబీ సీఐయూ కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్‌గా నోటిఫై చేస్తూ 2022లోనే నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ,కేసులు నమోదు చేసేందుకు వాటికి తాత్కాలికంగా అర్హత ఉంటుందన్నారు.

## 'దర్శన' కష్టాలు తప్పవా?

>> ప్రస్తుతం విదేశాల్లో అమలుచేస్తున్న గూగుల్, టిసిఎస్ సంస్థల సహకారం కోరినా తిరుమలలో తొలుత ప్రయోగాత్మక అమలులోనూ సందిగ్ధాలు ఎదురయ్యాయి. ఓ దశలో దీన్ని అమలుచేయడం కష్టమని సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సంస్థలు వ్యక్తంచేశాయి. దీంతో పాలకమండలి, టిటిడి అధికారులు కూడా ప్రత్యామ్నాయంగా అలిపిరి వద్ద బేస్‌క్యాంప్ నెలకొల్పి సకల సౌకర్యాలు కల్పించాలనే నిర్ణయంతో కార్యాచరణ మొదలుపెట్టారు. దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి విచ్చేస్తున్న భక్తులకు వసతి,దర్శన సదుపాయాలు మరింత సులభం చేయడానికి వీలుగా తిరుపతి అలిపిరి వద్ద బేస్‌క్యాంపు ఏర్పాటు సిద్ధమవుతోంది. సుమారు 15హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటు జరగనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో 40వేలమంది భక్తులు దాటితే ఇక క్యూలైన్లు చాంతాండంత దూరం వ్యాపించడం,సర్వదర్శనానికి వారాంతం, రద్దీరోజుల్లో 24గంటల నుండి 30 గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితులు వున్నాయి. ఏడుకొండలస్వామి క్షణకాల దర్శనమ్ సామాన్యభక్తుడికి ఇబ్బంది లేకుండా చూడాలనే ఉద్దేశ్యం టిటిడి పాలకమండలి ఛైర్మన్‌తోబాటు టిటిడి ఇఒ,అదనపు ఇఒల ఆలోచన. ప్రతి భక్తుడు గోవిందుని దర్శనానంతరం తిరుగుప్రయాణంలో సంతోషంగా వెళ్లాలనే ఆలోచన అధికారుల్లో బలంగా వ్యక్తమవుతోంది. అన్నిరోజుల్లోనూ సుమారుగా 30వేలమందివరకు ఎలాంటి టిక్కెట్లు, టోకెన్లు లేకుండా సాధారణ సర్వదర్శనమ్‌లోనే స్వామివారిని దర్శనం చేసుకొంటున్నారు.ఈ నేపధ్యంలో రోజువారీగా 80వేలమంది భక్తులకు తిరుమలేశుని దర్శనమ్ చేయించే అవకాశం కలుగుతోంది. మిగిలిన మరో 30-40వేలమందిభక్తులు వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలోనో, వెలుపల క్యూలైన్లలోనిరీక్షణ తప్పడం లేదు. రెట్టింపవుతున్న భక్తులకు సకాలంలో కిలోమీటర్లు క్యూలైన్లలోగాక మరో వైకుంఠమ్ 3 కాంప్లెక్స్ నిర్మించి సౌకర్యాలు కల్పించడమే మంచిదనే అనుభవజ్ఞుల సూచనలు.

# మెగా డీఎస్సీ తుది 'కీ' పై ఫిర్యాదు

**విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా డీఎస్సీ తుది 'కీ'లోనూ కొన్ని ప్రశ్నలకు జవాబులు తప్పుగా ఉన్నాయని నెల్లూరుకు చెందిన ఓ అభ్యర్థి డీఎస్సీ హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. జులై ఒకటిన ఉదయం విడతలో నిర్వహించిన ఎస్జీటీ పరీక్షలో నాలుగు ప్రశ్నలకు తుది 'కీ'లో తప్పులు దొర్లాయని పేర్కొన్నారు. ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలు తెలిపిన పరిగణనలోకి తీసుకోలేదని వెల్లడించారు. వీటిని పరిశీలించాలని అభ్యర్థించారు. ప్రైమరీ కీలో అభ్యంతరాలు తెలిపినప్పటికి తగిన రీతిలో స్పందించలేదని ఫిర్యాది పేర్కొన్నారు. అభ్యంతరాలు వేటిని పట్టించుకోకుండా తుది కీ విడుదల చేసారన్నారు. దీనిపై సవరణతో పాటు వివరణ కావాలన్నారు.

## అనధికారిక హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలపై
# మార్గదర్శకాలు రూపొందించిందా!

### ప్రభుత్వం వివరాలతో నివేదిక ఇవ్వాలన్న హైకోర్టు

**విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి:** హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు,బోర్డ్లు ఏర్పాటుకు అనుమతిచ్చే విషయంలో నగరపాలక సంస్థలు,పురపాలక సంస్థలు,స్థానిక సంస్థలకు మార్గదర్శనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా విధానాన్ని రూపొందించిందా? వర్షం,బలమైన గాలులు వీచినప్పుడు వాటి వల్ల ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అందులో పొందుపరిచారా? రాష్ట్రంలో అధికారికంగా ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులు,హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఎన్ని అనధికారికంగా ఏర్పాటు చేసినవెన్ని, ఇలాంటి వాటిపై అందిన ఫిర్యాదులెన్ని, వాటిలో ఎన్నింటిని పరిష్కరించారు'అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ వివరాలతో నివేదిక ఇవ్వాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ ఉత్తర్వులిచ్చింది. తగిన సమయంలో పిల్‌పై విచారణ చేపడతామంటూ వాయిదా వేసింది. అక్రమంగా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లు,బ్యానర్లను తొలగించడంలో అధికారులు విఫలమయ్యారంటూ డాక్టర్ అగరాల ఈశ్వర్‌రెడ్డి 2018లో హైకోర్టులో పిల్ వేశారు. ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం నగరాలు,పట్టణాలు ఉన్నది విచ్చలవిడిగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడానికి కాదని ఘాటుగా వ్యాఖ్యానించింది. వాటి వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వెల్లడించింది. వీటిని నియంత్రించాలని పేర్కొంది. తాజాగా జరిగిన విచారణలో అమికస్ క్యూరీ వివేక్ చంద్రశేఖర్ అనధికారిక హోర్డింగ్‌లు,ఫ్లెక్సీల బ్యానర్ల తొలగింపుపై గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కోర్టు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి నివేదిక కోరింది.

# డిగ్రీ అడ్మిషన్లకు 18న నోటిఫికేషన్
## 27న సీట్ల కేటాయింపు, 28 నుంచి తరగతులు

**విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి:** డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి తాత్కాలిక షెడ్యూలు రూపొందించింది. ఈ నెల 19న నోటిఫికేషన్ జారీ చేయాలని భావిస్తోంది. ఈలోగా ఈ నెల 4 వరకు కాలేజీలు కోర్సులను సింగిల్ మేజర్‌లోకి మార్చుకునేందుకు గడువు పొడిగించింది. 7న సింగిల్ మేజర్‌పై నిబంధనలు జారీ చేయనుంది. 9 నుంచి 16 వరకు కాలేజీలకు యూనివర్సిటీలు అఫిలియేషన్లు మంజూరుచేస్తాయి. 18 నుంచి 20 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చు. 21 నుండి 24 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపికకు గడువు ఇస్తారు. 27న సీట్లు కేటాయించి, 28 నుంచే తరగతులను ప్రారంభిం చేందుకు అనుమతిస్తారు. కాగా,ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ ధరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు. విద్యార్థులు నేరుగా కాలేజీలకు వెళ్ళి దరఖాస్తు సమర్పిస్తారు. అయితే దానిని కూడా ఆన్‌లైన్ చేస్తారు. ఒక వేళ విద్యార్థి ఆఫ్‌లైన్,ఆన్‌లైన్ రెండింటి లోనూ ధరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్ దరఖాస్తుకు తొలి ప్రాధాన్యత ఇస్తారు. ఆఫ్‌లైన్‌లో కోరుకున్న కాలేజీల్లో సీటు రాకపోతే ఆన్‌లైన్ ఎంపికలు తర్వాతి ప్రాధాన్యతలో ఉంటాయి.

# రైల్వేలో ప్రారంభమైన స్వచ్ఛత పక్షోత్సవం

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 3,ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మగాంధీ కలలుగన్న పరిశుభ్రమైన భారతావని సాధించడమే లక్ష్యంగా స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛత అభియాన్ కార్యక్రమం 11వ వార్షికోత్సవం సందర్బంగా దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లో శుక్రవారం లాంచనంగా ప్రారంభించామన్నారు.

**స్వచ్ఛత అభియాన్-25 షెడ్యూల్:** ఈ సందర్భంగా సంబంధిత ఉన్నతాధికారులు మాట్లాడుతూ స్వచ్ఛత అభియాన్-25 కార్యక్రమం 11వ వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం నుంచి స్వాతంత్ర్య దినోత్సవం వరకు ప్రతిరోజు చేపట్టే కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈ నెల 4న రైల్వే స్టేషన్‌లు, కాలనీ,రైల్వే పరిసరాల్లో శ్రమదానం, 5న బయో టాయిలెట్ వినియోగంపై అవగాహన, 6,7వ తేదీల్లో వర్క్‌స్పాట్‌లలో పరికరాల శుభ్రత, 8న డస్ట్ బిన్‌ల వినియోగం, 9న ప్లాస్టిక్ వాడకం నిషేధం, 10న రైల్వే స్టేషన్‌లు, కార్యాలయాల్లో దివ్యాంగులటాయిలెట్ల వినియోగం, 11న సఫాయి కార్మికులకు హెల్త్ క్యాంపులు, 12న రైల్వే క్యాంటీన్‌లు, ఫుడ్‌స్టాల్స్,పాంట్రీకార్‌లలో పరిశుభ్రత, 13న నీటి ప్లాంటు, ఫిల్టర్లు, 14న రైలు మార్గాలను శుభ్రం చేయడం, 15న స్వచ్ఛత అభియాన్ పక్షంరోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

# విద్యుత్తులో రెవెన్యూ లోటును సర్దుబాటు చేసుకుంటాం
## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్తు రంగంలో రెవెన్యూ లోటును సర్దుబాటు చేసుకుంటాం.వినియోగదారుడిపై భారం వేయమని ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. ప్రతి ఐదేళ్ళకు ఒకసారి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల ఆదాయ వ్యయాల నివేదికను సమీక్షించే విధానం 2006-07 నుంచి అమల్లోకి వచ్చింది. ఆ మేరకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలికి రెవిన్యూ గణాంకాలను సమర్పించాలి.అందులో భాగంగానే 2019-20 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకూ ఆర్థికాంశాల నివేదికను ఈఆర్‌సీకి అందచేశాం. నివేదికలో పేర్కొన్న రెవిన్యూ లోటును వచ్చే వార్షిక ఆదాయ వ్యయాల నివేదిక(ఏఆర్ఆర్)లో సర్దుబాటు చేసుకుంటాం.ఈ నివేదికలపై ప్రభాభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలను కూడ పరిగణలోకి తీసుకుంటాం. ఈఆర్‌సీ ఇచ్చిన నోటీసుకు ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ నెల 29న వెల్లడిస్తాం'అని విజయానంద్ పేర్కొన్నారు.



# బిఇఎస్ఎస్‌కు ఇఆర్‌సి గ్రీన్ సిగ్నల్

**విజయవాడ,ఆగస్టు 3,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బీఈఎస్ఎస్)ను అమలు చేసేందుకు విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పవర్ సిస్టం డెవలప్‌మెంట ఫండ్(పీఎస్‌డీఎఫ్) కింద నిధులు వ్యయం చేసేందుకు కూడ ఈఆర్‌సీ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఏపీఈఆర్‌సీ ఉత్తర్వుల జారీ చేసింది. సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో పగటి పూట ఉత్పత్తి అయిన విద్యుత్తును రాత్రి సమయం లోనూ వినియోగించుకునేందుకు వీలుగా బ్యాటరీ స్టోరేజీ విధానాన్ని వాడుకోవాలని కేంద్ర ఇంధన శాఖ రాష్ట్రాలకు సూచించింది. ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఇంధన శాఖ నిర్ణయించింది. ప్రధానంగా గిరిజన తండాల్లో సౌర విద్యుత్‌ను బ్యాటరీలో నిక్షిప్తం చేసి రాత్రి సమయంలో వాడుకునే పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఇప్పటికే కార్యాచరణను రూపొందించాయి. ఈ కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును పరిశీలించిన ఈఆర్‌సీ వయబిలిటీ గ్యాఫ్ ఫండింగ్(వీజీఎఫ్) కింద బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంకు నిధులు వ్యయం చేసుకోవచ్చుంటూ ఏపీ ట్రాన్స్‌కోకు అనుమతి ఇచ్చింది. నోడల్ ఏజెన్సీగా ఏపీ ట్రాన్స్‌కో బీఈఎస్ఎస్ కోసం టెండర్లు పిలవనుంది.


# ప్రత్యేక రైళ్లు సెప్టెంబరు వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 3,ప్రభాతవార్త:** ప్రస్తుత పండుగల సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ ప్రస్తుతం నడుపుతున్న ప్రత్యేక రైలు సర్వీసులను సెప్టెంబరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రతి బుధవారం విశాఖపట్నం నుంచి తిరుపతికి బయలుదేరే నెంబర్ 08547రైలు ఈ నెల 6నుంచి సెప్టెంబరు 24వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో ప్రతి గురువారం తిరుపతి నుంచి విశాఖకు బయలుదేరే నెంబర్ 08548ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7నుంచి సెప్టెంబరు 25వరకు పొడిగించారు. అలాగే ప్రతి శుక్రవారం విశాఖ నుంచి చర్లపల్లికి బయలుదేరే నెంబర్ 08579రైలు ఈ నెల 8నుంచి సెప్టెంబరు 26వరకు పొడిగించగా, ప్రతి శనివారం చర్లపల్లి నుంచి విశాఖకు బయలుదేరే నెంబర్ 08580రైలు ఈ నెల 9నుంచి సెప్టెంబరు 27వరకు పొడిగించారు.

# కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు ఒకే విడత రూ.20వేలు చెల్లించాలి

**విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం నిధులు ఒకే విడత కింద రూ.20 వేలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధా కృష్ణ, ఎం హరిబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి రైతుకూ అన్నదాతా సుఖీభవ పథకం వర్తింపజేయాలన్నారు. భూమి లేని కౌలు రైతులందరికీ ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో ముందస్తుగా వారందరినీ గుర్తించి కార్డులు మంజూరు చేయాలన్నారు. 10లక్షల మంది కౌలు రైతులకు కార్డులివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. ఇప్పటి వరకు 3 లక్షల మందికి కూడా ఇవ్వలేదన్నారు. 2019 పంట సాగు హక్కు చట్టంలో మార్పులు చేసి భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరినీ గుర్తించి ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్భాటం చేసిన టిడిపి ప్రభుత్వం.. నూతన చట్టం మాత్రం అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో 53.58 లక్షల మందికి పెట్టుబడి సాయం ఇవ్వగా, ప్రస్తుతం 46.68 లక్షల మందికి మాత్రమే ఇచ్చారన్నారు. అందులో 6.72 లక్షల మందిని అనర్హులుగా ప్రకటించారన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి కాకాని వెంకట రత్నం జయంతి



ఠాగూర్ లైబ్రరీకి 100మంది విద్యార్థు లకు శాశ్వత సభ్యాత్వాన్ని గ్రంధాలయాధికారికి చెల్లిస్తున్న కాకాని తరుణ్

**విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్గీయ మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం 125వ జయంతిని ఠాగూర్ స్మారక గ్రంథాలయం లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మనవడు కాకాని తరుణ్ వెంకటరత్నం యొక్క విశిష్ట సేవలు గురించి ప్రస్తావించారు. గుర్తుగా ఠాగూర్ గ్రంథాలయానికి ఏపీఎస్ఆర్ఎం పాఠశాల లోని 100మంది విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం కట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పేద విద్యార్థులకు ఎంతో సేవ చేయొచ్చు అని ఆ విదంగా , నలుగురికి సహాయం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని ఈ గ్రంథాలయానికి విద్యార్థులు వచ్చి చదువుకొనుటకు విద్యార్థుల కొరకు సభ్యత్వం ఇప్పించడం సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థులు అందరూ కూడా ఉన్నత స్థాయికి చేరటానికి గ్రంథాలయ సంస్థ మరియు సిబ్బంది ఎంతో కృషి చేయుచున్నారని దానిని మీరు అందరూ సద్వినియోగపరచుకొని ఉన్నత స్థానాలు అందుకోవాలని కోరారు. స్వర్గీయ కాకాని వెంకటరత్నం గారి జయంతి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. వెంకటరత్నం గారి పేరుతో ఉన్నటు వంటి గ్రంథాలయం ఎంతోమందికి ఉపయోగపడుతున్నందుకు పుట్టినరోజు కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఠాగూర్ గ్రంథాలయం సిబ్బంది అధికారులు నిస్వార్ధంగా సేవ చేస్తున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.కాకాని తరుణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు ఠాగూర్ గ్రంధాల అధికారి కే.రమాదేవి తెలియజేశారు.

# బాపట్ల జిల్లా క్వారీ ప్రమాదంపై న్యాయ విచారణ జరపాలి: సిపిఎం రాష్ట్రకమిటీ

**విజయవాడ,ఆగస్టు3,ప్రభాతవార్తప్రతినిధి:** బాపట్ల జిల్లాలో బల్లికురవ సమీపంలో సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ఈ రోజు బండరాళ్ళు పడి ఏడుగురు మరణించడం పట్ల సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. చనిపోయినవారి కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, గాయపడిన వారికి సరైన వైద్యం, పది లక్షల సహాయం అందించాలని, క్వారీలో సరైన భద్రతా చర్యలు చేపట్టని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ క్వారీ నిర్వహణకు ప్రభుత్వం అనుమతి లేదన్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపింది. క్వారీ యాజమాన్యం సరైన భద్రతా చర్యలు చేపట్టనందువల్లనే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా అధికారులు అంచనాకు వచ్చినందున వెంటనే కారకులైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ప్రమాదానికిగల కారణాలపై న్యాయ విచారణకు ఆదేశించాలని సిపిఐ(యం) కోరింది. ఆమేరకు సీపీఎం ఒకప్రకటన విడుదల చేసింది.

# సామర్లకోటలో తల్లి, ఇద్దరు కుమార్తెలు దారుణ హత్య
## ప్రత్యేక క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్లు ఆధారాలు సేకరిస్తున్నాయి: ఎస్పీ బిందు మాధవ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఆగస్టు 3 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా,సామర్లకోట సీతారామ కాలనీలో దారుణం జరిగింది. తల్లి, ఇద్దరు కూతుళ్లను దారుణంగా హత్య చేసిన ఘటన చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు తలలు పగలగొట్టి ముగ్గురిని హత మార్చినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతులను ములపర్తి మాధురి, కుమారి, జెసిలని తెలిసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రసాద్, మాధురి దంపతులు కూతుళ్ళతో కలిసి స్థానిక సీతారామ కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రసాదు ప్రైవేటు డ్రైవర్గా పనిచేస్తున్నాడు. మాధురి ఇంటిలోనే ఉంటుంది. గత రాత్రి డ్యూటీ కి వెళ్ళిన ప్రసాద్ ఉదయం ఇంటికి వచ్చేసరికి భార్య,ఇద్దరు కూతుళ్లు రక్తపు మడుగులో పడిపోయి ఉండడం చూసి ప్రసాద్ షాక్ గురయ్యాడు. దాంతో ప్రసాద్ కేకలు అరుపులు పెట్టడంతో చుట్టుపక్కల వారు వచ్చి సంఘటనను చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీతారామ కాలనీలో ఒకేసారి ముగ్గురు హత్యకు గురికావడం స్థానికంగా సంచలనం సృష్టించింది. ఘటనా స్థలాన్ని పెద్దాపురం డిఎస్పి శ్రీహరిరాజు పరిశీలించారు.



భర్త ప్రసాద్ ఇంట్లో వెనుక వైపు తలుపులు తెరిచి ఉండ టంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. మృతుల తలలపై దారుణంగా సుత్తితో దుండగులు కొట్టినట్లు పోలీసులు కనుగొ న్నారు. అలాగే వీరికి ఎవరితోనైనా శత్రుత్వం గాని, కుటుంబ కలహాలు ఉన్నాయా అనే కోణం లో పోలీసులు విచారణ చేపట్టారు. ముగ్గురిని మర్డర్ సంఘటన ఇప్పుడు సంచలనం గా మారింది.

ఈ ఘటనపై జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లా డుతూ ములపర్తి మాధవి, ఇద్దరు కూతుర్లు 6,8 సంవత్సరాల పిల్లలు ఇంట్లో చనిపోయి పడి ఉండడం కనిపించారని భర్త ప్రసాదు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చార న్నారు. ఘటన సంబంధించి ప్రత్యేక క్లూస్ టీమ్లు,డాగ్‌స్క్వాడ్లు ఆధారాలు సేకరిస్తున్నాయని త్వరితగతిన నిందితులను పట్టుకునేందుకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

**దొరవారిసత్రం, ఆగస్టు 3 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం అక్కరపాక గ్రామ సమీపంలోని బిపిసిఎల్ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వివరాల మేరకు నాయుడుపేట మండలం పుదురు గ్రామానికి చెందిన ఎల్లంపాటి భాను ప్రసాద్( 23), మూడునూరు గణేషు (17), బట్ట అనీల్ మోటార్ సైకిల్‌లో పుదురు నుండి వరదయ్యపాలెం సమీపంలోని బత్తలవరం సమీపంలో ఉన్న వాటర్ ఫాల్స్ వద్దకు సరదాగా గడపడానికి బయలుదేరారు. అదే మార్గంలో నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ డ్రైవర్ సడన్ బేక్ వేయడంతో వెనుక వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో భవాని ప్రసాద్, గణేషులు అక్కడికక్కడే మృతి చెందారు. బట్టా అనిల్ తీవ్ర గాయాలయ్యాయి.

అనిల్‌ను టోల్ ప్లాజా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మెరుగైన వైద్యం కొరకు తిరుపతిలోని ఓప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం ఎస్ఐ అజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# తిరుమల సమాచారం

## శ్రీవారి పవిత్రోత్సవాలకు నేడు అంకురార్పణ
### రేపటి నుండి మూడురోజులు ఉత్సవాలు

**తిరుమల,ఆగస్టు 3ప్రభాతవార్తప్రతినిధి:** వైష్ణవ సాంప్రదాయం ప్రకారం జాతశౌచం, మృతశౌచం వంటి సమయాల్లో తెలిసీతెలియకో భక్తులు, ఆలయ సిబ్బందిచేత కలిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం వాటిల్లకుండా జరిపించే పవిత్రోత్సవాలకు నేడు(సోమవారం) రాత్రికి అంకురార్పణ జరగనుంది. శ్రీవేంకటేశ్వరస్వామికి ఆగస్ట్ 5వతేదీ (రేపటి)నుండి 7వరకు మూడురోజులు పవిత్రోత్సవాలు అత్యంత శాస్త్రోక్తంగా జరిపిస్తారు. శ్రీవారి ఆలయంలోని సంపంగిప్రాకారంలో కల్యాణోత్సవ మండపంలో మూడురోజులు జరిగే పవిత్రోత్సవాల కారణంగా ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జితసేవలు రద్దుయ్యాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాలలో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాల్లో శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామికి 5న పవిత్ర ప్రతిష్ఠ, 6న పవిత్ర సమర్పణ, 7న పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయి. ఆలయంలో రేపటి నుండి మూడురోజులు అష్టదళపాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలు రద్దయ్యాయి.



## కోదండరామునికి బంగారు తులసి హారం



**తిరుమల,ఆగస్ట్ 3ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబధంగా ఉన్న తిరుపతిలోని కోదండరామ స్వామికి ఓ దాత బంగారుతులసీ హారం విరాళంగా అందజేశారు. బెంగుళూరుకు చెందిన ఆ దాత 257గ్రాములతో 26లక్షలు రూపాయలు విలువైన బంగారు తులసీ దళాలపై గాయత్రి బీజాక్షరాలు చెక్కబడిన హారంను ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ ప్రధాన అర్చకులు ఆనందకుమార్‌దీక్షితులు,ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌కు అందించారు. ఈ హారాన్ని స్వామి వారికి అలంకరించారు.

## ఎఐతో శీఘ్రదర్శనం అసంభవం
### భక్తులకు మెరుగైనసౌకర్యాలపై దృష్టి పెట్టాలి: తిరుమలలో మాజీ ఇఒ ఎల్వీసుబ్రమణ్యం

**తిరుమల,ఆగస్టు 3ప్రభాతవార్తప్రతినిధి:** కృత్రిమ మేధస్సు(ఎఐ)తో శీఘ్రదర్శనం చేయించడమనేది అసంభవమని, భక్తులకు దేవుని దర్శనం గంట,రెండుగంటల్లో చేయిస్తామని చెప్పడం విరమించుకోవాలని టిటిడి మాజీ ఇఒ,ప్రభుత్వ మాజీ సిఎస్ ఎల్వి సుబ్రమణ్యం సూచించారు. కొందరు భక్తులు ఏఐ గురించి చర్చించుకోవడం విన్నానని, అయితే అలా చేయడం మంచిదికాదన్నారు.భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పనపై దృష్టి పెట్టాలని అన్నారు.ఎఐ పేరుతో టిటిడి నిధులను వృధాచేయడం మానుకోవాలన్నారు. ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చిన ఎల్వి ఉదయం విఐపి బ్రేక్‌దర్శన సమయంలో ఆలయంలోనికి చేరుకుని దేవదేవుడ్ని దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



## రోజులతరబడి షెడ్లలో పడిగాపులు మంచిదా!?
### భక్తుల దర్శన ఇబ్బందులు తొలగించేందుకే ఎఐ: టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు



**తిరుమల, ఆగస్టు 3ప్రభాతవార్తప్రతినిధి:** అనాది కాలం నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న సామాన్యభక్తుల రద్దీ ఎక్కువవడంతో రోజుల తరబడి షెడ్లలో, కంపార్టుమెంట్లలో పడిగాపులుకాయడం మంచిదేనా అనే ప్రశ్న టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు గుప్పించారు. ఉచితంగా గూగుల్, టిసిఎస్ సంస్థలు భక్తుల దర్శన కష్టాలను తొలగించి ,జాప్యాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)టెక్నాలజీ ద్వారా సామాన్యభక్తులకు వీలైనంత వరకు దర్శన నిరీక్షణ సమయం తగ్గించాలని చూస్తున్నామన్నారు. ప్రపంచం మొత్తం అన్ని రంగాల్లో ఎఐ విస్తరిస్తుంటే టిటిడిలో భక్తుల శీఘ్రదర్శనాలకు సంబంధించి ఎఐ టెక్నాలజీ నిరుపయోగమని మాజీ ఇఒ,మాజీ సిఎస్ ఎల్వీసుబ్రమణ్యం వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని ఛైర్మన్ అసహనం చెందారు. దాతల సహాయంతో టిటిడి ఉచితంగా చేస్తున్న పనిని కూడా వృధా అని అనడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఇతర సంస్థల సహకారంతో ఎఐ టెక్నాలజీని ఉపయోగించి 2గంటలలోపు భక్తులకు దర్శనం కల్పించాలని టిటిడి పాలకమండలి ముందుకు అడుగేస్తున్న సమయంలో విశ్రాంత ఇఒ అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం బాదాకరమన్నారు. దర్శనాల ఆలస్యాన్ని నివారించడానికే ఎఐ వినియోగించాలని ఆలోచన అన్నారు.

## వెంకన్న దర్శనానికి 18గంటలు

**తిరుమల,ఆగస్టు3ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతంతో ఆదివారం ఉదయానికి తిరుమల భక్తజనసంద్రంగా కొనసాగుతోంది.వారాంతంలోనేగాక సాధారణరోజుల్లోనూ తిరుమలలో భారీగా భక్తులు ఉంటున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ లలోని 28కంపార్టుమెంట్లు నిండిపోయాయి. స్వామివారి సర్వదర్శనానికి 18గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరేడుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. శనివారం రాత్రి వరకు 82,367మంది భక్తులు గోవిందుడ్ని దర్శనం చేసుకున్నారు.





## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

**తిరుమల,ఆగస్టు 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాల ప్రజలకు మంచి కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు.

ఆదివారం ఉద యం తెలంగాణ ఎమ్మెల్యే గంగుల కమలా కర్, డిఐజి ఆర్ఎన్ అమ్మిరెడ్డి, తెలంగాణహైకోర్టు న్యాయమూర్తి కె.లక్ష్మణ్ తదితరులు విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సరుకుల నాణ్యతకు అధునాతన యంత్రాలు

**తిరుమల,ఆగస్టు 3ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసాదాల నాణ్యత మెరుగుపరిచి దేవునికి నివేదించే నైవేద్యాలను దిట్టంప్రకారం పాతరోజుల్లాగా గంగాళాల్లో స్వామివారిచెంత నివేదిస్తున్నారు. ఇవంతా నాణ్యతగా ఉండేలా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇప్పుడు ఇందులో భాగంగా నైవేద్యప్రసాదాల తయారీకి వినియోగించే పరుకులు నాణ్యతగా ఉండాలని చూస్తున్నారు. ఇందుకోసం సరఫరా అయిన ఆహారపదార్థాల సరుకులు ఎంతవరకు నాణ్యత ఉన్నాయని తెలుసుకునేందుకు టిటిడి అధికారులు ఇటీవల 30లక్షలు రూపాయలు విలువచేసే రెండు యంత్రాలనుకోయంబత్తూరునుండి తెప్పించారు. ఈ యంత్రాలను ఆలయానికి వెనుకవైపు సరుకులు నిల్వ ఉంచే గోదాములో ఏర్పాటుచేశారు. పప్పుదినుసులు, బియ్యం, జీడిపప్పు, చక్కెర, బాదం,ఎండుద్రాక్ష తదితర వాటిని కల్తీ ఉందా లేదా అని తెలుసుకోవడానికి యంత్రాలు ఉపయోగపడుతున్నాయి.



వార్త

మన జీవితానికి ఒక ఉద్దేశం, ఒక లక్ష్యం ఉంటేగాని
అది జీవితం అనిపించుకోదు.

-రాఛెల్

# ట్రంప్ ప్రేలాపనలు!


కలిసొచ్చే వారితో ఒకలా కలిసిరాని వారితో మరోలా వ్యవహరించడం స్థితప్రజ్ఞత అనిపించుకోదు. సాధారణంగా సామ,దాన భేద దండోపాయాల తర్వాత కానీ ఆఖరి అస్త్రం తీయరు. అది తెలివైనవారి లక్షణం. కానీ శ్వేతసౌధాధినేత ట్రంప్ మాత్రం కేవలం బెదిరింపుల ద్వారానే సాటి దేశాలనుతన వైపు లాక్కోవాలనుకుంటున్నారు. యూరోపియన్ దేశాలతో ఆయనకు వాణిజ్య డీల్స్ కొంతమాత్రం కుదిరినా రష్యా, భారత్ వంటి దేశాల శైలి ఆయనకు మింగుడుపడటం లేదు. ఇప్పుడాయన వ్యవహరిస్తున్న తీరును దేశాలన్నీ తప్పుపడుతున్నాయి. ట్రంప్‌కు లొంగని తప్పని పరిస్థితులలో కొన్ని దేశాలున్నాయి. జీ హుజూర్ అంటున్నాయి. ఆ కోవలోనే ట్రంప్ తలపోసినట్లుంది. రష్యా, భారత్‌ల మీద దుర్భాషలతో విరుచుకుపడుతున్నారు. అమెరికా అనగానే పాలకులెవరైనా ఆయుధ వ్యాపారం కోసం ఇతర దేశాలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటారని ప్రపంచ చరిత్ర తెలిసిన వారందరికీ విదితమే. తాజాగా అమెరికా సామ్రాజ్యాధినేత మాత్రం తన వాచాలతతో తమతో బంధమున్న వారితో బంధాన్ని బలోపేతం చేసుకోవడం మాని, తెగిపోయే వ్యూహాలను పన్నడం ఆత్మహత్యాసదృశ్యం. తాను వద్దనుకున్న, తనకు కలిసిరాని వ్యాపారాలు చేసుకుంటున్న వారిని పక్కన పెడుతున్నారు. ఏకంగా మాటల యుద్ధం ప్రకటించేశారు. అమెరికాతో భారత్ సంబంధాలు బాగుండేవని, ఒకరకంగా చెప్పాలంటే ఈ రెండు దేశాలు మిత్రదేశాలనీ, ప్రపంచానికంతకూ తెలుసు. అలాగే రష్యాతో కూడా అమెరికా అంటీముట్టనట్లుగా ఉంటూనే పరోక్షంగా స్నేహ పాత్రతో వ్యవహరిస్తుందన్నది కూడా నిజమే. ఉక్రెయిన్‌తో సంధి చేసే విషయంలో తొలుత రష్యాను అంటకాగారు. యుద్ధం పరిసమాప్తి కాదని, రష్యా ఆలోచనమరోలా ఉందని అర్థమయ్యాక ట్రంప్ రష్యాను దూరం పెట్టారు. ఆయుధాలిస్తే రష్యాపై దాడులు చేయగలవా? అని ఉక్రెయిన్‌ను ఊరించారు. ఆయుధాలివ్వడం విషయం ఎలాఉన్నా ఆ తర్వాత అమెరికా రష్యాతో మంతనాలు లేవు. కలిసిరాని రష్యా, భారత్‌లతో అమెరికాకు దాదాపు బెడిసి కొట్టినట్లే ఉంది. ట్రంప్ ఎన్నికైన నాటి నుంచి తమకన్నా చిన్న దేశాలను ఎగుమతి, దిగుమతులపై సుంకాల బేరంతో బెదిరించడం మొదలుపెట్టారు. 20 రోజుల నాడు భారత్‌తో 'ట్రేడ్ డీల్' కుదురుతోందని ప్రపంచానికి ప్రకటించి సుకాలం బేరం ప్రారంభించారు. వ్యవసాయ,పాడి ఉత్పత్తుల విషయంలో భారత్ ససేమిరా అనడంతో ఆ 'డీల్' ముందుకు కదిలినట్లు లేదు. రష్యా, భారత్ దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ఎలాంటి సంక్షోభమూ లేదు. కనుచూపు మేరలో అలాంటి భయాలు లేవని చెప్పాలి. భారత్‌ను ట్రంప్ అష్టదిగ్బంధం చేయాలనుకుంటున్నారో ఏమోకానీ నేరుగా కార్యాచరణలో దిగారు. ఇరాన్‌తో చమురు వ్యాపారం చేస్తోందన్న కారణంగా '6' భారతీయ కంపెనీలపై అమెరికా ఆంక్షలు విధించింది! ఇప్పటికే భారత్‌పై 25 శాతం సుంకాలతోపాటు పెనాల్టీ కూడా విధించింది. రష్యా,భారత్ దేశాలు ఎలాంటి ఆర్థిక దిగజారుడు ఉన్నా తాము ఆలోచించబోమనీ ట్రంప్ అంటున్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలు ఉక్రెయిన్‌పై దాడులు ఆపాలని కోరుకుంటున్నా రష్యా, భారత్ దేశాలు మాత్రం ఈ విషయాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. భారత్, రష్యా నుంచి ఆయుధాలు కొనుగోలు చేయాలనుకుంటోంది. ఇదీ ఆయన ఆందోళన. రష్యా,భారత్ దేశాలు కలిసిపోయి తమ నిర్జీవ ఆర్థిక వ్యవస్థలను మరింత దిగజార్చుకోనివ్వదని విమర్శించారు. తనతో భారత్ ఇంకా వ్యాపారం 'డీల్' కుదరకపోవడంతోనే అమెరికా వ్యాఖ్యాలున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ట్రంప్ అమెరికా సుంకాల విషయంలో జాతీయ ప్రయోజనాలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండాఅక్టోబరులోగా 'డీల్' కుదుర్చుకుంటామని కేంద్రప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించింది. దాంతో తాను కోరగానే భారత్ ముందుకొచ్చేస్తుందని అనుకున్న ట్రంప్‌కు గొంతులో వెలక్కాయపడినట్లుంది. అందుకే రష్యా, భారత్‌లవి మృత ఆర్థిక వ్యవస్థలని శాపాలు పెడుతున్నారు. వాణిజ్య విధానాల్లో ఆలోచనలు విభిన్నంగా ఉన్నంత మాత్రాన దేశాలు శతృత్వ వ్యాఖ్యలు చేసుకోలేవు. కానీ అది 'ట్రంప్'కే చెల్లింది. వారెవరూ ఇంత అత్యల్పస్థాయికి దిగజారి మాట్లాడుకోరు. నోరు పారేసుకోవడం ట్రంప్‌కు కొత్తేమీకాదు. కాగా ఇరుదేశాల వాణిజ్యాన్ని తప్పుపడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేయడమే అభ్యంతరకరం. ఏదయినా ఆచరణాత్మకంగా ఉండాలన్న భారత్ ఆలోచనను గౌరవించడం ట్రంప్ విధి. కాని అతనికి ఆ స్థాయి విజ్ఞత కూడా కావాలి కదా! ఇదే సందర్భంలో భారత్ ఇతర దేశాల వాణిజ్యంతో తీవ్రస్థాయి సుంకాలతో దోచేస్తోందని సెలవిచ్చారు. తనసొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో ఈ విషయాలన్నీ పోస్ట్ చేసి రష్యా, భారత్‌ల పరువు తీయాలనుకోవడం ట్రంప్‌కి ఉచితం కాదు. అయి నా ఆయన నోటికి, ఆలోచనలకు కళ్లెం వేసేవారు లేరు. రష్యాకు అమెరికాకు మధ్య ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవు. అయినా ఆ దేశాన్ని కూడా అమెరికా అధ్యక్షుడు వదిలిపెట్టడం లేదు. రష్యానుంచి ఏనాటి నుంచోవాణిజ్య సంబంధాలున్న భారత్ చమురు, ఆయుధాలు కొనుక్కోవ డమే అమెరికాకు రష్యా కంట్లో నలుసుగా తయారైందనిపిస్తోంది. అమెరికా ప్రధానం తన ఆయుధాలను ఇతర దేశాలకు అమ్మాలనిచూస్తుంది. అందుకుభారత్‌తో వాణిజ్యానికి అమెరికా అంగలారుస్తోంది. కాని ఎటూ తేలక పోయే సరికి ఆందోళనలో పడి,ట్రంప్‌వాచాలత ప్రదర్శిస్తున్నట్లు అర్థమౌతోంది. భారత్‌తో వాణిజ్యానికి అమెరికా కొత్త ప్రత్యామ్నాయాలను ఎదుర్కోవాల్సిందే.!

తెలివిగల వ్యక్తి తన ఆర్థిక విషయాలను, మానసిక సంఘర్షణలను, గృహ సంబంధమైన విషయాలను ఎప్పుడూ రహస్యంగానే ఉంచుతాడు.



శామ్యూల్ జాన్సన్

ధనవంతులుగా మారాలనుకునేవారు చెడు చేయడానికి కూడా పాల్పడే ప్రమాదం ఉంది.



బెర్ట్రండ్ రస్సెల్

# ప్రజావాక్కు



### కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలి

మన రైల్వేలు దేశ పౌరుల ఇంద్ర వాహనం కానీ తరచుగా ఇటీవల ప్రమాదాలు జరుగుతుండడం వలన రైల్వే ప్రయాణం అంటే భయభ్రాంతులను కలుగుచున్నవి. మొన్న ముంబైలో జరిగినలోకల్ రైళ్లప్రమాదంలో ప్రయాణికులు చనిపోవడం అత్యంతవిషాదకరమైన సంఘటన. రెండు రైళ్లప్రయాణికుల సంచులు ఒకదానికి ఒకటి తగిలి ప్రయాణికులు క్రింద పడి దుర్మరణం చెందడం భారత రైల్వే చరిత్రలో బహుశా మొదటిసారి కావచ్చు! ప్రయాణికుల రైళ్ళు పెరుగుతున్న జనాభా, అవసరాలకు తగ్గట్టు విస్తరించడం లేదు. ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లు గా మార్చడం కొన్ని స్టేషన్లలో ఉన్న హాల్ట్‌లను ఎత్తివేయడం జరుగుతున్న కథ. టాయిలెట్స్ శుభ్రంగా ఉండడం లేదు స్లీపర్ భోగిల సంఖ్య తక్కువగా ఉంటుంది.

- డి. రాంచందర్ రావు, హైదరాబాద్

### ఒక్కొక్క పార్టీకి ఒక్కో ఛానెల్

ఒక దశాబ్దనుండి మన తెలుగు చానెల్లో ఒక్క దూరదర్శన్ ఛానల్‌లో తప్పా మిగతా ప్రైవేట్ చానెల్స్ ఎలా మారిపోయాయంటే ఏదో ఒక రాజకీయ పార్టినోఏదో ఒక సామాజిక కులాన్నోమోస్తోన్న వ్యవస్థలుగా మారిపోయాయి. వాళ్ల వాళ్ల మీటింగులు, వారి వారి చెత్త డప్పులు కొట్టుకోవడం చేస్తే ఒకసందర్భంలో కొంతలోనైనా మంచిది. విరుద్ధంగా పగవారిని తిట్టించడంఎక్కువై పోయింది. డిబేట్లు అయితే తిట్టు కోవడమే పరామవధి. వక్తలు సహనంకోల్పోయి కొట్టుకోవడం వరకూవెళ్తే మరి వారిని ఫాలో అయ్యే జనాల పరిస్థితి రోడ్ల మీద చూస్తూనే ఉన్నాము.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### తగ్గిన పేదరికం..

భారత్‌లో పేదరికం భారీగా తగ్గిపోయిందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు పేర్కొన్నాయి. ఈ లెక్కలు చెప్పిన వారు పట్టణాల్లో గ్రామాల్లో సర్వేలు చేసే చెప్పాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోలేనివారు గంజి నీళ్లకు కష్టపడుతున్నారు. మన దేశం చాలా పేద దేశమని పూర్వ రిజర్వుబ్యాంకు గవర్నరు రఘురామ్ రాజన్ ఈ మధ్యనే అన్నారు. ఈ పేదరికంలోఉద్యోగం చేసి రిటైర్అయినవారు కూడా ఉన్నారు.

- ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### పెరుగుతున్న పబ్లిక్ న్యూసెన్స్‌లు

మన పురాణకాలంలో చెడుపై మంచి సాధించిన విజయంగా ప్రజలంతా భావించి దీపాలను వెలిగించి ఆనందంగా దీపావళి పండుగ చేసుకోవటం, అప్పటి నుండి ప్రతిసంవత్సరం పిల్లలు పెద్దలు దీపావళి రోజు టపాసులు కాలుస్తూ పండుగ జరుపుకోవటం ఆనవాయితీగా మారిందని పెద్దలు చెబుతారు. ఐతే ఈ రోజుల్లోఆ దీపావళి టపాసుల వినియోగం నానాటికి పెరిగిపోతూ ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా ముప్పుగా తయారైంది. ఊరేగింపులకూ,శుభకార్యాలకు,అశుభ కార్యాలకు సైతం సాంప్రదాయక వాయిద్యాల స్థానంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భారీశబ్దాలతో టపాసులు, బాంబులు పేలుస్తుంటే వాటి వలన వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా గుండె జబ్బులున్న వారికి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పుడు కొందరి వలన మరొక కొత్త జాడ్యం మొదలైంది

- టి. సాంబశివరావు, గుంటూరు

### నీటిపారుదల సౌకర్యాలు కల్పించాలి

రాష్ట్రంలోని పట్టా కలిగిన బీడు భూములను సాగు చేయడానికి ఉపాధి హామీ ద్వారా అవకాశం ఉంది. అయితే భూమి చదును కార్యక్రమాల కింద విస్తృత భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం ఉత్తర తెలంగాణలోనే కాదు దేశంలోనే వ్యవసాయ అవసరాల కోసమే నిర్మించిన శ్రీపాద సాగర్ ఎత్తిపోతల పథకంతో పాటు కరీంనగర్‌లో నిర్మించిన లోయర్ మానేరు డ్యాం ,అప్పర్ మానేరు లాంటి ప్రాజెక్ట్స్‌తో పాటు కాళేశ్వరం ద్వారా నిర్మించిన గొలుసుకట్టు డ్యాంలు తెలంగాణలో నీటి పారుదల సౌకర్యాలు పెరిగినవి. వీటితో పాటు గొలుసు కట్టు చెరువులు అదనం వీటి అన్నింటి మూలంగా భూమి అభివృద్ధి చేయడం చాలా ఉపయోగకరం.

- భారత అవినాష్, జనగామ

### యుద్ధాన్ని ఆపలేరా?

ఇజ్రాయెల్ ఇప్పటికీ గాజా మీద దాడులు చేస్తూనే ఉంది. అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌ను సమర్థిస్తూనే ఉంది. ఇండో-పాక్‌ల మధ్య జరిగిన యుద్ధాన్ని నాలుగు రోజు లలోనే ఆపివేశానని గొప్పలు చెప్పుకుంటున్న ట్రంప్ మహాశయుడు ఉక్రెయిన్ రష్యా మధ్య ఏడాది పైగా ఎడతెరిపి లేకుండా జరుగుతున్న యుద్ధాన్నిఆపలేకపోయాడు. ఇజ్రాయిల్‌ను అదుపు చేయలేక పోయాడు. అణుయుద్ధానికి ఏ దేశం ఒడి గట్టినా దాని మూల్యం ప్రపంచ దేశాలన్ని చెల్లించుకోవాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

మన విజ్ఞప్తి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్ స్వయం సమృద్ధి సాధించగలదా?

**భారతదేశ ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే సాంకేతిక ఆవిష్కరణలు, విధాన స్థిరత్వం, అంతర్జాతీయ సహకారం కలగలిసిన ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక దృష్టి అవసరం. దేశీయ, విదేశీ పెట్టుబడిదారులలో విశ్వాసం కలిగించడానికి ఎరువుల ధరలు, రాయితీలపై స్పష్టమైన, స్థిరమైన విధానం తప్పనిసరి. కొత్త ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం కూడా కీలకం. అదే సమయంలో ముడిసరుకులు దీర్ఘకాలం పాటు పోటీ ధరలకు స్థిరంగా లభించేలా వనరులు అధికంగా ఉన్న దేశాలతో దౌత్య, ఆర్థిక భాగస్వామ్యాలను భారతదేశం దూకుడుగా కొనసాగించాలి. ఎరువులు, వాటి ముడిసరుకుల ఉత్పత్తి కోసం ఇతర దేశాలలో జాయింట్ వెంచర్లలో పెట్టుబడులు పెట్టే వ్యూహాన్ని మరింతగా పెంచాలి. చివరగా, ఎరువుల రంగంలో నిజమైన ఆత్మనిర్భరత సాధించడం ఒక మారథాన్ లాంటిది, స్ప్రింట్ కాదు. సవాళ్లను అధిగమించి, భారత వ్యవసాయ భవిష్యత్తుకు శక్తినిచ్చే స్థితిస్థాపకమైన, స్వయం సమృద్ధమైన ఎరువుల రంగాన్ని నిర్మించడానికి ప్రభుత్వం, పరిశ్రమలు, రైతు సమాజం నుండి సమష్టి కృషి అవసరం.**

డి. జె మోహన రావు

భారతదేశ వ్యవసాయ రంగానికి ఎరువులు వెన్నెముక లాంటివి. అవి సరైన సమయంలో సరిపడినంతగా అందుబాటులో ఉండటం చాలా కీలకం. మన దేశ జనాభా మొత్తానికి ఆహార భద్రత కల్పించాలంటే ఎరువుల రంగం బలంగా ఉండటం కేవలం ఆర్థిక అవసరమే కాదు వ్యూహాత్మక అవసరం కూడా. అయితే ఈ విషయంలో మన దేశం చాలా సున్నితమైన పరిస్థితిలో ఉంది. ముఖ్యమైన వ్యవసాయ ముడిసరుకుల కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. భారతదేశ ఎరువుల పరిశ్రమ స్థితిగతులను లోతుగా పరిశీలిస్తే, ఉత్పత్తి కొరత, దిగుమతులపై ఆధారపడటం,ఆత్మనిర్భరత లేదా స్వయం సమృద్ధికి ఆటంకం కలిగిస్తున్న సవాళ్లు వంటి సంక్లిష్టమైన విషయాలు మనకు కనిపిస్తాయి. మన దేశంలో అత్యధికంగా వాడే ఎరువు యూరియా అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందులో నత్రజని అధికంగా ఉండటం, ప్రభుత్వం ఇచ్చే రాయితీల వల్ల రైతులకు చౌకగా లభించడమే దీనికి కారణం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో యూరియాకు ఏకంగా 356 లక్షల మెట్రిక్ టన్నుల డిమాండ్ ఉంది. దేశీయ ఉత్పత్తి గణనీయంగా పెరిగి 314 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నప్పటికీ, డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి జరగడం లేదు. ఈ లోటును పూడ్చడానికి పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల ప్రపంచయూరియా మార్కెట్‌లో భారతదేశం ఒక పెద్ద కొనుగోలుదారుగా మారింది. అయితే యూరియాపై అతిగా ఆధారపడటం వల్ల భూమిలో పోషకాల సమతుల్యత దెబ్బతింటోంది. రైతులు ఫాస్పేట్, పొటాష్ వంటి ఇతర ముఖ్యమైన పోషకాలను విస్మరించడం వల్ల దీర్ఘకాలంలో భూసారం దెబ్బతిని,ఉత్పాదకత తగ్గుముఖం పడుతోంది. డైఅమోనియం ఫాస్పేట్ (డీఏపీ), మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. కీలకమైన ఫాస్పేట్ ఎరువైన డీఏపీ వినియోగం 2023-24లో సుమారు 92 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉండగా, దేశీయ ఉత్పత్తి కేవలం 42 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. అంటే, దాదాపు 50-60 శాతం దిగుమతులపైనే మనం ఆధారపడుతున్నాం. ఇక పొటాష్ ఎరువు విషయానికి వస్తే మన దేశంలో దీని ఉత్పత్తి దాదాపు శూన్యం. మొత్తం అవసరానికి దిగుమతే దిక్కు. ఇలాంటి కీలకమైన ఎరువుల కోసం అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడటం వల్ల ప్రపంచంలో ధరలు పెరిగినా లేదా సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా భారత వ్యవసాయం ప్రమాదంలో పడుతుంది. భారతదేశంలో ఎరువుల తయారీ కర్మాగారాలు గణనీయమైన సంఖ్యలోనే ఉన్నాయి. సుమారు 32 పెద్ద యూరియా ప్లాంట్లు, మొత్తం మీద 200 వివిధ స్థాయిల ఎరువుల యూనిట్లు దేశవ్యాప్తంగా పనిచేస్తున్నాయి. ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం నానో ఎరువుల ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే ఏడు నానో యూరియా, మూడు నానో డీఏపీ ప్లాంట్లు పనిచేస్తున్నాయి. వీటి లక్ష్యం పోషకాలను మొక్కలు సమర్థవంతంగా వాడుకునేలా చేయడం. ఇంతపెద్ద పారిశ్రామిక పునాది ఉన్నప్పటికీ, పెరుగుతున్న దేశీయ డిమాండ్‌ను తీర్చడానికి ప్రస్తుత సామర్థ్యం సరిపోవడం లేదు. ఉత్పత్తి వినియోగం మధ్య ఉన్న ఈ అంతరాన్ని పూడ్చడానికి భారతదేశం అనేక దేశాల నుండి ఎరువులను దిగుమతి చేసుకుంటోంది. యూరియా కోసం ఒమన్, ఖతార్,సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలపై



ఆధారపడుతుంటే, ఫాస్పేట్, పొటాష్ ఎరువుల కోసం చైనా, సౌదీ అరేబియా, మొరాకో, కెనడా వంటి దేశాల వైపు చూస్తున్నాం. ఈ దిగుమతుల వల్ల ప్రభుత్వ ఖజానాపై భారీ భారంపడుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన ఎరువుల దిగుమతి బిల్లు సుమారు రూ. 86వేల కోట్లు. వస్తువులు,సేవల ఎగుమతులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు పంపే డబ్బు ద్వారా ఈ విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చుకుంటున్నాం. అయితే ప్రపంచ ఎరువుల ధరలలో వచ్చే మార్పులు మన దేశ చెల్లింపుల శేషంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి. మన దేశంలో సరిపడినంత ఎరువులు తయారు చేయలేకపోవడానికి ప్రధానకారణం ముడిసరుకుల కొరతే. యూరియా ఉత్పత్తి సహజవాయువుపై ఆధారపడి ఉంటుంది. మన దేశంలో సహజవాయువు నిల్వలు చాలా తక్కువ. అందువల్ల ఖరీదైన దిగుమతి చేసుకున్న ద్రవీకృత సహజవాయువుపై ఆధారపడాల్సి వస్తోంది. ఫాస్పేట్ ఎరువుల కోసం అవసరమైన రాక్ ఫాస్పేట్ విషయంలో దాదాపు పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడి ఉన్నాం. పొటాష్ పరిస్థితికూడా ఇంతే. దేశంలో వాణిజ్యపరంగా లాభదాయకమైన నిల్వలు లేవు. ముడిసరుకుల కోసం ఇతర దేశాలపై ఇలా ఆధారపడటమే స్వయం సమృద్ధికి అతిపెద్ద అడ్డంకిగా మారింది. దేశీయంగా ఎరువుల ఉత్పత్తిని విస్తరించడం అనేక సవాళ్లతో కూడుకున్నది. కొత్తఎరువుల కర్మాగారాలను ఏర్పాటు చేయడానికి భారీగా పెట్టుబడులు పెట్టాలి. భూసేకరణ, పర్యావరణ అనుమతులు పొందడం వంటి ప్రక్రియలు చాలా సమయం తీసుకోవడంతో ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయి. అంతేకాకుండా ఎరువుల ధరలు, రాయితీలపై ప్రభుత్వానికి దీర్ఘకాలిక విధానం స్పష్టంగా లేకపోవడం ప్రైవేట్ పెట్టుబడులను నిరుత్సాహపరుస్తోంది. సహజవాయువు, ఫాస్ఫరిక్ యాసిడ్ వంటి ముడిసరుకుల అంతర్జాతీయ ధరలలో వచ్చే మార్పులు దేశీయ తయారీదారులకు మరో పెద్ద సవాలుగా మారాయి. భారతదేశ ఎరువుల సంక్షోభాన్ని పరిష్కరించడానికి బహుముఖ నిరంతర కృషి అవసరం. దేశీయ ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం అనేక చర్యలు ప్రారంభించింది. కొత్త పెట్టుబడులను ఆకర్షించడానికి 2012లో ప్రవేశపెట్టిన నూతన పెట్టుబడి విధానం, దాని సవరణలు దోహదపడుతున్నాయి. మూతపడిన గోరఖ్‌పూర్, బరౌని, సింద్రీ, తాల్చేర్,రామగుండం ఎరువుల కర్మాగారాలను పునరుద్ధరించడం ఈ దిశగా ఒక ముఖ్యమైన అడుగు. ప్రత్యామ్నాయ, దేశీయ వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడం ఒక కీలకమైన దీర్ఘకాలిక పరిష్కారం. మన దేశంలో పుష్కలంగా ఉన్న బొగ్గును గ్యాస్‌గా మార్చి దానిద్వారా యూరియాను ఉత్పత్తి చేయడం ఒక మంచి మార్గం. ప్రభుత్వం ఈ దిశగా చురుకుగా అడుగులు వేస్తోంది. తాల్చేర్ ఎరువుల కర్మాగారం దీనికి ఒక ఉదాహరణ. అంతేకాకుండా, సమతుల్యమైన, సమర్థవంతమైన ఎరువుల వాడకం వైపు రైతులను ప్రోత్సహించాలి. భూసార పరీక్ష కార్డుల ద్వారా పోషకాల ఆధారంగా ఎరువులు వాడటాన్ని ప్రోత్సహించడం, పోషకాలను సమర్థవంతంగా ఉపయోగించుకునే నానో యూరియా, నానో డీఏపీ వంటి వినూత్న ఉత్పత్తులను అభివృద్ధి చేయడం సరైన చర్యలు. సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని కూడా తగ్గించవచ్చు. భారతదేశ ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే సాంకేతిక ఆవిష్కరణలు, విధాన స్థిరత్వం, అంతర్జాతీయ సహకారం కలగలిసిన ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక దృష్టి అవసరం. దేశీయ, విదేశీ పెట్టుబడిదారులలో విశ్వాసం కలిగించడానికి ఎరువుల ధరలు, రాయితీలపై స్పష్టమైన, స్థిరమైన విధానం తప్పనిసరి. కొత్త ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం కూడా కీలకం. అదే సమయంలో, ముడిసరుకులు దీర్ఘకాలం పాటు పోటీ ధరలకు స్థిరంగా లభించేలా వనరులు అధికంగా ఉన్న దేశాలతో దౌత్య,ఆర్థిక భాగస్వామ్యాలను భారతదేశం దూకుడుగా కొనసాగించాలి. ఎరువులు, వాటి ముడిసరుకుల ఉత్పత్తి కోసం ఇతర దేశాలలో జాయింట్ వెంచర్లలో పెట్టుబడులు పెట్టే వ్యూహాన్ని మరింతగా పెంచాలి. చివరగా, ఎరువుల రంగంలో నిజమైన ఆత్మనిర్భరత సాధించడం ఒక మారథాన్ లాంటిది, స్ప్రింట్ కాదు. సవాళ్లను అధిగమించి, భారత వ్యవసాయ భవిష్యత్తుకు శక్తినిచ్చే స్థితిస్థాపకమైన, స్వయం సమృద్ధమైన ఎరువుల రంగాన్ని నిర్మించడానికి ప్రభుత్వం, పరిశ్రమలు, రైతు సమాజం నుండి సమష్టి కృషి అవసరం. ●

# హోంగార్డులు దీనస్థితిలో ఇంకెంతకాలం?

అనంతాత్మకుల కొండబాబు

అటెండర్‌కు ఎక్కువ పోలీసులకు తక్కువ అనే విధంగా మారింది రాష్ట్రంలోని హోమ్‌గార్డుల పరిస్థితి. మినీ పోలీసులుగా గుర్తింపు ఉన్నప్పటికీ కనీసం ఉద్యోగి అనే మర్యాద కూడా లేకుండా పోయింది. వెట్టిచాకిరి చేయించుకోవడం కోసమే హోంగార్డులు ఉన్నట్టుగా ఉంది పరిస్థితి. పోలీసుశాఖలో వీరిది కీలకపాత్ర. ఈ శాఖలోని అధికారులకు, వీరికి ఒకటే రంగుయూనిఫాం. అయితే చేసే పని మాత్రం వేరు. జీతం తక్కువైనా రెగ్యులర్ పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. హోంగార్డుల పని మాత్రం పోలీసు బాస్‌ల ఇళ్ల వద్దే. ఖాకీ యూనిఫాం సర్వీసులో అత్యంత అల్పజీవులుగా చులకన బతుకులు వీరివి. ఉపాధి హామీ కూలీలకైనా ఇన్ని గంటల పని అంటూ ఒక లెక్క ఉంటుంది. వీళ్ల కు అదేం లేదు. బాస్ చెబితే చేయాల్సిందే. లేదంటే అంతే. ఐపీఎస్ అధికారుల దగ్గర నుంచి డిఎస్పీలు, సీఐలు, ఎస్సైల వ్యక్తిగత సేవకు హోంగార్డుల జీవితం అంకితం కావల్సిందే. ఇంటికి కూరగాయలు తీసుకురావడం దగ్గర నుంచి పిల్లలు స్కూల్లో వదిలి రావడం తిరిగి స్కూల్ వదిలినప్పుడు ఇంటికి తీసుకెళ్ళడం వంటి పనులు చేయిస్తున్నారు. పోలీసు స్టేషన్లలో కూడా వీరిని వదిలిపెట్టడం లేదు. ఉదయం, సాయంత్రం సిఐ, ఎస్సైలకు టీ, టిఫిన్ తీసుకురావడానికి ఉపయోగిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. అధికారులు చెప్పినట్టు వినకపోయినా, పనులు చేయకపోయినా ఇబ్బందులు తప్పడంలేదు. ఒక వైపు పోలీసు శాఖలో ఆర్డర్లీ వ్యవస్థను రద్దు చేసినట్టు చెబుతున్నా మరోవైపు అధికారులు మాత్రం అనధికారికంగా ఆర్డర్లీ వ్యవస్థను కొనసాగిస్తున్నారు. సెలవులుంటాయా అంటే అదీ లేదు. జీతం అంతంత మాత్రమే. పోనీ ఉద్యోగ భద్రత ఉంటుందా అంటే అదీలేదు. ఒళ్లు వంచి ఏళ్ళ తరబడి పనిచేసినా రిటైర్‌మెంట్ రోజు ఒట్టి చేతులతో ఇంటికీ వెళ్లాల్సిన దుస్థితి వీరిది. అసలు హోంగార్డులు అనేది స్వచ్ఛంద దళం. 1946 డిసెంబర్‌లో భారతదేశంలో మొదటిసారిగా పౌర విఘాతం, మతపరమైన అల్లర్లను నియంత్రించడంలో పోలీసులకు సహాయం చేయడానికి ఈ దళం ఏర్పాటు చేశారు. ఈ స్వచ్ఛంద పౌరుల దళంను అనేక రాష్ట్రాలు ఆమోదించాయి. దేశంలోని హోంగార్డుల మొత్తం బలం 5,73,793. అయితేఇటీవల పెరిగిన బలం చూస్తే 4,33,803 గా నమోదైంది. నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోవడంతో డిగ్రీలు, పిజీలు చేసినవారు సైతం హోంగార్డులుగా పనిచేస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. పోలీసు కానిస్టేబుల్‌తో సమానంగా ఉద్యోగం చేస్తున్న కూడా వీరికి ఎటువంటి భద్రతా, భరోసాలేక చాలిచాలని జీతంతో సమాజంలో ఎటువంటి గుర్తింపులేని బతుకులు బతుకుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హోంగార్డులకు జీతాలు, ఇతర అలవెన్సులు అమలుచేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. పోలీసుశాఖలో ఎన్నో ఏళ్లుగా హోంగార్డులుగా ఉద్యోగం చేస్తున్న కూడా ప్రభుత్వం నుంచి గుర్తింపేలేదు. వీరు రోజువారీ విధులునిర్వహిస్తే రూ.720లు ఇస్తారు. అదే తెలంగాణ రాష్ట్రంలోని హోంగార్డులకు రూ.వేయి ఇస్తున్నారు. వీరి సంవత్సర ఆదాయం రూ.27వేలకు పరిమితం చేసినాగాని వీరికీఎటువంటి సంక్షేమపథకాలు వర్తించడం లేదు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలు, నిత్యావసర ధరలు వీరి పాలిట శాపంగా మారా యి. హోంగార్డుల పరిస్థితి బానిస బతుకుల కంటేఘోరంగా ఉంటుంది. వీరికి గౌరవ వేతనం పేరుతో రోజువారీ వేతనాలు ఇస్తున్నారు. పనిచేస్తేనే వేతనం ఉంటుంది. లేకపోతే ఆరోజు వేతనం కట్, అందరిలాగే వీరికి బాధ్యతలుంటాయి. ప్రభుత్వ ఉద్యోగిగా నమోదు చేసినందున వారికిఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించడంలేదు. దీంతో అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. రాష్ట్రంలో పదేళ్లకుపైగా హోంగార్డుల ఎంపిక జరగలేదు. ఇంకా 5వేల హోంగార్డు పోస్టులుభర్తీ చేయాల్సి ఉంది. ●

# 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే రిజర్వేషన్లకు రక్షణ



అన్నవరపు బ్రహ్మయ్య


తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం స్థానాలు కేటాయిస్తూ ఆ మేరకు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలంటూ పంపిన ప్రతిపాదన అమలు సాధ్యంకాదని బిజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రకటించారు. ఈ కారణంగానే తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఉద్యమ బాటపట్టారు. స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ అమలు చేయాలన్న నిర్ణయాన్ని కూడా ఎవ్వరూ న్యాయస్థానంలో సవాలు చేసి నిలుపుదల చేయకుండా ఉండటం కోసం ఈ విధానాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పొందుపరచాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించింది. ఈ సందర్భంగా అసలు 9వ షెడ్యూలు అంటే ఏమిటి అనే అంశం చాలామందిలో ప్రశ్న తలెత్తుతుంది. భారత రాజ్యాంగానికి 1951లో తొలిగా చేసిన రాజ్యాంగ సవరణ ద్వారా ఈ తొమ్మిదో షెడ్యూల్ ఏర్పడింది. ప్రజలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు లేదా కేంద్ర ప్రభుత్వం తీసుకొనే కీలకమైన నిర్ణయాలను తొమ్మిదో షెడ్యూల్లో పొందుపరిచే పక్షంలో ఆయా నిర్ణయాలపై ఎవరు కోర్టులో సవాల్ చేయకుండా రక్షణ కలుగుతుంది. దేశంలో తొలిసారిగా బిసిలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లను కల్పించే విధంగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం. తీసుకుంది. ఈ నిర్ణయాన్ని ఇతరులు అభ్యంతరం పెట్టకుండా ఉండాలంటే రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో కచ్చితంగా పొందుపరచాల్సి ఉంటుంది. అయినా కీలకమైన అంశాలను 9వ షెడ్యూల్లో పొందుపరచటం కొత్తేమీ కాదు. 9వ షెడ్యూల్ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 284 అంశాలను పొందుపర్చారు. అందులో ఎక్కువ భాగం అగ్రవర్ణాలకు చెందిన వ్యవసాయ భూములకు సంబంధించిన మినహాయింపులు వంటి అంశాలు రక్షణ పొందుతున్నాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని న్యాయస్థానాలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో తమిళనాడులో బిసిలకు సంబంధించి 69 శాతం రిజర్వేషన్లు అమలు కావడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల విధానాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పొందుపరచటం వల్లనే సాధ్యమైంది. లేదంటే 69శాతం రిజర్వేషన్లు అమలు కాకుండాచాలామంది న్యాయస్థానాలలో అడ్డుపుల్లలు వేసి ఉండేవారు. అయితే తెలంగాణ ప్రభుత్వం పంపిన బీసీ రిజర్వేషన్ విధానాన్ని 9షెడ్యూల్లో పొందుపర్చడం సాధ్యంకాదని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడానికి ముందే తెలంగాణ బిజెపి అధ్యక్షులు రామచంద్రరావు సాధ్యం కాదని ప్రకటించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సహజంగా అత్యంత కీలకమైన బిసి




బిల్లు అంశాలలో ఒక రాష్ట్ర అధ్యక్షులు ఆ పార్టీ కేంద్రనాయకులతో సంప్రదించకుండా బిసి బిల్లు ఆమోదించడంసాధ్యం కాదని ప్రకటించే అవకాశం వుండదు. అందువల్ల రామచంద్రరావు ప్రకటనను బట్టి తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ విధానాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పొందుపరచడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని అర్థం అవుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ బిసి వర్గానికి చెందినవారని, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామంటూ నిత్యం బిసిల నామజపం చేసే బిజెపి నేతలు ఆచరణకు వచ్చేసరికి తమ అసలుబుద్ధి ప్రదర్శిస్తున్నారు. బిజెపి చరిత్ర గమనిస్తే అడుగడునా బిసిల పట్ల ద్వేషమే కనిపిస్తుంది. గతంలో మండల కమిషన్ సిఫార్సుల మేరకు విద్యా ఉద్యోగాలలో బిసిలకు 27శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు నాటి ప్రధాని వీపీ సింగ్ ప్రకటించినప్పుడు కూడా మండల సిఫార్సులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో బిజెపి తమ పార్టీ అనుబంధమైన విద్యార్థి సంస్థ అఖిలభారత విద్యార్థి పరిషత్ రూపంలో వ్యతిరేకించింది. ఎట్టకేలకు మండల్ కమిషన్ సిఫార్సులకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపటం వల్ల ఆనాడు సమస్య పరిష్కారమైంది. బిసి కులాలను వర్గీకరణ చేయడం ద్వారా బిసిలలో అత్యంత వెనుకబడిన కులాలకు మేలు చేస్తామంటూ ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన జస్టిస్ రోహిణీ కమిషన్ దేశవ్యాప్తంగా పర్యటించి దేశంలో మొత్తం 3000 బిసి కులాలలో దాదాపు 90శాతం కులాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోక ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి వున్నాయని నివేదిక సమర్పించింది. ఆ నివేదిక సమర్పించి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఆ నివేదిక ఊసే ఎత్తడం లేదు. తెలంగాణాలో ప్రతిపాదించిన స్థానిక సంస్థలలో42శాతం మండల కమిషన్ బిసిలకు కూడా ఎస్సీ ఎస్టీ వర్గాల మాదిరిగానే చట్టసభలలో రిజర్వేషన్ కల్పించాలని కూడా సూచన చేసింది. అయితే చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్ బిల్లు విషయంలో ఎంతో శ్రద్ధ వహించిన బిజెపి ప్రభుత్వం మహిళలకు కేటాయించిన సీట్లలో బిసి మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌ను బిజెపి ఖాతరు చేయలేదు. ఈ స్థితిలో చట్టసభలలో బిసిలకు రిజర్వేషన్‌కల్పించాలన్న మండల కమిషన్ సిఫార్సులను బిజెపి అధికారంలో ఉన్నంతకాలం చట్టసభలలో బిసిలకురిజర్వేషన్ అమలు కాదని అర్థమవుతుంది. ఇదేసమయంలో ఆర్థికంగా కులాలకు ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని ఏ రాజకీయపార్టీ కోరలేదు, ఎవరూ ఉద్యమాలు చేయలేదు. కానీ కేంద్ర ప్రభుత్వం దేశంలో కనీసం 15శాతం కూడా లేని అగ్రకులాలు వారికి పేదరికం పేరుతో పదిశాతం రిజర్వేషన్లు అమలుచేస్తోంది. రిజర్వేషన్లు 50శాతం పెంచకూడదని సన్నాయి నొక్కులు నొక్కిన న్యాయస్థానాలు ఈ అంశంపై అభ్యంతరం చెప్పకపోగా ఆమోదం తెలిపాయి. సనాతన ధర్మం ప్రకారం బిసి కులాలకు చెందిన ప్రజలు అగ్రవర్ణాలకు సేవలు చేయటం మినహా అగ్రవర్ణాలతో సమానంగా అధికారంలో పాలుపంచుకోవడం బిజెపికి ఇష్టం లేదనిపిస్తోంది. కావాలంటే మీకు ఉచితంగా బియ్యమో, గ్యాస్ బండో ఇస్తాం కానీ అధికారం ఎలా ఇస్తాం అనేది ధోరణి బిజెపి నాయకులలో కనిపిస్తోంది. ●

# 35 మందుల ధరలు తగ్గింపు

### దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట



**న్యూఢిల్లీ,ఆగస్టు 3:** దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కేంద్రం భారీ ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా 35 రకాల మందుల ధరలను తగ్గించింది. దేశ ప్రజలకు ప్రజలకు మందులను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీలు విక్రయిస్తున్న 35 ఔషధాల రిటైల్ ధరలను తగ్గించింది. ఈ ఒంటినొప్పులు, గుండె సంబంధిత, మధుమేహం, మానసిక వ్యాధుల చికిత్సకు ఉపయోగించే ఔషధాలపై తగ్గింపు వర్తించనున్నది. దాంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట కలుగుతున్నది. రసాయనాలుఎరువుల మంత్రిత్వశాఖ ఈ ఉత్తర్వులను జారీ చేసింది. యేసిలోఫెనాక్, పారాసెటమాల్, ట్రిప్సిన్ కైమోట్రిప్సిన్ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్, అమోక్సిసిలిన్‌పొటాషియం క్లావ్యులానేట్, అటోర్వాస్టాటిన్, ఎంపాగ్లిఫ్లోజిన్, సిటాగ్లిప్టిన్, మెట్‌ఫార్మిన్ వంటి మందులున్నాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ విక్రయించే యేసిలోఫెనాక్,పారాసెటమాల్, ట్రిప్సిన్ కైమోట్రిప్సిన్ మాత్రధరను రూ.13గా నిర్ణయించింది. క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ విక్రయించే అదే ఫార్ములేషన్ ధరను 15.01గా పేర్కొంది. గుండె సంబంధిత వ్యాధులున్న వారు విస్తృతంగా వాడే మెడిసిన్ అయిన అటోర్వాస్టాటిన్ 40 క్లోపిడొగ్రెల్ 75 మాత్రల ధరలను రూ.25.61గా నిర్ణయించింది. చిన్నపిల్లలకు ఉపయోగించే సెఫిక్సిమ్, పారాసెటమాల్ ఓరల్ సస్పెన్షన్, విటామిన్ డీ లోపం ఉన్న వారిలో వాడే కోలికాల్సిఫెరాల్ డ్రాప్స్, డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ ధర రూ.31.77కి తగ్గించింది. రిటైర్లు, డీలర్లు అందరూ మెడికల్ షాపుల్లో తాజా ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించింది. ఎక్కువకు ధరకు ఆయా మందులను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఔషధ ధరల నియంత్రణ ఆర్డినెన్స్ 2013, ఎసెన్షియల్ కమెడిటీస్ యాక్ట్ 1955 ప్రకారం జరిమానాలు విధించనున్నట్లు తెలిపింది. ఆయా మెడిసిన్ల ధరలు మినహాయించామని అదనంగా జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఔషధ తయారీ కంపెనీలు కొత్త ధరల జాబితాను ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అప్‌డేట్ చేసి ఎన్‌పీపీఏ, రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్స్‌కు సమర్పించాలని ఆదేశించింది. తాజా ఆదేశాలతో ఆయా ఔషధాలపై ఇప్పటికే ఉన్న ధరల ఉత్తర్వులు రద్దయినట్లు స్పష్టం చేసింది.



## ఇజ్రాయెల్ దాడిలో 18 మంది గాజా పౌరులు మృతి

**టెల్‌అవీవ్, ఆగస్టు 3:** గాజా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం ఇంకా కొనసాగుతోంది. యుద్ధంలో ఎంతోమంది అమాయకుల ప్రాణాలు పోతున్నా యుద్ధం మాత్రం ఇరు దేశాలు ఆపడం లేదు. తాజాగా గాజాపై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. ఈ దాడిలో 18 మంది సామాన్య ప్రజలు మరణించినట్లు అక్కడి వైద్య అధికారులు తెలిపారు. మృతుల్లో ఎనిమిది మంది సహాయ కేంద్రం వద్ద ఆహారం కోసం పడిగాపులు కాస్తూ ఇజ్రాయెల్ తూటాలకు బలైన వారే కావడం బాధాకరం.

మిగిలిన 10 మంది మధ్య, దక్షిణ గాజా ప్రాంతంలో ఇజ్రా యెల్ నిర్వహించిన వైమానిక దాడుల్లో మర ణించారు. శరణార్థుల కోసం గాజా హ్యూమాని టేరియన్ ఫౌండేషన్ (జిహెచ్‌ఎఫ్) సహాయ కేంద్రం నిర్వహిస్తున్నది. అయితే ఆహారం కోసం సహాయ కేంద్రం వద్దకు ఎక్కువ సంఖ్యలో జనాలు రావడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అదే సమయంలో ఇజ్రాయెల్ సేనలు కాల్పులు జరపడంతో అమాయక ప్రజలు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అయితే తాము నిర్వహిస్తోన్న సహాయ కేంద్రాల వద్ద అలాంటిదేదీ జరగలేదని జిహెచ్‌ఎఫ్ పేర్కొంది. కాల్పులకు గుర్కై మరణించే అవకాశాలుండీ సహాయ కేంద్రాల వద్ద పెద్దసంఖ్యలో గాజా వాసులు గుమిగూడటం ఆ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర క్షామ పరిస్థితులకు నిదర్శనమని అంతర్జాతీయ సంస్థలు అంటున్నాయి. మరోవైపు పౌష్టి కాహార లోపం కారణంగా ఏడుగురు పాలస్తీనీయులు గడచిన 24 గంటల్లో మరణించారని స్థానిక ఆరోగ్య శాఖ తెలిపింది.

జనవరిలో ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటికి ఇజ్రాయెల్ విరమణకు విరుద్ధంగా గాజాపై మళ్లీ దాడులకు తెగబడింది. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. గాజాబెల్ట్‌లో ఉన్న హమాస్ అనేది ఇజ్రాయెల్‌కు విరుద్ధంగా పోరాటం చేసే ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ. గాజాలో హమాస్ అధికారంలోకి రావడం, ఇజ్రాయెల్‌తో హింసాత్మక సంబంధాలను మరింత పెంచింది. హమాస్ తరచూ ఇజ్రాయెల్ మీద రాకెట్ దాడులు చేసింది. దీంతో తనని తాను రక్షించుకోవడానికి ఇజ్రాయెల్ తిరిగి గాజాపై దాడులు చేస్తోంది.

# వరదలతో వారణాసి, ప్రయాగరాజ్‌లు అతలాకుతలం



**వారణాసి,ఆగస్టు 3:** ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల కురిసిన వర్షాలతో వారణాసి, ప్రయాగ్‌రాజ్‌లో అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రస్తుతం పరిస్థితి చాలా దారుణంగాఉంది. వరదల తాకిడికి వారణాసి ప్రయాగ్‌రాజ్ అతలాకుతలం అయింది. పవిత్ర నగరాలైన వారణాసి, ప్రయాగ్‌రాజ్ వరదల తీవ్రతకు చిగురుటాకుల్లా వణకుతున్నాయి. గంగా, యమునా నదులు ఉప్పొంగి పొర్లుతూ తీరప్రాంతాల్లోని జనజీవితాన్ని ముంచెత్తుతున్నాయి. రహదారులు జలమయమై, ఇళ్లలోకి నీరు ప్రవేశించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రక్షణ బృందాలు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పునరావాస పనుల్లో నిమగ్నమవుతున్నారు. నదుల ఉధృతి తగ్గకపోతే పరిస్థితి మరింత విషమించవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. వారణాసిలో గంగా నది ప్రమాద స్థాయిని దాటి అనేక ప్రాంతాల్లోకి నీరు చొచ్చుకొచ్చింది. ప్రయాగ్‌రాజ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నదీ జలాలు పెరిగి, నగరంలోని పలు ప్రాంతాలు నీటిలో మునిగాయి. రోడ్లన్నీ నీటితో నిండిపోవడంతో, ప్రజలు పడవల్లో ప్రయాణిస్తూ పలు ఇళ్లు, ఆఫీసులకు వెళ్తున్నారు. రోడ్డు మీద కారు కాదు, పడవల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రయాగ్‌రాజ్‌లోని కరేలా బాగ్ ప్రాంతంలో ఉదయం 8 గంటల నుంచే నీరు నిలిచిపోయింది. ససూర్ దేరీ నది ఉప్పొంగడంతో ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు తెలిపారు. ఇంకా వర్షం కూడా కురుస్తోందని, చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఉత్తరప్రదేశ్ మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్ ఆదివారం హమీర్‌పూర్‌లో వరద ప్రభావిత ప్రాంతాలను హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. వరదల వల్ల ఇళ్లు కోల్పోయిన వారి కోసం చేసిన ఏర్పాట్లను కూడా సమీక్షించారు. ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రయాగ్‌రాజ్‌లో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కోసం 20 వేల కోట్లు ఖర్చు చేసినా, నీటి నిల్వ తప్ప ఏం సాధించారని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. స్మార్ట్ సిటీ అనే ఆలోచనను నీళ్లలో కలిపేసిన బిజెపి వాళ్లు ఎక్కడికి పడవలు తీసుకొని పారిపోయారని తనదైన శైలిలో ప్రశ్నించారు. రాష్ట్రంలో మరో 24 గంటలపాటు ఈదురు గాలులతోకూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండి హెచ్చరించింది. లక్నో, వారణాసి, గోరఖ్‌పూర్, మో, బలియా, సోన్‌భద్ర, మీర్జాపూర్, జౌన్‌పూర్, ఘాజిపూర్, కుషీనగర్, సీతాపూర్, బరాబంకీ, బహ్రైచ్, గోండా, లఖింపూర్ ఖేరీ, మొరాదాబాద్ వంటి 55 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో బహ్రైచ్, బలరాంపూర్, లఖింపూర్ ఖేరీ, సీతాపూర్, గోండా, శ్రావస్తి లాంటి ఉత్తర జిల్లాల్లో కూడా వరద పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని ముందస్తు హెచ్చరికలు జారీచేసింది.

## అన్ని నేరాలకు షేక్ హసీనాయే మూలం

### బంగ్లాదేశ్ మాజీ పిఎంపై విచారణ మొదలు



**ఢాకా, ఆగస్టు 3:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మానవాళికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' (ఐసిటి) అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆదివారం ఆయా కేసుల్లో హసీనాపై విచారణను ప్రారంభించింది. తాత్కాలిక ప్రభుత్వం నియమించిన చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం.. హసీనాను అన్ని నేరాలకు మూలకేంద్రంగా పేర్కొన్నారు. ఆమెకు గరిష్ఠ శిక్ష విధించాలన్నారు. ఈ కేసుల్లో మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, మాజీ ఐజిపి చౌదరీ అబ్దుల్లా అల్ మామున్‌లు సహ నిందితులుగా ఉన్నారు. విద్యార్థుల ఆధ్వర్యంలో గత యేడాది జూలై-ఆగస్టులో జరిగిన ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు హసీనా ఆరోపణలు ఎదుర్కొంటు న్నారు. భారీ సంఖ్యలో ఉద్యమకారులను చంపించడం, హింసించడం వంటి నేరాభియోగాలను ఆమెపై మోపారు. వీటిపై ఐసిటి ఆదివారం విచారణ ప్రారంభించింది. హసీనా, అసదుజ్జమాన్ ఇప్పటికే దేశాన్ని వీడారు. మామున్ ఒక్కరే కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో సాక్షిగా మారేందుకు ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. నిర సనల సమయంలో గాయపడిన వ్యక్తులు, ప్రత్యక్షసాక్షుల నుంచి ఆధారాలు సమర్పిస్తామని ప్రాసిక్యూషన్ తెలిపింది. గత యేడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేప థ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు హోంశాఖ మాజీ మంత్రి కూడా బంగ్లాదేశ్‌ను వీడారు. ఈ క్రమంలోనే స్థానికంగా నోబెల్ పురస్కార గ్రహీత యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. ఆయా కేసుల్లో విచారణ కోసం హసీనాను అప్పగించాలని భారత్‌ను అభ్యర్థిస్తోంది. ఇదిలా ఉండగా జూలై 10న హసీనా, కమల్, మామున్‌లపై ఐసిటి అభియోగాలు మోపింది. అంతకుముందు కోర్టు ధిక్కరణ కేసులో ఆమె ఆరు నెలల జైలు శిక్ష విధించింది.



## తొలిరోజు జైలులో దీనంగా ప్రజ్వల్ రేవణ్ణ

**బెంగళూరు,ఆగస్టు 3:** మాజీ ప్రధాని దేవగౌడ మనవడు, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు శాశ్వత జైలు శిక్ష విధించిన నేపథ్యంలో అతడిని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుకు శనివారం పోలీసులు తరలించారు. అనంతరం అతడికి ఖైదీ నెంబర్ 15528ను కేటాయించారు. అయితే అతడు గత రాత్రి అంటే శనివారం రాత్రి చాలా విచారంతోపాటు కొంత ఒత్తిడితో కనిపించారని జైలు అధికారులు ఆదివారం తెలిపారు. ఇక శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత ప్రజ్వల్ ఆరోగ్యాన్ని వైద్యులు పరీక్షించారని చెప్పారు. అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వెల్లడించారన్నారు. వైద్యుల పరీక్షిస్తున్న సమయంలో సైతం అతడు దీనంగా ఉన్నడని అలాగే తన బాధను వారికి వ్యక్తం చేశాడని చెప్పారు. మరోవైపు ప్రజా ప్రతినిధుల కోర్టు ఇచ్చిన తీర్పుపై తాను హైకోర్టుకు వెళ్తానని సిబ్బందికి తెలియజేసినట్లు తెలుస్తోంది. ఇంకోవైపు అతడిని భారీ భద్రత ఉన్న సెల్‌లో ఉంచామన్నారు.

## కాలువలోకి దూసుకెళ్లిన కారు: 11 మంది మృతి, మరో నలుగురికి గాయాలు





**గోండా(యూపి),ఆగస్టు 3:** ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భక్తులతో వెళుతున్న ఒక వాహనం అదుపుతప్పి కాలువలో పడటంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన యూపిలోని గోండా జిల్లాలో జరిగింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు. మోతిగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిహాగావ్ గ్రామానికి చెందిన 14 మంది ఒక బొలెరో వాహనంలో ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయానికి పూజల కోసం బయలుదేరారు. మార్గమధ్యంలో వీరి వాహనం సరయూ కాలువలోకి దూసుకెళ్లింది. వాహనం నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొందరు గ్రామ పెద్దకు విషయం చేరవేశారు. సమాచారం అందుకున్న ఇటియాథోక్ పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నీటిలో మునిగిపోయిన వాహనం నుంచి మృతదేహాలను వెలికితీశారు. మృతులలో పురుషులు, మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. ఈ దుర్ఘటనపై జిల్లా ఎస్పీ వినీత్ జైస్వాల్ మాట్లాడుతూ, ఆలయానికి వెళుతుండగా బొలెరో వాహనం కాలువలో పడిపోవడంతో 11 మంది మరణించారు. స్వల్ప గాయాలతో బయటపడిన నలుగురిని రక్షించి జిల్లా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి పీఎంఎన్ఆర్‌ఎఫ్‌నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందిస్తామని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## కేరళలో 'రెండు రూపాయల డాక్టర్' ఇక లేరు



**తిరువనంతపురం, ఆగస్టు 3:** పేదల జీవితాల్లో వెలుగులు నింపిన నిస్వార్థ సేవకుడు. డాక్టర్ ఎకె రైరూగోపాల్ అలియాస్ 'రెండు రూపాయల డాక్టర్' ఆదివారం కన్నుమూసారు. ఉత్తర కేరళలోని కన్నూర్‌లో వేలాది మంది జీవితాల్లో నిస్వార్థ సేవ చేసిన డాక్టర్ గోపాల్ పేదలు, అణగారిన ప్రజలకు దశాబ్దాలుగా రెండు రూపాయలకే వైద్యం అందించారు. డాక్టర్ ఎకె రైరూ గోపాల్ 50 యేళ్లపాటు అతి తక్కువకే రూ. 2కే వైద్యం చేసేవారు. అందుకే ఆయనను అందరూ 'రెండు రూపాయల డాక్టర్.. రెండు రూపాయల డాక్టర్' అని పిలుస్తుంటారు. ఇతర డాక్టర్లు ఒక్క ఒపికి వందల్లో ఛార్జ్ చేస్తుంటే డాక్టర్ గోపాల్ మాత్రం పేషంట్ స్తోమతను బట్టి రూ. 40, రూ. 50 మాత్రమే తీసుకునేవారు. అలా వైద్యం ఖరీదైన తరుణంలో డాక్టర్ గోపాల్ మాత్రం వైద్యంలో దాతృత్వం, నీతికి చిహ్నంగా నిలిచారు. వైద్యుడిగా సేవలందిస్తుండగా.. ఓ రోగి దారుణమైన పరిస్థితిని చూసి చలించిపోయారు. అలా ఆయన ప్రయాణం స్వచ్ఛంద సేవతో ప్రారంభమైంది. నాటి నుంచి రోజూవారి దినసరి కూలీలు, విద్యార్థులకు, పేదలకు అందుబాటులో సరసమైన వైద్యాన్ని అందించేందుక తనను తాను అంకితం చేసుకున్నారు.

# ధర్మస్థలిలో బయటపడుతున్న మరిన్ని మానవ అవశేషాలు

### బెల్తంగడి స్టేషన్‌లో మొత్తం రికార్డులు ధ్వంసం




**ధర్మస్థలి(కర్ణాటక),ఆగస్టు 3:** కర్ణాటకలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మస్థలంలో జరుగుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తవ్వకాలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా వందలాది మందిని హత్య చేసి పూడ్చిపెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో, అధికారులు తవ్విన కొద్దీ పుర్రెలు, మానవ ఎముకలు బయటపడటం తీవ్ర కలకలం రేపుతోంది. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే 2000-2005మధ్య సంభవించిన అసహజ మరణాల రికార్డులను ఒక పద్ధతిప్రకారం తొలగించినట్లు తేలింది. ఆర్టీఐ దరఖాస్తుతో మొత్తం వెలుగులోకి వచ్చింది. ఇదే అంశాన్ని ఆర్టీఐ కార్యకర్త జయంత్ సిట్‌కు ఫిర్యాదు చేసారు.తమ వద్ద ఉన్న పత్రాలు, రికార్డులు, రిపోర్టులు, వాల్‌పోస్టర్లు, నోటీసులు, ఫోటోగ్రాఫ్‌లు సాధారణపరిపాలన ఆదేశాలమేరకు నాశనంచేసినట్లు బెళ్తంగడిపోలీసులు చెప్పారని జయంత్ ఫిర్యాదులో వివరించాడు. దీనితో మొత్తం సమగ్ర తవ్వకాల్లో ఒకచోట చిరిగిన ఎరుపు రంగు జాకెట్‌తో పాటు లక్ష్మి అనే మహిళకు చెందిన పాన్ కార్డు కూడా దొరకడం దర్యాప్తులో కీలక ఆధారంగా మారింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే, నేడు జయన్ టి. అనే మరో సాక్షిముందుకొచ్చాడు. 15 ఏళ్ల క్రితం 15 ఏళ్ల బాలిక మృతదేహాన్ని రహస్యంగా పూడ్చిపెట్టడం తాను చూశానని ఆయన చెప్పడంతో సిట్ అధికారులు ఆ దిశగా కూడా దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, ఈ కేసులో మీడియా కవరేజీని నిలుపుదల చేస్తూ గతంలో జారీ అయిన గ్యాగ్ ఆర్డర్‌ను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. 19952014 మధ్య కాలంలో ధర్మస్థల పరిసరాల్లో దాదాపు 250 మిస్సింగ్ కేసులు నమోదైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. 2013 నాటి సౌజన్య అనే విద్యార్థిని హత్య కేసు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజా ఆరోపణల నేపథ్యంలో పాత కేసుల దస్త్రాలు మళ్లీ తెరుచు కుంటున్నాయి. ధర్మస్థల దేవాలయం శ్మశాన వాటికగా మారిపోయిందని సిపిఐ నేత నారాయణ తీవ్రంగా ఆరోపించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులను వెంటనే అరెస్ట్ చేసి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. సిట్ దర్యాప్తు ముమ్మరంగా సాగుతుండటంతో, ఈ హత్యల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది త్వరలోనే తెలుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## ఓటరు సరళిని మార్చేందుకు ఎన్నికల సంఘం కుట్రలు

### కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ధ్వజం



**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** రాష్ట్రాల ఎన్నికల నిర్మాణం, ఓటరు సరళిని మార్చేందుకు ఈసీ ప్రయత్నిస్తోందని ఇది అధికార దుర్వినియోగం అవుతుందని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఆరోపించారు. దీన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా వ్యతిరేకించాలన్నారు. బీహార్‌లో 65లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కునే కోల్పోయే ప్రమాదం ఉందని తమిళనాడులో 6.5లక్షల మంది ఓటర్లు పెరగడం ఆందోళనకరమైన చర్యఅని, చట్టవిరుద్ధమని సోషల్ మీడి యా పోస్టులో పేర్కొన్నారు. ప్రజలు శాశ్వ తంగా వలస వచ్చా రని చెప్పడం వలన కార్మికులను అవమానించడమేనని తమిళనాడు ప్రజలు ప్రతినిధులను ఎన్నుకునే హక్కులో ప్రత్యక్షజోక్యమన్నారు. ఛత్‌పూజ వంటి పండుగల సమయాల్లో వసల కార్మికులు తమ సొంత రాష్ట్రానికి తిరిగి రాగలిగినప్పుడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరిగి రాలేరా అన్న ప్రశ్నను ఆయన లేవనెత్తారు.



## రష్యాలో బద్దలైన అగ్నిపర్వతం

### పరుగులు తీసిన ప్రజానీకం

**మాస్కో,ఆగస్టు 3:** రష్యాలో ప్రకృతి ప్రకోపం కొనసాగుతోంది. ఒకవైపు భారీ భూకంపం, మరోవైపు అగ్నిపర్వతాల విస్ఫోటనంతో అటుడుకుతోంది. ఆదివారం కురిల్ దీవుల్లో శక్తివంతమైన భూకంపం సంభవించగా, సమీపంలోని కమ్చట్కా ద్వీపకల్పంలో అగ్నిపర్వతాలు లావాను వెదజల్లుతున్నాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.0గా నమోదైనట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే, జపాన్ వాతావరణ శాఖ ధృవీకరించాయి. భూకంపం ధాటికి భవనాలు తీవ్రంగా కంపించడంతో, ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. దీని తీవ్రత దృష్ట్యా రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలను జారీ చేసింది. ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. దాదాపు 600 సంవత్సరాలుగానిద్రాణంగా ఉన్న క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం ఒక్కసారిగా విస్ఫోటనం చెందింది. ఈ విస్ఫోటనంతో సుమారు 6,000 మీటర్ల ఎత్తు వరకు బూడిద ఎగసిపడినట్లు రష్యా అధికారులు తెలిపారు. దీనితో పాటు, అత్యంత చురుగ్గా ఉండే క్ల్యుచెవ్‌స్కీ అగ్నిపర్వతం కూడా బద్దలైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.



## అమెరికా జైలులో తెలుగు యువకుడి ఆత్మహత్య

**ఎడ్మండ్ (యుఎస్ఎ), ఆగస్టు 3:** అత్యాచారం కేసులో అమెరికా జైలులో శిక్ష అనుభవిస్తున్న తెలుగు యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ముగ్గురు బాలికలపై అత్యాచారానికి పాల్పడిన కేసులో జైలులో ఉన్న జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్లకు చెందిన కుర్రె ముల సాయికుమార్ (31) జులై 26న కారాగారంలోనే ఆత్మ హత్య చేసుకున్నాడు. నెల్లుట్లకు చెందిన ఉప్పలయ్య, శోభ దంపతుల కుమా రుడు సాయికుమార్ పదేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడే ఉద్యోగం చేస్తూ ఒక్లహోమా రాష్ట్రంలోని ఎడ్మండ్‌లో భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో 15 ఏళ్ల బాలుడిగా నటిస్తూ ముగ్గురు బాలికలపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అలాగే తనతో శారీరక సంబం ధానికి అంగీకరించని మరో 19 మంది బాలికల అసభ్య చిత్రాలను సోషల్ మీడియాలో పోస్టు చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు 2023 అక్టోబర్‌లో సాయికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులదర్యాప్తులో సాయి కుమార్‌పై ఆరోపణలు నిజమేనని తేలింది. ఈ కేసులో దోషిగా తేలిన అతనికి ఈ ఏడాది మార్చి 27న అమెరికా కోర్టు 35 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో మానసిక వేదనకు గురైన సాయికుమార్ గతనెల 26న జైలులోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో అతని కుటుంబసభ్యులు అమెరికాకు వెళ్లి, అక్కడే అంత్యక్రియలు పూర్తి చేసినట్లు సమాచారం.

## లేట్‌నైట్ పార్టీలకు వెళ్లొద్దంటూ పోస్టర్ల కలకలం




**అహ్మదాబాద్, ఆగస్టు 3:** లేట్ నైట్ పార్టీలకు హాజరు కావద్దని, అలా వెళ్తే, రేప్ లేదా గ్యాంగ్ రేప్‌కు గురయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తూ కొన్ని పోస్టర్లు అహ్మదాబాద్ నగరంలో దర్శనమిచ్చాయి. మరికొన్ని పోస్టర్లలో నిర్జన ప్రాంతాల్లోకి మీ స్నేహితునితో కలిసి వెళ్లకండి, అలా వెళ్లేవారిపై రేప్ లేదా గ్యాంగ్ రేప్ జరిగితే అన్న హెచ్చరికలు కనిపించాయి. ఈ పోస్టర్లను అహ్మదాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు స్పాన్సర్ చేసినట్లు వార్తలు రావడంతో బీజేపీ పాలిత గుజరాత్‌లోని ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో వీటిని తొలగించారు. దీనిపై ట్రాఫిక్ విభాగం డీసీపీ (వెస్ట్) నీతా దేశాయ్ మాట్లాడుతూ, తాము రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లను మాత్రమే స్పాన్సర్ చేశామని, మహిళల భద్రతపై కాదని చెప్పారు. ట్రాఫిక్ పోలీసుల అనుమతి లేకుండా సతర్క గ్రూప్ అనే ఎన్‌జీవో ఈ వివాదాస్పద పోస్టర్లను తయారు చేసిందన్నారు.దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ స్పందిస్తూ గడచిన మూడేండ్లలో రాష్ట్రంలో 6,500 రేప్‌లు, 36 గ్యాంగ్ రేప్‌లు జరిగాయని ధ్వజమెత్తింది.

## ఆలయదర్శనానికి వెళుతూ నలుగురు వృద్ధులు దుర్మరణం





**న్యూయార్క్,ఆగస్టు 3:** అమెరికాలో నాలుగు రోజుల కిందట అదృశ్యమైన భారత సంతతికి చెందిన కుటుంబం కథ విషాదంతమయ్యింది. గతనెల 29న ఓ ఆధ్యాత్మిక కేంద్రానికి వెళ్తూ వీరు కనిపించకుండాపోయారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైలోయలోకి దూసుకెళ్లినట్టు గుర్తించారు. న్యూయార్క్‌లో నివాసం ఉండే భారత సంతతికి చెందిన ఆశా దివాన్ (85),కిషోర్ దివాన్ (89), శైలేష్ దివాన్ (86), గీతాదివాన్(84)లు వెస్ట్ వర్జీనియాలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం ప్రభుపాద ప్యాలెస్ ఆఫ్‌గోల్డ్‌కు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమా దంలో మృత్యువాతపడ్డారు. శనివారం రాత్రి నలుగురు వృద్ధుల మృతదేహాలను గుర్తించినట్టు మార్షల్ కౌంటీ షెరీఫ్ మైక్ డౌగర్టీ ఆదివారం వెల్లడించారు.

## భారీ వర్షాలతో ముందుగానే ముగిసిన అమర్‌నాథ్ యాత్ర!



**రుద్రప్రయాగ్, ఆగస్టు 3:** ప్రతియేటా అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగే అమర్‌నాథ్ యాత్ర ఈ ఏడాది అనుకున్న దానికంటే ముందుగానే ముగిసింది. ప్రతికూల వాతావరణం, భారీ వర్షాల కారణంగా యాత్రా మార్గాలు తీవ్రంగా దెబ్బతినడంతో, యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని యాత్రను నిలిపివేస్తున్నట్లు జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 9న రక్షాబంధన్ రోజున ముగియాల్సిన యాత్రను, ఆగస్టు 3 నుంచే నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# "అన్నదాత సుఖీభవ -పిఎం కిసాన్" పథకం కింద

## ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం..

- ఏలూరు జిల్లాకు 107 కోట్లు
- ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల ప్రతి హామీని నెరవేర్చుతున్న ఎన్డీఏ ప్రభుత్వాలు.
- ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి.



**ఏలూరు, ఆగస్టు 3 (ప్రభాతవార్త):** అన్నదాతల కుటుంబాల్లో ఆనందం నింపడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందని, దీనికి "అన్నదాత సుఖీభవ" పథకం అమలు చేయడమే నిదర్శనమని ఎంపీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు "అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం" కింద ప్రతి ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఎంపీ మహేష్ కుమార్ వెల్లడించారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన దానికంటే అదనంగా రూ.6,500 లబ్ది రైతులకు చేకూరుతుందని ఎంపీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని రూ.48.86 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,174.43 కోట్లు జమ చేయగా, ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1,60,968 మంది రైతులకు రూ.107.08 కోట్ల లబ్దిచేకూరుతుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. మొదటి విడతలో రాష్ట్రం వాటా రూ.5,000... కేంద్రం వాటా రూ.2,000 చొప్పున ఈరోజు మొదటి విడతగా 7 వేలు నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందని ఎంపీ తెలిపారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున పథకాలు అమలు చేయడమే కాకుండా, బడ్జెట్ లోనూ వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు పెంచారని ఎంపీ స్పష్టం చేశారు.

# బిసి సంక్షేమ హాస్టల్స్ తనిఖీ చేసిన

## రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ సంచాలకులు డి.చంద్రశేఖరరాజు







**ఏలూరు, ఆగస్టు 3 (ప్రభాతవార్త):** ఏలూరు లోని బిసి సంక్షేమ హాస్టల్స్ ను ఆదివారం రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ సంచాలకులు డి.చంద్రశేఖరరాజు తనిఖీ చేశారు. ఏలూరు లోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు బి.సి బాలికల వసతి గృహము నెం. 1 మరియు 2, కళాశాల వసతి గృహం 1,2 లను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనములు, రికార్డు లు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం క్లీన్%ఁ% గ్రీన్ కార్య క్రమం లో పాల్గొన్నారు. వీరి వెంట జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఆర్.వి.నాగరాణి, సహాయ బీసీ సంక్షేమ అధికారి టి. వెంకటేశ్వర్లు వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# నిమ్మల రాఘవేంద్ర ట్రస్టు సేవలు అభినందనీయం....

- శివదేవుని చిక్కాల గ్రామంలో 13 లక్షలతో స్మశాన వాటికను ప్రారంభించిన మంత్రి రామానాయుడు.



**పాలకొల్లు (ప్రభాతవార్త) :** శివదేవుని చిక్కాల గ్రామంలో నిమ్మల రాఘవేంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల గ్రామంలో సి ఎస్ ఆర్ నిధులు 10 లక్షలు, నిమ్మల రాఘవేంద్ర ట్రస్ట్ నిధులు 3 లక్షలు కలిపి 13 లక్షలతో పున నిర్మించిన స్మశాన వాటికను ఆయన ప్రారంభించారు. మంత్రి రామానాయుడుకు ట్రస్ట్ నిర్వాహకులు నిమ్మల రామారావు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కన్న ఊరును, కన్నతల్లి రుణం తీర్చుకోలేనిదని అటువంటి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు రామారావును ప్రశంసించారు. రాష్ట్రంలో మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. జగన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి అప్పుల పాలు చేశాడని రాష్ట్ర విభజన నష్టం కన్నా జగన్ ఐదేళ్ల పాలనలో నష్టమే ఎక్కువ జరిగిందన్నారు. ఈ ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం తీసుకొస్తున్నామని,రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు అమలు చేస్తున్నామని తెలిపారు. పేదరికాన్ని పారద్రోలేలా మార్గదర్శకుల సహకారంతో పి-4 ను అమలు చేస్తున్నామని చెప్పారు.ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అన్నింటినీ అమలు చేసామని పెన్షన్ సొమ్ము పెంపు, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి





13 వేలు, డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పరీక్షలు, అన్నా క్యాంటీన్లో పునరుద్ధరణ, గుంతలు లేని రోడ్లు, మత్స్యకారులకు వేట నిషేధ సాయంగా 20 వేల చొప్పున అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ట్రస్టు తరఫున మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లను మంత్రి రామానాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఉన్నమట్ల కబర్దీ amc చైర్మన్ కోడి విజయభాస్కర్ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నిమ్మల రామారావు, మోపిదేవి నరసింహ నాయుడు సర్పంచ్ దిడ్ల మని వజ్రం సాధన ఉదయ భాస్కర్, సొసైటీ చైర్మన్ వద్దే సోమచంద్రశేఖర్, కోటిపల్లి చిన్నబాబు, గన్నబత్తుల శివ గణేష్, పాముల రజని కుమార్ కలిదిండి రామ చంద్రరాజు, ఇంటి శ్రీరాములు, సొసైటీ చైర్మన్ కామిశెట్టి రంగారావు తదితరనాయకులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ పథకంలో జిల్లాలో 1,60,968 రైతులకు లబ్ధి



**ఏలూరు/ కామవరపుకోట, (ప్రభాతవార్త) :** అన్నదాత సుఖీభవ పథకంలో ఏలూరు జిల్లాలోని 1,60,968 రైతులకు రూ. 107. 08 కోట్ల రూపాయలు అందించామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. కామవరపుకోటలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం రైతులతో పండగ లాంటి వాతావరణంలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ తో కలిసి పాల్గొని, రైతులకు అన్నదాతా సుఖీభవ పథకంలో రూపాయల చెక్కును అందజేశారు. ముందుగా కార్యక్రమాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ రైతుని జిల్లాలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో గుర్తించి వారి ఖాతాలలో 7 వేల రూపాయలు చొప్పున అందించడం జరిగిందన్నారు. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. కామవరపుకోటలో పండుగ వాతావరణంలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రైతులకు సబ్సిడీ పై ఎరువులు విత్తనాలు అందిస్తున్నామని, గత రబీ, ఖరీఫ్ సీజన్లో 1088 కోట్ల రూపాయలు విలువైన ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేసి, 24 గంటలలోగా రైతుల ఖాతాలకు నగదు జమ చేశామన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నామని, జిల్లాలో ఇంతవరకు 50 డ్రోన్లు సబ్సిడీ పై రైతాంగానికి



అందించామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 8 మంది రైతులకు డ్రోన్లు అందించామని, అర్హత, ఆసక్తి కలిగిన వారు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే డ్రోన్లు అందిస్తామన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. అర్హత కలిగిన కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు జారీచేసి సాగుకు రుణాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో కోకో రైతుల సమస్యలు పరిష్కరించామన్నారు.

# వార్డుల్లో కూటమి తొలి అడుగు కార్యక్రమం





**నరసాపురం (ప్రభాతవార్త) :** నరసాపురం పట్టణంలోని 28వ వార్డులో "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి చైర్మన్ & రాష్ట్ర మైనారిటీ అఫైర్స్ అడ్వైజర్ మహమ్మద్ అహమ్మద్ షరీఫ్, నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. మరియు రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ మాజీ చైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, ఉల్లంపర్తి సత్యన్నారాయణ, . మూర్తి, జల్ల నాగేశ్వరరావు, తిరుమాని హేమంత్, దేశెట్టి సత్యన్నారాయణ, దొంగ పద్మారావు, వెలగన రామకృష్ణ,సిర్రా సంజయ్ రాజు, శిరం సాయి, ఐక్యంచెట్టి రాజేష్, కోళ్ల రవిప్రసాద్, నాగిడి రాంబాబు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# ఆకివీడు-దిగమర్రు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి గ్రీన్ సిగ్నల్

- త్వరలోనే పనులు ప్రారంభం.



**భీమవరం ఆగస్టు 3(ప్రభాతవార్త) :** నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంతో కీలకమైన ఆకివీడు-దిగమర్రు ఎన్. హెచ్ -165 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సంవత్సరమే2025-2026 ఈ ప్రాజెక్ట్ పనులను ప్రారంభిస్తామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ మంగళగిరిలో కీలక ప్రకటన చేశారు. కేంద్ర మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ అభ్యర్థన మేరకు రూ. 2,500 కోట్ల అంచనా వ్యయంతో 45 కిలోమీటర్ల పొడవైన గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మంగళగిరిలో జరిగిన సభలో ప్రకటించడం పట్ల కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తన కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత 10 నెలలుగా ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేందుకు తాను చేసిన కృషి ఫలించిందని, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి కీలకమైన ఆకివీడు-దిగమర్రు %ఁ%-165 కు అనుమతులు సాధించేందుకు కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీని పలు దఫాలుగా కలిసి ఈ ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతను తెలియజేయడంతోపాటు జాతీయ స్థాయిలో డీజీ, ఎన్. హెచ్. ఏ1 ఉన్నతాధికారులను కలిసి ప్రాజెక్టు టెక్నికల్ సమస్యలను పరిష్కరించి, తిరిగి సర్వే చేయించడం, అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించడం జరిగిందన్నారు. తన అభ్యర్థన మేరకు ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రాజెక్ట్ పనులు ఈ సంవత్సరమే ప్రారంభిస్తామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించడం నర్సాపురం పార్లమెంట్ ప్రజలకు ఎంతో ఆనందాన్ని ఇచ్చే విషయం అన్నారు. అత్యాధునికమైన, సురక్షితమైన జాతీయ రహదారిని త్వరలో నర్సాపురం పార్లమెంట్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాను అని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంతో డెల్టా ప్రాంతంలో రవాణా వ్యవస్థ మెరుగుపడి, ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు లభిస్తాయని, భీమవరం పట్టణానికి ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సానుకూలంగా స్పందించి అనుమతి ఇచ్చి సహకరించిన కేంద్రమంత్రి శ్రీ నితిన్ గడ్కరీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి నుండే శ్రీవార్ల ఆలయ పవిత్ర ఉత్సవాలు



**ఆగిరిపల్లి ఆగస్టు 3 (ప్రభాతవార్త):** శ్రీ వార్ల ఆలయ పవిత్ర ఉత్సవాలు నాలుగో తేదీ కార్యనిర్వహణాధికారి సిహెచ్ సాయి తెలిపారు. సుప్రభాత సేవ శ్రీ శోభనాచల వ్యాఘ్ర దేవతలకు స్నపన , విశేష అలంకరణ పుణ్యాహవాచన అఖండ దీపారాధన అర్చక అంకురార్పణ తదితర కార్యక్రమాలు మంగళవారం విశ్వక్సేన పూజ పుణ్యాహవాచన ప్రతిష్ఠాపన సహస్రనామార్చన పవిత్రములకు హోమము శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ నర్వదేవత ఆహ్వానము పవిత్రముల సర్వదైవత్య శాంతి హోమం చతుర్వేద తేదీన బుధవారం శ్రీ స్వామివారికి విశేష అర్చన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి నుండి ప్రారంభమవుతున్నట్లు ఆలయ నాలుగవ తేదీ సోమవారం ఉదయం లక్ష్మీనరసింహస్వామి వాళ్లకుపరివార సాయంత్రం విశ్వక్సేన పూజ ఆచార్య రుత్విక్ యజమాన దీక్ష ధారణ నిర్వహించబడతాయి. ఐదవ తేదీ పంచగవ్య ఆరాధన ప్రాసన అగ్ని ప్రోక్షణ అభి మంత్రణ అకల్మష సాయంత్రం శ్రీవార్లకు విశేష అర్చన ధాన్యాదివాసము హోత్ర ప్రశంస పారాయణలో నిర్వహించబడును. ఆరవ కలిసి ఆరాధన విశేష అలంకరణ శ్రీ లక్ష్మీనరసింహ సుదర్శన మూలమంత్ర హోమము స్వయం వ్యక్త శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారలకు దివ్య సన్నిధి శ్రీ స్వామివార్లకు ఉపాలయ మూర్తులకు పవిత్రముల సమర్పణ సాయంత్రం నవ కుంభారాధన పరమాత్మకోపాని షిత్ పూర్వక మహా శాంతి హోమం నిర్వహించబడును ఏడవ తేదీన గురువారం శ్రీ స్వామివారికి విశేషాలు నిత్య హోమములు శ్రీ లక్ష్మీనరసింహ సుదర్శన మూలమంత్ర హోమము పవిత్రములు విసర్జన మహా పూర్ణాహుతి శ్రీ గూనీలా సమేత శ్రీ శోభనాచల యాత్ర లక్ష్మి నరసింహ స్వామి వారలకు శాంతి కళ్యాణము పవిత్రముల వితరణ కార్యక్రమంలో నిర్వహించబడును. ఈ కార్యక్రమంలో వేదాంతం గోపాలకృష్ణమాచార్యులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి వారి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు అర్చకులు గుడిపూడి అనంత కృష్ణ లీల మనోహర్ లచే నిర్వహించబడును . ఈ స్వామివారి పవిత్రోత్సవ కార్యక్రమములు బ్రాహ్మణ సమాజం భక్తుల శ్రీవారి అర్చక స్వాముల సహాయ సహకారంతో జరుగుచున్నవని ఆయన తెలిపారు.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అర్జీదారులను

## ఆరా తీసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



**ఏలూరు (ప్రభాతవార్త) :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారులు సంతృప్తిపై జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆరా తీశారు. శనివారం సాయంత్రం కొంతమంది పిజిఆర్ఎస్ అర్జీదారులకు ఫోన్ చేసి, ముఖ్యంగా నాణ్యత, సంతృప్తికరమైన పరిష్కారం లభించిందా అని కలెక్టర్ స్వయంగా ఫిర్యాదుదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మాత్రమే ప్రాధాన్యత పరిమితం కాకుండా సదరు సమస్య పరిష్కారం ద్వారా ప్రజల సంతృప్తి స్థాయి పెరిగి సుపరిపాలనకు నిజమైన అర్థం తీసుకువచ్చేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. పరిష్కారమైన దరఖాస్తులకు సంబంధించి దరఖాస్తుదారులకు జిల్లా కలెక్టర్ స్వయంగా ఫోన్ చేసి వారి సమస్య పరిష్కారం, క్షేత్రస్థాయిలో అధికారులు తీసుకున్న చర్యలు, ప్రజల సంతృప్తి స్థాయిని ప్రజలను అడిగి తెలుసుకుంటున్నారు. ఏలూరు గొల్లాయిగూడెంకు చెందిన సిహెచ్. లక్ష్మి తన రైస్ కార్డు మాపింగ్ సక్రమంగా జరగలేదని పిజిఆర్ఎస్ లో దరఖాస్తు చేయగా వెంటనే పరిష్కరించారు. సమస్య పరిష్కారంపై జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి లక్ష్మి కి ఫోన్ చేసి పరిష్కారంపై సంతృప్తి ని అడిగి తెలుసుకున్నారు. చాలా కాలంగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్య, మీ వద్దకు వచ్చి తెలియజేయగానే పరిష్కారం అయ్యిందని సంతోషంతో కలెక్టర్ కు లక్ష్మి కృతజ్ఞతలు తెలియజేసారు.

# శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో 5 న చండీ హోమం

**జంగారెడ్డిగూడెం,(ప్రభాతవార్త):** జంగారెడ్డిగూడెం పట్టణంలోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవాలయం నందు ఈనెల 5వ తేదీ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారు జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకొని 33వ చండీ హోమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ వారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం రాత్రి 8 గంటలకు అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. ఈ చండీ హోమం నందు నలుగురు దంపతులు మాత్రమే ఉ భయదారులుగా పాల్గొనే అవకాశం కలదని, హోమం నందు ఉభయదారులుగా పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కమిటీ వారిని సంప్రదించి పేర్లను నమోదు చేయించుకోవాలని వారు తెలిపారు.

# సైబర్ నేరాలపై అవగాహన



**ఆగిరిపల్లి ఆగస్టు 3 (ప్రభాతవార్త) :** సైబర్ నేరాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆగిరిపల్లి ఎస్సై కె శుభశేకర్ సూచించారు. మండల పరిధిలోని వడ్లమాను గ్రామ సమీపాన వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తూ ట్రాఫిక్ రూల్స్ ను ప్రతి ఒక్కరూ పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అధిగమించితే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఎస్ఐతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదంతో వ్యక్తికి తీవ్ర గాయాలు



**నూజివీడు, ఆగస్టు01 (ప్రభాతవార్త):** విద్యుత్ షాక్ ప్రమాదంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన జరిగింది. నూజివీడు మండలం దేవరగుంట గ్రామం చల్ల వెంకటరావు శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కి గురై ట్రాన్స్ఫారం మీద నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని నూజివీడు అమెరికన్ హాస్పిటల్ లో జాయిన్ చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు , తదితరులు అతనిని పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆశ్రమం హాస్పిటల్ కు పంపించడం జరిగినది.

# టి.నర్సాపురం రైతులకు ఎలాంటి న్యాయం జరగలేదు

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త:టి. నర్సాపురం ప్రాథమిక సహకార సొసైటీ లోని రైతులకు ఎలాంటి న్యాయం జరగలేదని, వారికి తగు న్యాయం చేయాలని ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మరియు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులను టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి కోరారు. భీమడోలు క్యాంపు కార్యాలయంలో ఆదివారం గన్ని వీరాంజనేయులును కొండపల్లి రవి కలిసి గత వైసిపి ప్రభుత్వంలో టీ. నర్సాపురం ప్రాథమిక సహకార సొసైటీలో రూ.100 కోట్ల మేరకు అవినీతి జరిగిందని,దీనిపై 51 ( ఏ) విచారణ జరిపి సంబంధిత అధికారిపై కేసు నమోదు చేశారని, కానీ రైతులకు ఎలాంటి న్యాయం జరగలేదని వివరించారు. చిన్న ,సన్న కారు రైతులు పిల్లల చదువుల కోసం, ఆరోగ్య అవసరాల కోసం, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా దాచుకున్న డిపాజిట్లు రాక చాలా



ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

# పేరుపాలెం మిస్సింగ్ కేసును చేదించిన పోలీసులు



మొగల్తూరు ఆగస్టు 3 (ప్రభాతవార్త) మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన ఆలమల్లు రామాంజనేయులు అనే వ్యక్తి ఆరు సంవత్సరాల క్రితం అదృష్టమైన కేసును చేదించినట్లు మొగల్తూరు ఎస్సై జి.వాసు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం 2019 మే 14వ తేదీన రామాంజనేయులు అదృశ్యమైనట్లు అప్పటి ఏఎస్ఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలైంది అన్నారు. హైదరాబాదులో పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన ఆలమల్లు రామాంజనేయులు అదృశ్యమైన వ్యక్తిని ఎంతో సాంకేతిక విశ్లేషణ మరియు క్షేత్రస్థాయిలో మద్దతు ఉపయోగించి మొగల్తూరు పోలీసులు హైదరాబాదులో అతను వివరాలు కనుగొన్నట్లు తెలిపారు.

# తేతలి-నల్లమిల్లి వారి నిశ్చితార్థ వేడుకకు హాజరైన ప్రముఖులు

పెనుమంట్ర-ప్రభాతవార్త,: తేతలి-నల్లమిల్లి వారి నిశ్చితార్థ వేడుకకు పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. తేతలి సుధీర్ రెడ్డి భాగ్యలక్ష్మి దంపతుల కుమార్తె శ్రీవిద్య, నల్లమిల్లి జగన్మోహన్ రెడ్డి పార్వతి దంపతుల కుమారుడు హర్ష నిశ్చితార్థ వేడుక అత్తిలి బాలాజీ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ మంత్రి, ఆచంట మాజీ శాసనసభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆయన కుమారుడు నరేష్ రాజు, గూడూరి ఉమాబాల, కవురు శ్రీనివాస్ హాజరై కాబోయే నవ దంపతులను ఆశీర్వదించారు. ఈ నిశ్చితార్థ వేడుక బంధువులు, స్నేహితులు, రాజకీయ నాయకులు సందడితో అట్టహాసంగా సాగింది.



# మానవతా హృదయం... సహాయక హస్తం

## వృద్ధునికి వసుధ ఫౌండేషన్ రూ.10,000 ఆర్థికసాయం

పోడూరు, ఆగస్టు 03,ప్రభాత వార్త : పాలకొల్లులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెనుమత్స బుద్దరాజు, పెనుమత్స జగపతిరాజు కలిసి, సత్యనారాయణరాజు కుమారుడు వీర్రాజుకు అందజేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని వసుధ ఫౌండేషన్ ద్వారా మంజూరు చేయించారు. నర్సాపురం మండలం మానవత్వం మళ్లీ ఒకసారి వెలుగులా మెరిసింది. దర్భ రేవు గ్రామానికి చెందిన చేకూరి సత్యనారాయణరాజు (85) గత కొంతకాలంగా పెరాలసిస్ వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. వృద్ధాప్యం, ఆరోగ్య సమస్యల మధ్య ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఈ విషయం తెలిసిన వెంటనే వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు స్పందించి, మానవతా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఇలాంటి



సంక్షోభ సమయంలో మాకెవరో ముందుకొచ్చి మానవతా దృక్పథంతో చేయూతనిచ్చారు. మంతెన వెంకట్రామరాజు గారి వంటి మనుషులు సమాజానికి పథప్రదాతలు అంటూ కృతజ్ఞతలు తెలిపారు. వసుధ ఫౌండేషన్ తరపున ఎప్పుడూ మానవతా కార్యకలాపాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చే మంతెన వెంకట్రామరాజు సమాజంలో ఇలాంటి అవసరమైన వారికి అండగా నిలవడం మన కర్తవ్యం అని పేర్కొన్నారు.

# జిన్నూరులో వంతెనకు నూతన జీవం

## రెండు నెలల్లో పూర్తయ్యేలా పనులు వేగవంతం

పోడూరు,ఆగస్టు 03,ప్రభాత వార్త: మండలంలోని జిన్నూరు గ్రామం మెయిన్ రోడ్డుపై ఉన్న వంతెన దెబ్బతినడంతో స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాకాలంలో వంతెనపై ఏర్పడిన బీటలు, చీలికలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న తరుణంలో ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. వంతెన వద్ద అధికారులతో కలిసి పరిశీలన చేసిన ఆయన, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వంతెన ప్రజల ప్రాణాలకు సంబంధించినది. ఎలాంటి జాప్యం లేకుండా, వంతెన అప్రోచ్ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను కఠినంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గతంలో ఈ వంతెన అప్రోచ్ నిర్మాణానికి ప్రభుత్వం 2016లో రూ.1.23 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. 2019 వరకు కొంతవరకు పనులు కొనసాగినా, తర్వాత అధికార మార్పుతో పనులు నిలిచిపోయాయి. మంత్రివర్యులు వివరిస్తూ అదే సమయంలో వచ్చిన ఇన్‌చార్జులు కేవలం కుర్చీలు



ఆక్రమించి అధికారాన్ని అనుభవించారు తప్ప, ప్రజల కోసం పని చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 2024లో మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తక్షణమే ప్రజల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చింది. ఈ వంతెన పనులను రెండు నెలల్లో పూర్తయ్యేలా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వంతెన పూర్తైతే, జిన్నూరు గ్రామం సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు రాకపోకలలో మేలు కలుగుతుంది. వాణిజ్యానికి, విద్యార్థులకు, అత్యవసర సేవలకు ఇది ముఖ్యమైన మార్గం కావడంతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# వర్షాకాలంలో రొయ్యల సాగు పై వాటర్ బేస్ ఆధ్వర్యంలో అవగాహన శిబిరం

తాడేపల్లిగూడెం ఆగస్టు 3, ప్రభాత వార్త :వర్షాకాలం లో రొయ్యల సాగుదారులకు పెద్ద సవాళ్లను తీసుకువస్తుంది, వాటిని అధిగమించి రొయ్యల సాగు విజయవంతంగా చేయడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ది వాటర్ బేస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఎం. శక్తి అన్నారు. ఈ మేరకు ఆదివారం వాటర్ బేస్ ఆధ్వర్యంలో రొయ్యల రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు చెరువు ఉప్పుదనంని (సెలినిటీ) గణనీయంగా తగ్గించి, నీటి ఉష్ణోగ్రతలను తగ్గిస్తుంది, అలాగే చెరువు నీటిలో కరిగిన ఆక్సిజన్ (డిఓ), పీహెచ్ వంటి కీలకమైన నీటి నాణ్యత పరిమితులను మారుస్తుందన్నారు. సాధారణంగా వర్షం కురిసిన తర్వాత రెండు నుండి మూడు రోజులలో రొయ్యలు మరణాలు సంభవిస్తాయని, ఇవి అనాక్సియా (ఆక్సిజన్ లేకపోవడం), ఐస్కెమ్యా, ఒకదానిని ఒకటి తినడం, హైడ్రోజన్ సల్ఫైడ్ విషతత్వం (హెచ్ టు ఎస్ టాక్సిసిటీ) మరియు అధిక వర్షం వల్ల రొయ్యల మౌల్టింగ్ లలో మార్పుల వంటి కారణాల వల్ల సంభవిస్తాయన్నారు. ఈ పరిస్థితులు తరచుగా మినరల్ సమతుల్యతను దెబ్బతీస్తాయి మరియు విబ్రియో వంటి రోగకారక బ్యాక్టీరియాకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తాయన్నారు. నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ స్థాయిలను (డిఓ) నిలుపుకోవడం కోసం ఏరియేటర్లను నిరంతరం తిప్పడం, ముఖ్యంగా రాత్రి సమయంలో తిప్పాలి. నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ (డిఓ) తగ్గితే వెంటనే ఆక్సిజన్ బూస్టర్లను వాడాలన్నారు. భారీ వర్షపు సమయంలో ఆహారాన్ని 30 నుంచి 50 శాతం తగ్గించి, రొయ్యల కదలికలు మరియు నీటి నాణ్యత సాధారణ స్థితికి వచ్చిన తర్వాత మాత్రమే మేతలు అవసరమైన మేరకు ఇవ్వడం వంటి స్మార్ట్ ఫీడింగ్ పద్ధతులను అనుసరించాలన్నారు. వీటితోపాటు మరికొన్ని తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ, వర్షాకాల సీజన్ సమయంలో రొయ్యల సాగుదారులు పంటను రక్షించుకోవడానికి ఈ ముఖ్యమైన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రొయ్యల సాగు చేస్తున్న రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 5న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లు భర్తీ కోసం ఈనెల 5వ తేదీ ఉదయం 10:30 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఎవిఎస్‌వి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్ మెకానికల్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్ సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. టెన్త్ పాస్ అయి ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు. దరఖాస్తుదారులు ఈ నెల నాలుగో తేదీలోపు నేరుగా జంగారెడ్డిగూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కు అందజేయాలన్నారు. సీటు పొందిన విద్యార్థులు సంవత్సరానికి రూ.4.700 ఫీజు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. వివరాలకు ప్రిన్సిపాల్ మొబైల్ నెంబర్ 90102 22162 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

# నా మొక్క నా శ్వాస కార్యక్రమం



అత్తిలి -ఆగస్టు 3( ప్రభాతవార్త): విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంకు అనుబంధంగా ఉన్న ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని అత్తిలిఆశ్రమం ప్రాంగణంలో నా మొక్క నా శ్వాస కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 వివిధ రకాల మొక్కలను సభ్యులకు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం జూలై,ఆగస్టు నెలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొక్కలను సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని తెలిపారు పెద్ద సంఖ్యలో పీఠం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10న వెంకటేశ్వర బధిర పాఠశాల 40వ వార్షికోత్సవ వేడుకలు



భీమవరం ఆగష్టు 3 ప్రభాతవార్త : మూగ చెముడు (శ్రీవెంకటేశ్వర బధిర) పాఠశాల 40వ వార్షికోత్సవ వేడుకలను పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు బాధిరుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి, అధ్యక్షులు సిహెచ్ తాతారావు తెలిపారు. ఆదివారం భీమవరం వెంకట్రామ ధియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో వేడుకల బ్రోచర్ ను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్త బధిర అసోసియేషన్ల ఆహ్వాన మేరకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని, 1985 సంవత్సరంలో ఈ పాఠశాల టిటిడి యాజమాన్యం ఆధ్వర్యంలో డిఎన్నార్ పాలకవర్గం సహకారం సౌజన్యంతో ప్రారంభించారని, అపూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న డిఎన్నార్ రామకృష్ణ సభ భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 8, 18వ తేదీ, సెప్టెంబర్ 3న వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామని, నేటి వరకు ఉన్న గురువులను సత్కరిస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థులందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గొట్టుముక్కల శ్రీనివాస్ రాజు, వి రాము, ఆర్ ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బండి ప్రసాద్ కు మానవత అభినందన జ్ఞాపిక




పెనుమంట్ర-ప్రభాతవార్త :పెనుమంట్ర మానవత శాఖ కార్యదర్శి బండి ప్రసాద్ కు మానవత వ్యవస్థాపకులు ఎన్ రామచంద్ర రెడ్డి చేతుల మీదుగా మానవత మానవత అభినందన జ్ఞాపిక ఆదివారం అందుకున్నారు. మానవత విలువలుతో కూడిన సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకుగాను ఈ జ్ఞాపక ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మండలలో చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి బండి ప్రసాద్ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, పూర్వాధ్యక్షులు కర్రి కృష్ణ రెడ్డి, ట్రెజరర్ అమృతవాక్కుల సత్యనారాయణ, రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, ఈసి ఎడ్యుకేషన్ పడాల సువర్ణ గౌరి పాల్గొన్నారు.

# మంచిలిలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు 416 మంది

అత్తిలి- ఆగస్టు 3 (ప్రభాతవార్త ) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి మొదటి విడత గా 7 వేలు రూపాయలను రైతుల ఖాతాలలో వేయడం జరిగిందని గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు శిరగాని నాగేశ్వరరావు (నాగు) అన్నారు. మంచిలి గ్రామానికి చెందిన 416 మంది రైతులకు 29 లక్షల 12 వేల రూపాయలు జమ కానున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ



మొగల్తూరు ఆగస్టు 3 (ప్రభాతవార్త) 216 నేషనల్ ఆనుకుని ఉన్న ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయమునందు ఆదివారం రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శేష వస్త్రంతో సత్కరించి, లడ్డు ప్రసాదములు అందజేశారు, ఈ కార్యక్రమంలో కోమటి రవి, నాగిడి భగవాన్, దొంగ శ్రీ ఏడుకొండలు, బెల్లపు నాగేశ్వరరావు, బంధ న శ్రీనివాసరావు, తదితరులు కూటమి నాయకులు పాల్గొన్నారు

# సొసైటీ ఇన్ ఛార్జీల పాలన గడువు పెంపు

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: ఉమ్మడి జిల్లాలో పాలక వర్గాలు లేని సహకార సొసైటీలకు పర్సన్ ఇంచార్జిల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ సహకార శాఖ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పెంచిన గడువు జూలై 31తో ముగయడంతో ఏలూరు జిల్లాలో 192 సొసైటీలకు పశ్చిమలో 60 సొసైటీలకు పర్సన్ ఇంచార్జిల పదవీ కాలాన్ని వచ్చే ఏడాది జనవరి 30 వరకు పొడిగించారు. పదవి ఇంచార్జిలుగా ఉంటూ పదవి విరమణ,బదిలీ అయిన వారి స్థానాల్లో వేరొకరికి బాధ్యతల అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఏలూరు జిల్లాలో ముసునూరు సభ్యుడిగా సిహెచ్ రామారావు బ్రాంచ్ సూపర్వైజర్ బయ్యన్నగూడెం సిరి పల్లికి కొయ్యలగూడెం బ్రాంచ్ మేనేజర్ జి కనకమహాలక్ష్మిని దోర మామిడికి కే విజయ రాజును తిరుమలపురానికి కేవన్ మూర్తి అచ్చయ్యపాలెంనకు జే.విజయ రాజును నియమించారు.

# మావుళ్ళమ్మకు సారె

భీమవరం ఆగష్టు 3 ప్రభాతవార్త : భీమవరం ఇలవేలుపు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి శ్రావణమాసం సందర్భంగా పట్టణం కి చెందిన కారుమూరి సత్యనారాయణ మూర్తి కుటుంబసభ్యులతో కలిసి సారి సమర్పించారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు పూజలుచేసి ఆశీర్వచనాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.



# కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పుట్టినరోజు

## అట్టహాసంగా ఏర్పాట్లు

భీమవరం ఆగస్టు 3 ప్రభాతవార్త : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ జన్మదినం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా బిజెపి నాయకులు భారీ ఏర్పాటు చేశారు. భీమవరంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం సమీపంలోగల కె.ఎస్.రాజు ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ గారి చేతుల మీదుగా ఎన్డీఏ కూటమి నాయకులు, బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమం అనంతరం పేద ప్రజలకు ఉపయోగపడేలా భారీ రక్తదాన శిబిరం, కంటి పరీక్ష శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి అయినంపూడి శ్రీదేవి తెలిపారు. పేద ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఆమె కోరారు. మరోవైపు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని భీమవరం పట్టణంలో బిజెపి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, శ్రీనివాస వర్మ శ్రేయోభిలాషులు భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గతంలో%జ% ఎన్నడూ లేని విధంగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి



పథంలో నడిపిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పుట్టినరోజు వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి అయినంపూడి శ్రీదేవి తెలిపారు. ఆదివారం సాయంత్రం కేఎస్ రాజు ఫంక్షన్ హాల్ లో ఏర్పాట్లను బిజెపి నాయకులతో కలిసి ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు తోట గంగరాజు, కలిదిండి వినోద్ వర్మ, దత్తు ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు కోరా రామ్మూర్తి, ఇంజేటి వెంకటేశ్వర్లు, నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# త్రైత సిద్ధాంత భగవద్గీత విశిష్టత పై ప్రచారం



పాలకొల్లు-ప్రభాతవార్త : పాలకొల్లు మండలం లంకల కోడేరు గ్రామంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథముల ఇందూ ధర్మ ప్రచారము, శ్రీ కృష్ణాష్టమి విశిష్టతపై ప్రచారం నిర్వహించినట్లు త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక - భీమవరం కమిటీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలని, దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటామని అన్నారు. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు, ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలన్నారు. పూర్వం శ్రీ కృష్ణాష్టమి 11 రోజుల పాటు చేసేవారు చివరిగా చవితి రోజున ఊరేగింపు చేసి ముగించేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి కి చెందిన నాగేశ్వరరావు, వాసుదేవ, రాజు, సత్యనారాయణ, శ్రీకర, చైతన్య, లోకేష్, ఆది విష్ణు, హనుమంతరావు, ప్రసన్న, లావణ్య, దుర్గ, భవాని , తారకేశ్వరి, లక్ష్మి, యశోద, ప్రసన్న, హర్షిణి, భానుమతిలు పాల్గొన్నారు.

# తపాలా రిక్రియేషన్ క్లబ్ చే వ్యాసరచన పోటీలు

అత్తిలి- ఆగస్టు 3 (ప్రభాతవార్త) 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తణుకు పోస్ట్ ఆఫీస్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్ వి సుబ్బారావు తెలిపారు. కలం నుండి ఉత్తరంకు, కలంతో రాసిన లేఖలుకుమించి అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇన్ ల్యాండ్ లెటర్ కార్డులో ఆగస్టు 11వ తేదీలోగా అందేలా తణుకు పోస్ట్ ఆఫీస్ కు పోస్ట్ చేయాలని కోరారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చిన తర్వాత తపాలా శాఖ డిజిటల్ ఖాతాల ద్వారా ప్రజలకు మరింత చేరువైనట్లు తెలిపారు. వ్యాసరచన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారికి ఆగస్టు 15న పోస్ట్ ఆఫీస్ ఆవరణలో బహుమతులు అందజేస్తారని తెలిపారు.

# చేనేత కార్మికులచే పాలాభిషేకం.

ఆత్తిలి - ఆగష్టు 3 ( ప్రభాత వార్త ):రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా 200 యూనిట్లు చేనేతలకు ఉచిత విద్యుత్ ప్రకటించిన సందర్భంగా తిరుపతి పురం శివారు శివపురం గ్రామంలో చేనేతకార్మికుల హర్షం వ్యక్తం చేశారు. చేనేతలగుర్తించిన ముఖ్యమంత్రిచంద్రబాబు ,డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో మాజీ చేనేత సొసైటీ అధ్యక్షులు గ్రామ టిడిపి కార్యదర్శి గుడిమెట్ల మల్లేశ్వరరావు పాల్గొని ఇలాగే వచ్చే రోజుల్లో చేనేత కార్మికులు కష్టాలను తీర్చి చేనేత కార్మికులకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో



గ్రామ పార్టీ అధ్యక్షులు పంపన గోపాలం,దేవస్థానం చైర్మన్ బొబ్బ చంటి,బూత్ ఇన్చార్జ్ వాసనాగేశ్వరరావు, దేవస్థానం మెంబర్ వరద నాగమవుళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేణు హాస్పటల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త:తమ హాస్పిటల్ ద్వారా అందించే వైద్య సేవలను జంగారెడ్డిగూడెం పట్టణంతో పాటు ఏజెన్సీ ,మెట్ట పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెంలోని వేణు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ వేణు కోరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నెల 15వ తేదీన వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను జంగారెడ్డిగూడెం సమీపానగల వేగవరం వద్ద విజయ కృష్ణా రెసిడెన్సి లోటస్ లే అవుట్ లలో ప్రారంభించామని తెలిపారు. గుండె వ్యాధుల చికిత్సకు అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశామని,అన్ని రకాల హృద్రోగ సమస్యలపై చికిత్స అందిస్తున్నామని వివరించారు. ఆసుపత్రి ప్రారంభించిన తర్వాత తొలిసారిగా శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు. పోలవరం గ్రామానికి చెందిన రాంబాబు(48) అనే వ్యక్తికి స్టంట్ వేయగా, ప్రస్తుతం ఆయన కోలుకొన్నాడని తెలిపారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందన్నారు. తక్కువ ఖర్చుతోనే స్టంట్ వేయడం



జరిగిందన్నారు. రాంబాబు ను శనివారం డిశ్చార్జ్ చేశామని తెలిపారు. హృద్రోగ రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా జంగారెడ్డిగూడెం లోని వేణు హాస్పటల్లో చికిత్సలు పొందవచ్చునని డాక్టర్ వేణు తెలిపారు.

# ఊరు చెత్త అంతా ఊర చెర్వులోనే -నిలిచిపోయిన చెత్త వాహనాలు

**చాట్రాయి,ఆగష్టు 3,ప్రభాతవార్త** : మండల కేంద్రమైన చాట్రాయి ఊరు చెత్తంతా ఊర చెరువు లోనే పోసే పరిస్థితి ఏర్పడింది. దీంతో చాట్రాయిలో పారిశుధ్యం పడకేసినట్లు అయింది. గతంలో చెత్త బండ్ల ద్వారా చెత్తను సేకరించడం నిలిచిపోవడంతో ఇళ్లల్లో చెత్త పేరుకు పోతుందని పలువు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోజు విడుచు రోజు ఇళ్ల వద్దకు వచ్చి చెత్త సేకరిస్తూ తీసుకుని వెళ్లి డంపింగ్ యార్డ్ నందు పోసేవారు. చెత్త ద్వారా సంపదను సృష్టించాలనే ఆలోచనతో ప్రభుత్వం డంపింగ్ యార్డులను నిర్మాణం చేసింది. సుమారు నాలుగు సంవత్సరాల నుండి ఇళ్ల వద్ద చెత్త సేకరించి తీసుకొని వెళుతుండగా గత 10 మాసాల నుండి చెత్త వాహనాలు రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త వాహనం



చెత్తను సేకరించినందుకు గాను నెలకు 60 రూపాయలు చొప్పున చెల్లించేవారమని దానివల్ల ప్రయోజనం ఉందని ప్రజలు అంటున్నారు.అయితే గతంలో చాట్రాయి లో విపరీతంగా జ్వరాలు రావడంతో చెత్త సేకరించే వ్యక్తులు ఇద్దరు మృతి చెందారు. దీనితో వాహనాల చెక్ పెట్టినట్లు అయింది. ఇళ్ల వద్ద ఉన్న చెత్త బయటకు తీసుకెళ్లి పోసేందుకు ఆలస్యమైతే దుర్వాసన వెదజల్లుతోందని దీనివల్ల దోమలు కూడా ఎక్కువై అనేక రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డ్ లో కాకుండా ఊర చెరువు వద్ద చెత్తను పడేయడం వల్ల జనార్ధన వరం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో దుర్వాసన వెదజల్లుతోంది. డంపింగ్ యార్డ్ వరకు వెళ్లలేక చాలామంది రోడ్డు పక్కనే చెత్త పడేస్తున్నారు. ఊర చెరువు వద్ద కూడా చెత్త వేసేందుకు త్వరలో ఏర్పాటు చేసినప్పటికీ అవి నిండిన పట్టించుకునే నాథుడు లేకపోవడంతో చెత్త దర్శనమిస్తోంది. నూతనంగా చెత్త సేకరించెందుకు తిరిగి వ్యక్తులను నియమించి చెత్త సేకరించే విధంగా చర్యలు చేపట్టాలని చాట్రాయి ప్రజలు కోరుతున్నారు. చెత్త వాహనాలపై గ్రామపంచాయతీ దృష్టి సారించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# 'మహావతార్ నరసింహ' సినిమా రిలీజ్ చేయడం అదృష్టం

## సక్సెస్ మీట్‌లో నిర్మాత అల్లు అరవింద్




**హోంబాలే ఫిల్మ్స్** సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ మహావతార్ నరసింహా. ఈ చిత్రానికి అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్ చైతన్య దేశాయ్ నిర్మించారు. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా జూలై 25న ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గ్రాండ్‌గా రిలీజ్ అయిన ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందుకొని, భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసి, సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతుంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.

సక్సెస్ మీట్ లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, ఈ సినిమాని నేను రిలీజ్ చేసేలా అనుగ్రహించిన నరసింహ స్వామివారికి నమస్కారం. హోంబలే ఫిల్మ్స్ సంస్థతో నాకు మంచి అనుబంధం ఉంది. నిర్మాత విజయ్ ఫోన్ చేసి, ఈ సినిమాని తెలుగులో మీరు విడుదల చేయాలని అని అడిగారు. అంతకుమించి ఏం మాట్లాడుకోలేదు. వెంటనే ఓకే అన్నాను. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు. సినిమా విడుదలైన రోజు మార్నింగ్ షోకి వచ్చిన రెస్పాన్స్‌ని దృష్టిలో పెట్టుకుని ఈవెనింగ్ కొన్ని షోస్ పెంచాం. మరుసటి రోజు నుంచి మరిన్ని స్క్రీన్స్ పెంచుకుంటూ వెళుతున్నాం. 2021లో సినిమాని మొదలుపెట్టి ఎన్నోఒడిదొడుకులు ఎదుర్కొని, పట్టుదలతో సినిమాని మన ముందుకు తీసుకొచ్చారు. ఆ నరసింహ స్వామి వారే వారికి ఈ అద్భుతమైన విజయాన్ని అందించారు. హైదరాబాద్‌లోని ఎఎంబిలో 200 మంది స్వాములు ఈ చిత్రాన్ని చూడటం నాకు చాలా ఆనందంగా అనిపించింది. ఎప్పుడూ థియేటర్స్ రాని ప్రేక్షకులు ఈ సినిమాని వీక్షిస్తున్నారు. మా కుటుంబంలో, సన్నిహితులు, పరిచయం ఉన్నవారందరిలో సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్‌కి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. పవన్ సనాతన ధర్మం గురించి ప్రసంగిస్తే అందరూ ముగ్ధులవుతాం. 'మహావతార్ నరసింహ' చిత్రాన్ని ఆయన చూడాలని, దాని గురించి మాట్లాడాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాని ప్రేక్షకులకు తీసుకెళ్లిన మీడియా వారికి, సహకరించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాల్లు అన్నారు. రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు మాట్లాడుతూ, సినిమాలు చూసే ప్రేక్షకులు తప్పకుండా ఈ సినిమా చూడండి. మీ పిల్లల్ని మొట్టమొదట ఈ సినిమాని చూపించండి. దర్శకుడు ఈ కథని మహాద్భుతంగా నడిపించాడు. ప్రస్తుత సమాజానికి ఏం కావాలో అది ఈ సినిమాలో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద విలన్ తన కుమారుడున్నే చంపడం ఈ సినిమా కథ. ఇంతకంటే గొప్ప స్టోరీ ఎక్కడైనా ఉంటుందా? కేవలం మన పురాణాల్లోనే వుంటుంది. ఆ కథాంశాన్ని పట్టుకుని దర్శకుడు పరమ అద్భుతంగా చిత్రీకరించాడు. విజువల్స్ ఫైట్స్ సంగీతం ఇవన్నీ పరమ అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా ఒక డివైన్ వండర్. అల్లు అరవింద్ గీత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ ద్వారా ఈ దివ్య అద్భుతమైన సినిమా విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. వారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను అన్నారు. రచయిత, నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ, అల్లు అరవింద్‌తో ఎప్పుడు కలిసిన ఒక అద్భుతమైన అనుభూతి. ఈ సినిమా గురించి వారు చెప్పటం, ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడటం జరిగింది. మాకు ఒక సినిమా మొదలైన మూడో నిమిషం నుంచే మేము ఒక గుడిలో ఉన్నామని భావన కలిగించిన సినిమా ఇది. దర్శకుడు అశ్విన్ ఈ సినిమాతో యావత్ ప్రపంచానికి విష్ణుమూర్తిని నరసింహ స్వామిని దర్శనం చేయించేశారు. ఈ సినిమా చూడటం పూర్వజన్మల పుణ్యం. ఒక్కసారి కాదు ఎన్నిసార్లు చూసినా ఒక కొత్త అనుభూతి. పరిపూర్ణమైన సినిమా ఇది. అంత పెద్ద నరసింహున్ని నా జీవితంలో చూసి ఎరగను. స్క్రీన్ అంతా నిండిపోయింది. ఒక ఉద్వేగానికి లోనైపోయాం. ఇది రసాత్మకం కళాత్మకం. ఇది తీసిన వారు రాసినవారు చేసిన వారు చూసినవారు అందరూ ధన్యులే అన్నారు. డైరెక్టర్ అశ్విన్ కుమార్ మాట్లాడుతూ, జై నరసింహ స్వామి. జై జై సనాతన ధర్మం. ఇది సినిమా కాదు ఒక మహాదర్శనమని ప్రేక్షకులే చెబుతున్నారు. ఈ సినిమాకు వచ్చిన ప్రతిప్రశంస నరసింహ స్వామికే చెందుతుంది. గీతా ఆర్ట్స్‌కి హృదయ పూ ర్వక కృతజ్ఞతలు. వారి సపోర్ట్ ని మర్చిపోలేను. వారి సపోర్ట్ తోనే సినిమా పబ్లిక్‌లోకి వెళ్ళింది. ఈ సినిమా ఒక రెవల్యూషన్ కానుంది. అందరికీ థాంక్యూ అన్నారు. ప్రొడ్యూసర్ శిల్పా ధావన్ మాట్లాడుతూ, ఇది యావత్ భారత్ సినిమా. ఈ సినిమా చేయడం నరసింహస్వామి కృపగానే భావిస్తున్నాం. ఈ సినిమాని ఇంత గొప్పగా ఆదరించిన ప్రేక్షకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. నరసింహస్వామి కృపతోనే ఈ మ్యాజిక్ సాధ్యమైంది. ఈ సినిమాని సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అన్నారు.

**సంతోషం** సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఓటీటీ అవార్డ్స్ 2025 కర్టెన్ రైజర్ ఈవెంట్ శనివారం సాయంత్రం హైదరాబాద్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. సీనియర్ నటులు మురళీ మోహన్, నిర్మాత కేఎస్ రామారావు, ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ, నిర్మాత ఏడిద రాజా, రామసత్యనారాయణ స్పాన్సర్స్ సూర్య సెమ్ డైరెక్టర్స్ అనిల్ మరియు డా. సురేష్ బాబు, వివికె హౌసింగ్ ఇండియా ప్రై వెట్ లిమిట్ అధినేత వళ్లూరు విజయకుమార్ తదితరుల ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి విజయ వారహి మూవీస్ సంస్థ ఈ కార్యక్రమానికి కో స్పాన్సర్‌గా వ్యవహస్తున్నారు. అలాగే మ్యూజిక్ పాట్నర్‌గా ఆదిత్య మ్యూజిక్ వ్యవహరిసున్నారు. ఈ సందర్భంగా అతిథులు చేతుల మీదుగా సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఓటిటి అవార్డ్స్ 2025 ఫంక్షన్ డేట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ మాట్లాడుతూ సురేష్ కొండేటితో నాకు సుదీర్ఘ కాల స్నేహం ఉంది. ఆయన మా ఇంటిని అద్దెకు తీసుకుని తన ఫ్యామిలీతో ఒక ఫ్లోర్‌లో ఉంటూ మరో ఫ్లోర్‌లో సంతోషం మేగజైన్ ఆఫీస్ పెట్టుకున్నారు. ఇప్పటికి 24 ఏళ్లుగా సక్సెస్ ఫుల్‌గా ఫిలిం మేగజైన్ నడుపుతున్నారు. ఆయన అందరికీ మిత్రులు. నవ్వుతూ మాట్లాడుతూ ఉంటారు. హైదరాబాద్‌లో ఏదైనా ఈవెంట్ ఘనంగా చేయాలంటే సురేష్ చేయాలి అనేంతగా పేరు తెచ్చుకున్నారు. 24 ఏళ్లుగా సంతోషం ఈవెంట్ చేస్తున్నాం, ఆయనకు ఏం మిగులుతుందో ఏంటో తెలియదు. కష్టపడతాడు. నవ్వుతూ పలకరిస్తాడు. ఆయన సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఓటిటి అవార్డ్స్ 2025 కర్టెన్ రైజర్ ఈవెంట్ కూడా సక్సెస్ ఫుల్‌గా చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. నిర్మాత ఏడిద రాజా మాట్లాడుతూ ఆయన సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం

## సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్ 2025



ఓటిటి అవార్డ్స్ 2025 ఈవెంట్ ఎంతబాగా చేయబోతున్నాడు అనేది నాకూ చూడాలని ఉంది. సురేష్‌కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అన్నారు. నిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ సురేష్ కొండేటి 24 ఏళ్లుగా దిగ్విజయంగా సంతోషం అవార్డ్స్ ఫంక్షన్ చేస్తుండటం మామూలు విషయం కాదు. ఆయనకు సినిమా పరిశ్రమలో ఒక ఇబ్బంది వచ్చినప్పుడు మీడియా మిత్రులు మరింతగా అతనికి అండగా నిలబడాల్సింది. నేను ఆ టైమ్ లో సురేష్ కు ఏదో ఒకటి చేయాలని ఎఫ్ఎన్ సీసీ కల్చరల్ కమిటీ అడిషనల్ ఛైర్మన్ గా నియమించాను. కానీ ఏ రోజు సురేష్ బాధపడటం నేను చూడలేదు. నవ్వుతూనే ఉన్నాడు. ఈ 24వ అవార్డ్స్ ఈవెంట్ కూడా సక్సెస్ ఫుల్‌గా చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. సీనియర్ నటులు మురళీ మోహన్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా అవార్డ్స్ ఈవెంట్ చేస్తున్న ఏకైక మేగజైన్ సంతోషం. తెలంగాణలో పదేళ్ల తర్వాత గద్దర్ అవార్డ్స్ ఇచ్చారు. ఎపిలో త్వరలో ఫిలిం అవార్డ్స్ ఇవ్వబోతున్నారు. ఈసారి ఈవెంట్‌కు స్పాన్సర్స్‌ను ఇస్తున్న మా విజయ్ కుమార్ గారికి మిగతా వారందరికీ థ్యాంక్స్. ఈ సారి ఈవెంట్ ఘనంగా చేయడానికి సపోర్ట్ చేస్తాం. అన్నారు. సంతోషం మేగజైన్ అధినేత సురేష్ కొండేటి మాట్లాడుతూ 35 యేళ్లుగా నేను జర్నలిస్ట్‌గా ఉన్నాను. నాకు చిరంజీవి గారు, నాగార్జున గారు రెండు కళ్లలాంటి వారు. అవార్డ్స్ ఫంక్షన్ అంటే ముళ్ల కిరీటం లాంటిది. నేను ఇబ్బందుల్లో ఉన్న టైమ్‌లో కేఎస్ రామారావు గారు పిలిచి ఎఫ్ఎన్ సిసి అడిషనల్ కల్చరల్ కమిటీ ఛైర్మన్‌గా నన్ను నియమించి ప్రోచహించారు. ఆ మధ్య తిరుపతి దర్శనానికి వెళ్లినప్పుడు అనిల్ గారు వారి పాట్నర్‌తో కలిసి నెక్స్ట్ ఈవెంట్ కోసం పది లక్షల రూపాయల అక్కౌంట్‌లో వేశారు. నా స్పాన్సర్స్ అందిరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. మీ అందరి సపోర్ట్‌తో ఈసారి ఈవెంట్ కూడా ఘనంగా చేయబోతున్నాం" అన్నారు.

## 'కూలీ' పవర్ ప్యాక్డ్ ట్రైలర్ రిలీజ్



**సూపర్ స్టార్** రజనీకాంత్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'కూలీ'కి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌తో తన విజయాలని కొనసాగిస్తున్నారు. ప్రతిష్ఠాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన కూలీలో రీసెంట్ కుబేరతో బ్లాక్ బస్టర్ అందుకున్న కింగ్ నాగార్జున పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు, సాంగ్స్ సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. చికిటు, మోనికా సాంగ్, పవర్ హౌస్ పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ఎంతగానో ఎదురుచూస్తున్న కూలీ ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఒకడు పుట్టగానే వాడు 'ఎవడి చేతిలో చావాలో తలమీద రాసిపెట్టి ఉంటుంది' అనే నాగార్జున పవర్ ఫుల్ డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ పవర్ ప్యాక్డ్ మూమెంట్స్‌తో గూస్ బంప్స్ తెప్పించింది. 'అడుగు పెడితే విజలు మోగల్లే' అనే పవర్ ఫుల్ బిజిఎంతో దేవా పాత్రలో రజనీకాంత్ ఎంట్రీ అదిరిపోయింది. రజనీకాంత్ స్వాగ్ ఆడియన్స్ మెస్మరైజ్ చేసింది. డైలాగులు, యాక్షన్ సీక్వెన్స్‌లు అదిరిపోయాయి. నాగార్జున లుక్ ఆడియన్స్‌ని చాలా సర్ ప్రైజ్ చేసింది, నెవర్ బిఫోర్ అవతార్‌లో కనిపించారు నాగార్జున. ఆయన క్యారెక్టర్ సినిమాలో ఎంత పవర్ ఫుల్‌గా వుంటుందో ట్రైలర్ తెలియజేసింది. సూపర్ స్టార్ అమీర్‌ఖాన్, సూపర్ స్టార్ ఉపేంద్ర ఎంట్రీలు అదిరిపోయాయి. సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్ పాత్రలు చాలా ఆసక్తికరంగా వున్నాయి. డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కూలీ కోసం చేసిన వరల్డ్ బిల్డింగ్ అద్భుతంగా వుంది. ఆయన టేకింగ్ నెక్స్ట్ లెవెల్ ఎక్స్పీరియన్స్ ఇచ్చింది. అనిరుధ్ బ్యాగ్రౌండ్ నెక్స్ట్ లెవల్‌లో చేశారు. గూస్ బంప్స్ బీజీఎం ఇచ్చారు. గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రఫీ ఎక్స్ ట్రార్డినరీ వుంది. విజువల్స్ చాలా గ్రాండియర్‌గా వున్నాయి. కళానిధి మారన్ సన్ పిక్చర్స్ ప్రొడక్షన్ వ్యాల్యూస్ ఇంటర్నేషనల్ స్టాండర్డ్‌లో ఉన్నాయి. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ నెక్స్ట్ లెవల్‌లో వుంది. ట్రైలర్ చాలా పవర్ ప్యాక్డ్‌గా వుంది. మొత్తానికి ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలని డబుల్ చేసింది. డి. సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూ షన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్ మెంట్స్ గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది.

## 'కింగ్‌డమ్' సినిమాకి వచ్చినంత పేరు నాకు ఎప్పుడూ రాలేదు : ప్రముఖ నటుడు సత్యదేవ్



**విజయ్ దేవరకొండ** కథానాయకుడిగా నటించిన చిత్రం కింగ్‌డమ్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన 'కింగ్‌డమ్' చిత్రం.. ప్రేక్షకులను మెప్పు పొందుతూ భారీ వసూళ్లను రాబడుతోంది. కింగ్‌డమ్ చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో.. తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన సత్యదేవ్, పలు ఆసక్తికర విషయాలను పంచు కున్నారు.

**కింగ్‌డమ్ లాంటి భారీ సినిమాలో శివ అనే పవర్ ఫుల్ రోల్ చేశారు.. స్పందన ఎలా ఉంది?** ఇప్పటిదాకా ఈ సినిమాకి వచ్చినన్ని ఫోన్ కాల్స్ నాకు ఎప్పుడూ రాలేదు. మొదటి షో నుంచి అందరూ ఫోన్లు చేసి అభినంది స్తూనే ఉన్నారు. గౌతమ్ నాకు కింగ్‌డమ్ కథ చెప్పగానే ఎలాంటి లెక్కలు వేసుకోకుండా వెంటనే ఈ సినిమా చేస్తున్నానని చెప్పాను. అంత నచ్చింది నాకు ఈ కథ. నా నమ్మకం నిజమై, ఇప్పుడు సినిమాకి ఇంతటి ఆదరణ లభిస్తుండటం సంతోషంగా ఉంది. బ్లఫ్ మాస్టర్ సినిమాకి నాకు పేరొచ్చింది కానీ, అది జనాల్లోకి వెళ్ళడానికి సమయం తీసుకుంది. భారీతనం, విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ వంటి అంశాలు తోడై.. 'కింగ్‌డమ్' సినిమా తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి చేరువైంది. **శివ పాత్ర మీ దగ్గరకు ఎలా వచ్చింది?** శివ పాత్ర కోసం మొదట గౌతమ్ నా పేరే రాసుకున్నారట. కానీ, ఏవో కారణాల వల్ల నన్ను సంప్రదించలేదు. మధ్యలో వేరే నటులతో కూడా చేద్దామనుకున్నారు. సరిగ్గా షూటింగ్‌కి వెళ్లడానికి కొద్దిరోజుల ముందు గౌతమ్ నన్ను కలిసి ఈ కథ చెప్పారు. కథ నాకు విపరీతంగా నచ్చి, వెంటనే సినిమా చేస్తున్నాని చెప్పాను. అప్పుడు గౌతమ్ శివ పాత్ర కోసం నేను మొదట ఎవరి పేరు రాసుకున్నానో.. వాళ్లతోనే చేస్తుండటం సంతోషంగా ఉంది. అని చెప్పారు. 'మనం తినే ప్రతి మెతుకు మీద మన పేరు రాసి ఉంటుంది' అంటారు కదా.. అలాగే ఏ పాత్ర ఎవరు చేయాలనేది కూడా రాసి పెట్టి ఉంటుందేమో అనిపించింది. **ఈ సినిమాలో మీ యాక్షన్ సీన్స్‌కి అద్భుతమైన స్పందన రావడం ఎలా అనిపించింది?** ఎప్పుడైనా యాక్షన్ సీన్ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన ఎమోషన్ ఉండాలని నేను నమ్ముతాము. ఇందులో అలాంటి ఎమోషన్ ఉంది కాబట్టే.. నా యాక్షన్ సీన్స్ కి అంత మంచి స్పందన వస్తోంది. **ఈ చిత్రంలో మీకు ఛాలెంజింగ్ గా అనిపించిన సీన్ ఏంటి?** విజయ్ నా తమ్ముడు అని తెలిసిన తర్వాత జైల్లో మా ఇద్దరి మధ్య సంభాషణ జరుగుతుంది. తమ్ముడంటే మనసులో ఎంతో ప్రేమ ఉన్నా. పైకి మాత్రం అది పూర్తిగా చూపించకూడదు. ఎందుకంటే తమ్ముడు 'నాతో ఉండిపోతాన్న' అంటాడనే భయం నాలో ఉంటుంది. అసలు గౌతమ్ నా పాత్రను రాసిన తీరే అద్భుతంగా ఉంది. ఓ వైపు తమ్ముడు, మరోవైపు దివి ప్రజలు, ఇంకో వైపు ఒక నిజం తెలుసు కానీ ఎవరికీ చెప్పలేదు. ఇలా ఆ పాత్ర చుట్టూ ఎంతో ఎమోషన్ ఉంది. అందుకే డ్రామా అంతలా పండింది. సినిమాలో ఫిజికల్‌గా ఛాలెంజింగ్ అనిపించిన సీన్ మాత్రం ప్రీ క్లయిమాక్స్ ఎపిసోడ్. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్ చూశాక.. ఆ కష్టమంతా మరిచిపోయాను. **విజయ్ దేవరకొండ గురించి?** విజయ్‌తో నాకు అంతకముందు పరిచయం లేదు. కలిసిన తర్వాత తెలిసింది విజయ్ చాలా మంచి వ్యక్తి అని. తక్కువ సమయంలోనే మా ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. విజయ్‌ని నేను నిజంగానే ఒక బ్రదర్ లా ఫీల్ అయ్యాను. విజయ్ అంత మంచి వ్యక్తి కావడం, నాతో అంత మంచిగా ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. అలాగే, విజయ్ గొప్ప నటుడు. సన్నివేశాన్ని కానీ, సంభాషణలను కానీ అతను అర్థం చేసుకొని నటించే తీరు నన్ను ఆశ్చర్యపరిచింది. **నిర్మాత నాగవంశీ గురించి?** నాగవంశీ గట్స్ ఉన్న ప్రొడ్యూసర్. ఒక కథను నమ్మి సినిమా చేద్దాం అనుకున్నారంటే.. ఎక్కడా వెనకడుగు వేయరు, ఏ విషయంలోనూ రాజీపడరు. పరిశ్రమలో వంశీ తనకంటూ ప్రత్యేక పంథాను సృష్టించుకున్నారు కాబట్టే.. సితార ఎంటర్టైన్మెంట్స్ ఇంత పెద్ద నిర్మాణ సంస్థగా ఎదిగింది. **ఈ సినిమాకి మీకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏంటి?** ఒక్కరిని కాదు. చాలామంది ప్రశంసించారు. ముఖ్యంగా పలువురు సినీ ప్రముఖులు ఫోన్లు చేసి నన్ను అభినందించడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. **తదుపరి ప్రాజెక్ట్‌లు?** అరేబియన్ కడలి అనే సిరీస్ చేశాను. అమెజాన్ ప్రైమ్‌లో ఆగస్టు 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 'ఫుల్ బాటిల్' అనే సినిమా కూడా విడుదలకు సిద్ధమవుతోంది. వెంకటేష్ మహా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. ఆరంభం ఫేమ్ అజయ్ నాగ్ తోనూ ఓ చిత్రం చేస్తున్నాను. వీటితో పాటు మరో రెండు సినిమాలు ఉన్నాయి.

## సిఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు 'డేంజర్'అంటూ డ్రగ్స్‌పై హీరో కృష్ణసాయి పోరాటం



**విద్యార్థులు** గంజాయి కోరల్లో చిక్కుతున్నారు. పుస్తకాలు ఉండాల్సిన వారి బ్యాగుల్లో మాదక ద్రవ్యాలు దర్శనమిస్తున్నాయి. డిగ్రీలు పూర్తి చేయక ముందే డ్రగ్స్‌కి బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. ఉద్యోగాలు చేయాల్సిన వయసులో మత్తు అనే ఊబిలో కూరుకు పోతున్నారు. ఇదేంటని అడిగిన తల్లిదండ్రులపై దాడులు చేసే పశు ప్రవర్తనలకు దిగజారి పోతున్నారు. అదే మత్తులో హత్యలు, అత్యాచారాల వంటి ఆరాచకాలు ఎన్నో. అలాంటి డ్రగ్స్‌ను అరికట్టేందుకు తనవంతు బాధ్యతగా హీరో కృష్ణసాయి ప్రచార చిత్రాలను తీస్తున్నారు. డ్రగ్స్ పై యువతకు అవగాహన కల్పించాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందించిన హీరో కృష్ణసాయి పలు ప్రచార చిత్రాలను రూపొందిస్తున్నారు. కృష్ణ సాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్మాణంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు?' అనే సందేశంతో రూపొందించిన ప్రచార వీడియోకు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా తెలుగు ఫిలిం ఛాంబర్ ఆవరణలో హీరో కృష్ణసాయి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గారి పిలుపు మేరకు, మా బాధ్యతగా డ్రగ్స్ పై ఓ చైతన్యపూరిత గీతాన్ని రూపొందించాం. ప్రతి సినిమాకి ముందు 'స్మోకింగ్ డేంజర్' అని హెచ్చరికలు చేసే మెసేజ్ వలన యువతలో అవగాహన కలిగడంతో సిగరెట్, తంబాకు, గుట్కా వినియోగం బాగా తగ్గిపోయింది, సినిమా మాధ్యమం వల్ల ప్రజలు ప్రభావితం అవుతారు. అందుకే ఇప్పుడు డ్రగ్స్ పై అవగాహన పెంచేందుకు మేం రూపొందించిన పాటను 'డేంజర్' అనే సినిమాలోనిది. ఈ సినిమా యువతను మార్పు దిశగా నడిపిస్తుందని నమ్మకం ఉంది," అని అన్నారు. ఇటీవల డ్రగ్స్ పై పాట రూపొందించిన హీరో కృష్ణసాయి అందులో నటించారు. ఈ ప్రచార చిత్రానికి ప్రముఖుల నుంచి ప్రశంసలు వచ్చాయి. అప్పటి గవర్నర్లు తమిళసై, దత్తాత్రేయ, కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ డీజీపీ జితేందర్, హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఇతర ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు ఈ డ్రగ్స్ పాటను వీక్షించి హీరో కృష్ణసాయిని అభినందించారు.

## సెప్టెంబర్ 12న రానున్న 'లిటిల్ హార్ట్స్'



"90 మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ మౌళి తనుజ్, "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ "లిటిల్ హార్ట్స్". ఈ చిత్రాన్ని ఇటివి విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. "90 మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ "లిటిల్ హార్ట్స్" మూవీకి నిర్మాతగా వ్యవహరించారు.


ఈ రోజు ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. 'లిటిల్ హార్ట్స్' చిత్రాన్ని సెప్టెంబర్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా విడుదల చేసిన ప్రోమోలో తండ్రీ కొడుకులుగా మౌళి తనూజ్, రాజీవ్ కనకాల నటించిన సరదా సన్నివేశం ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ ఎమోషన్స్, ఎంటర్ టైన్ మెంట్‌తో రూపొందించిన ఈ సినిమా కంటెంట్ నచ్చి ప్రముఖ నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి 'లిటిల్ హార్ట్స్' చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. నటీనటులు మౌళి తనూజ్, శివానీ నాగరం, రాజీవ్ కనకాల, ఎస్ ఎస్ కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్, తదితరులు. టెక్నికల్ టీమ్: రచన, దర్శకత్వం సాయి మార్తండ్, ప్రొడ్యూసర్: ఆదిత్యహాసన్ పిఆర్ఓ జీఎస్‌కె మీడియా (సురేష్ శ్రీనివాస్), మ్యూజిక్: సింజిత్ యెర్రమల్లి, సినిమాటోగ్రఫీ: సూర్య బాలాజీ, ఎడిటర్ : శ్రీధర్ సొంపల్లి, ఆర్ట్ డైరెక్టర్: దివ్యపవన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: వినోద్ నాగుల, మురళి పున్న.

## 'సు ఫ్రమ్ సో' ఆగస్ట్ 8న విడుదల



**కన్నడలో లేటెస్ట్** సెన్సేషనల్ హిట్ 'సు ఫ్రమ్ సో' ఇప్పుడు తెలుగులో సందడి చేయడానికి సిద్ధంగా ఉంది. ఇది తెలుగు ప్రేక్షకులకు పర్ఫెక్ట్ ఎంటర్‌టైనర్ కావడంతో మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను ఆగస్ట్ 8న గ్రాండ్‌గా రిలీజ్ చేయనుంది. ఈ హిలేరియస్ కామెడీ ఎంటర్‌టైనర్ కు జెపి తుమినాడ్ దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో షనీల్ గౌతమ్, జెపి తుమినాడ్, సంధ్య అరకెరె, ప్రకాష్ కె తుమినాడు, దీపక్ రాయ్ పనాజే, మైమ్ రాందాస్ అద్భుతమైన నటనతో అలరించారు. శశిధర్ శెట్టి బరోడా, రవి రాయ్ కలసా, రాజ్ బి శెట్టి నిర్మించిన ఈ చిత్రం కన్నడలో క్రిటిక్స్ అప్రిసియేషన్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద మంచి ఘన విజయం సాధించింది. ఎస్. చంద్రశేఖరన్ సినిమాటోగ్రఫీ, సుమేధ్ కె సాంగ్స్, సందీప్ తులసీదాస్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాయి. ఈ బ్లాక్ బస్టర్ ఎంటర్‌టైనర్‌ని రెండు తెలుగు రాష్ట్రాలలో మైత్రీ మూవీ మేకర్స్ గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నారు. పర్ఫెక్ట్ హ్యూమర్, రిఫ్రెషింగ్ నరేషన్, ఆసక్తికరమైన పాత్రలు కలగలిపిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు నవ్వుల పండుగ అందించబోతోంది.

## లక్ కలిసి రాని సిద్ధిక



**2019లో సిద్ధిక** 'ప్రేమ పరిచయ్యం' అనే తెలుగు చిత్రంలో నటించింది. 2012 నుంచి చిత్రసీమలో కెరీర్ పోరాటం సాగిస్తోంది సిద్ధికా శర్మ. ఈ పంజాబీ బ్యూటీ అందచందాలు, ప్రతిభకు యువతరంలో ఫాలోయింగ్ ఏర్పడింది. అయినా లక్ కలిసి రాక, ఆశించిన హిట్లు దక్కక కెరీర్ పరంగా రేసులో వెనకబడింది. 2012లో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ ఆల్ ది బెస్ట్, గల్లీ కుర్రోళ్ల చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ తెరకెక్కించిన పైసాలో నటించింది. ఈ చిత్రంలో నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించారు. 'పైసా' ఫ్లాప్ షోగా మిగలడం సిద్ధిక టాలీవుడ్ బిగ్ డ్రీమ్స్‌కి గండి కొట్టింది. ప్రతిభావంతుడైన కథానాయకుడు, పెద్ద దర్శకుడు కూడా సిద్ధిక ఫేట్‌ని మార్చ లేకపోయారు. జయా పజయాలతో సంబంధం లేకుండా తెలుగు చిత్రసీమ అవకాశాలు కల్పించింది. మాతృపరిశ్రమ పంజాబీలో ఓయ్ మక్నా అనే చిత్రంలోను సిద్ధిక ఆడిపాడింది. కానీ ఆ తర్వాత అక్కడ నటించలేదు. 2024లో ఆపరేషన్ లైలా అనే చిత్రంతో తమిళంలో కూడా అడుగుపెట్టింది. కానీ అక్కడా పాప్పులుడకలేదు. హిట్టు మాత్రమే కోరుకునే పరిశ్రమలో ఒడిదుడుకుల ప్రయాణానికి సిద్ధిక అలవాటు పడిపోయింది. సిద్ధిక కూడా చాలా పోరాటాల తర్వాత బాలీవుడ్ లోను ప్రయత్నాలు ప్రారంభించింది.



నేహా మాలిక్

# ఆర్థిక ప్రణాళికతో అందలం

**మన జీవితంలో చాలా అంశాలు డబ్బుతోనే ముడిపడి ఉంటాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ చిన్న వయసు నుంచే ఆర్థిక క్రమశిక్షణను అలవరచుకుంటే చాలా సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చంటున్నారు నిపుణులు. ముఖ్యంగా 20ల్లోనే కెరీర్ ప్రారంభించే వారు ముందు నుంచే ఆర్థిక విషయాల్లో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అవేంటో తెలుసుకుందాం..**




బడ్జెట్ ఆర్థిక క్రమశిక్షణలో మొదటి, ముఖ్యమైన అంశం బడ్జెట్ ప్రణాళిక వేసుకోవడం! ఈ విధంగా మీ ఆదాయ వ్యయాలను దృష్టిలో పెట్టుకోవాలి. అధిక ఖర్చులకు కళ్లెం వేసుకోవాలి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కొంత డబ్బును పొదుపు చేసుకోవడం, లాభాలొచ్చే పథకాల్లో పెట్టుబడులు పెట్టడం.. వంటివీ ముఖ్యమే! ఇలా మీరు వేసుకున్న ప్రణాళికకు కట్టుబడి ఉండటం తప్పనిసరి! ఇక ఈ విషయాల్లో అవగాహన కోసం, సందేహాల నివృత్తి కోసం నిపుణులను సంప్రదించొచ్చు.. లేదంటే విశ్వసనీయమైన మొబైల్ యాప్స్‌ని ఆశ్రయించచ్చు.

**సిబిల్ స్కోర్ బాగుంటేనే.. ........**

కొన్ని లక్ష్యాలను సాధించడానికి అధిక మొత్తంలో డబ్బు అవసరమవుతుంది. అలాంటి సందర్భాలలో బ్యాంకులను ఆశ్రయించాల్సిన అవసరం రావచ్చు. అలాంటప్పుడు బ్యాంకులు సిబిల్ స్కోర్‌ను తనిఖీ చేస్తాయి. ఈ స్కోర్ మీ ఆర్థిక క్రమశిక్షణను నిర్ణయిస్తుంది. కాబట్టి ఇరవైల్లో ఉన్నప్పటి నుంచే మీ సిబిల్ స్కోర్ పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. క్రెడిట్ కార్డుకి సంబంధించిన లావాదేవీలను కొంత అదుపులో పెట్టుకోవాలి. ఆ బిల్లులను కూడా గడువు లోపు చెల్లించాలి. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో ఇల్లు కొనుక్కోవడం, సొంతంగా బిజినెస్ పెట్టుకోవడం వంటి లక్ష్యాల కోసం కావాల్సిన డబ్బును బ్యాంక్ లోన్ల ద్వారా సులభంగా పొందవచ్చు. రెండో ఆదాయం కూడా!. ఖిఎప్పుడూ ఒకేపై ఆధారపడద్దు. పెట్టుబడులతో ఇతర ఆదాయ మార్గాలను అన్వేషించాలిఖి ప్రముఖ వ్యాపారవేత్త వారెన్ బఫెట్ చెప్పిన మాట ఇది! ఈ పద్ధతిని ఇరవైల్లో ఉన్నప్పట్నుంచే పాటిస్తే భవిష్యత్తులో ఆర్థికంగా దృఢంగా మారచ్చు. చాలామంది కష్టపడి ఉద్యోగం తెచ్చుకున్న తర్వాత కేవలం ఆ సంపాదన పైనే ఆధారపడుతుంటారు. ఈ మిగిలిన సమయాన్ని వృథా చేస్తారు. అయితే దీనికి బదులుగా నిపుణుల సలహాతో సరైన పెట్టుబడుల ద్వారా రెండో ఆదాయ మార్గాన్ని సృష్టించుకోవడం ద్వారా స్థిరత్వాన్ని సంపాదించుకోవచ్చు.

**అత్యవసర నిధి !** అత్యవసర పరిస్థితుల్లో అప్పులు చేయకుండా అత్యవసర నిధి కాపాడుతుంది. నెలా మీ వేతనంలో కొంత కేటాయించాలి. ఆ డబ్బుని ఎప్పుడు పడితే అప్పుడా తీయడానికి వీలు లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేసుకోవాలి. ఇలా చిన్న వయసులో ఇలాంటి పద్ధతిని పాటించడం వల్ల.. భవిష్యత్తులో ఆర్థిక అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు సులభంగా బయటపడగలుగుతారు.

**లాభాలొచ్చేలా...** వృథా ఖర్చులు చేయదన్నారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదంటున్నారు నిపుణులు. నెల ఖర్చులు పోగా మిగిలిన డబ్బును ఆర్థిక నిపుణుల సలహాతో మ్యూచు వల్ ఫండ్స్ వంటి పెట్టుబడులు పెట్టడం వల్ల లాభాల్ని ఆర్జించచ్చంటున్నారు. ▢



# ఆవిష్కరణలు-ఆత్మ విశ్వాసం !

**పిల్లలకు పాఠాలు సరిగ్గా బోధించేలా చూస్తే చాలు అనుకోలేదామె. వాళ్లలోని నైపుణ్యాలకు సానబెట్టాలనుకున్నారు. చదివింది నిత్య జీవితంలో ఉపయోగించుకునేలా చూశారు. కాబట్టి, ఆ విద్యార్థులు చదువుల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచి ఇలా మెరికలను తయారు చేసిన ఆ టీచరమ్మే యలమంచిలి దుర్గాభవాని తన కృషితో షైనింగ్ టీచర్ ప్రభుత్వ గుర్తింపు సాధించారు.**



మంచి చేయాలన్న సంకల్పం ఉంటే ఏది అసాధ్యం కాదని నమ్ముతారు దుర్గా భవాని, అయిదేళ్ల పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. ఇప్పుడు ప్రైవేటు స్కూళ్లలోనే ఉత్తమ విద్య దొరుకుతుందన్న నమ్మకం అందరిదీ. ఆ అభిప్రాయాన్ని మార్చడానికి తల్లిదండ్రులు, విద్యార్థులకు నిరంతరం కౌన్సెలింగ్ నిర్వహించే వారమే. అలా వారి నమ్మకాన్ని సాధించారు. కేవలం పాఠాలకే పరిమితం కాలేదు. ఆటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే పరిష్కారాలు కనుక్కునేలా ప్రోత్సహించారు. ఫలితమే తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రం, పాఠశాలలో చెత్తను శుభ్రం చేయడానికి పాత వస్తువుల నుండి బ్లోయర్, ఆల్కహాల్ సెన్సింగ్ హెల్మెట్... ఇలా ఎన్నో ఆవిష్కరణలు ఇక్కడ రూపొందించబడ్డాయి. దీనికోసం రోజూ సాయంత్రం రెండు గంటల సమయాన్ని కేటాయించారు. విద్యార్థులకు సాయం చేయడానికి స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు దుర్గా భవాని, కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్, డ్యాన్స్, మ్యూజిక్ తరగతులు, కంప్యూటర్ శిక్షణ వంటి వాటిని అందించారు. దుస్తులు కుట్టడంలోనూ శిక్షణివ్వడంతో విద్యార్థులే వాళ్ల యూనిఫామ్‌లు కుట్టుకుంటున్నారు. విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పేరెంట్-టీచర్ మీటింగ్ సమయంలో అమ్మకానికి ఉంచే వారు. వాటిని మెచ్చి తల్లిదండ్రులలే కొనడానికి ఆసక్తి చూపించే వారు. సదుపాయాల కొరతకు దాతల సాయం కోరారు. అలా ఆ కొరతనీ తీర్చారు. ఇవన్నీ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచాయి ఫలితమే... ఈ ఏడాది పదో తరగతిలో 54 మంది విద్యార్థులు.. 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు పొందారు. రాష్ట్రంలోనే తొలిసారిగా తమ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేనీ నిర్వహించడం. 'పేదవాళ్లే ప్రభుత్వ పాఠశాలలకు వస్తారన్న భావన మారాలి. విద్యార్థులు నేర్చుకున్నది పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోగలగాలి. ఆచరణలో పెట్టాలి. అప్పుడే ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ విధానాన్నే అనుసరించాం. ఫలితాలూ రాబట్టగలిగాం అంటారు దుర్గాభవాని, తాజాగా ఈమెని పమిడిముక్కలకి బదిలీ చేశారు. అయినా ఈమె చర్యలు విద్యార్థుల్లో ప్రభుత్వ విద్యాలయాలపై నమ్మకాన్ని పెంచుతాయి. ఈ పాఠశాలలోనే ఇంటర్ చదివే అవకాశం ఉండటంతో 96 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. దుర్గాభవాని సేవలు, తన సాధించిన ఫలితాలను గుర్తించిన అందరూ అభినందించారు. 'షైనింగ్ టీచర్' అంటూ సన్మానించారు. ▢



## ఇలా చేయరాదు

తగ్గాలని రాత్రిపూట భోజనానికి బదులు ఆయిల్ లేని చపాతీలు, రోటీలు తింటుంటారు. అయితే అవి మెత్తగా రావాలని పెనంమీద కాసేపు వేడి చేసి తరవాత నేరుగా స్టవ్ మంటపై కాలుస్తుంటారు. దీని గురించి తాజా పరిశోధన ఏమంటోందంటే. ఇలా నేరుగా పెద్ద మంటపై కాలచ్చడంవల్ల రోటీలోని కర్బన పదార్థాలు విచ్ఛిన్నమై కొద్దిస్థాయిలో హానికర అమైన్లూ హైడ్రోకార్బన్లూ ఉత్పత్తవుతాయి. వీటివల్ల శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది అంటున్నాయి. తాజా పరిశోధనలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ విషయమై హెచ్చరిక చేస్తోంది. మీరూ ఇలా చేస్తున్నారా.. కాబట్టి జాగ్రత్త. ▢

## హాస్యాన్నే కెరియర్‌గా..

వేయి సూక్తులు విన్నా చలించని వాళ్లు ఉంటారేమో కానీ, హాస్యాన్ని ఆస్వాదించని వారుండరంటే **అతిశయోక్తి కాదు!** అందుకే 'నవ్వని రోజు వృథా అయినట్టే'అని చార్లీ చాప్లిన్ అంటే, జీవితమంటే అలా బతికేయడమే కాదు, అందులో కొంత హాస్యం కూడా ఉండాలంటారు అమెరికా రచయిత్రి మయా ఏంజెలో అమ్మాయంటే ఇలానే నవ్వాలి. అనే రోజుల నుంచి హాస్యాన్నే తమ కెరియర్‌గా మలుచుకుంటోన్న అమ్మాయంటే ఇలానే నవ్వాలి. అనే రోజుల నుంచి హాస్యాన్నే తమ కెరియర్‌గా మలుచుకుంటోన్న అమ్మాయిలూ పెరిగారు. ఫటాఫట్ పంచులు వేసినా, స్టాండప్ కామెడీ చేసినా.. వారి అంతిమ లక్ష్యం ఎదుటివారి ముఖంలో నవ్వులు పూయించడమే.



సాధారణంగా మనమెవరైనా తప్పులు చేశామనుకోండి అందులో ఫన్‌కి పెద్దగా ఆస్కారం ఉండదు. కానీ యూట్యూబర్లు, నటీనటులు, న్యూస్ రీడర్లు..లాంటి వాళ్ల వీడియో రికార్డింగ్ చేసేటప్పుడు దొర్లే తప్పులు అవేనండీ బ్లూపర్స్.. అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. సైకాజికల్‌గా చెప్పాలంటే.. ఇలా సరదా తప్పులకు నవ్వే పద్ధతిని బినైన్‌వయొలేషన్ థియరీ అంటారు. నిజానికి వాళ్లు చేసే ఆ కార్యక్రమాన్ని ఎంతమంది చూస్తారో తెలియదు కానీ, ఆ బ్లూపర్ వీడియోలు మాత్రం తెగ వైరల్ అవుతుంటాయి. మిలియన్ల కొద్దీ వీక్షణలు సొంతం చేసుకుంటుంటాయి. ఉదాహరణకు ఓ న్యూస్ రీడర్ సీరియస్‌గా వార్తలు చదువుతున్నప్పుడు మధ్యలోవాళ్ల బాబు లేదా పాప వచ్చి డిస్టర్బ్ చేస్తే ఏమవుతుందో ఒకసారి ఊహించుకోండి. లైవ్ ఆగిపోయిందనుకుని యాంకర్ మరేదో విషయం మాట్లాడుతుంటే నవ్వులే నవ్వులు. ▢

## ఆ నాలుగు ..



**కూర గాయలు కోసుకోవడానికి** చాకూ, చాపింగ్ బోర్డు అందరి ఇళ్లలోనూ ఉంటాయి. సాధారణంగా పండ్లూ, కూరగాయలు, మాంసాహారం అన్నింటికీ దాన్నే ఉపయోగించేస్తుంటారు చాలామంది. అలాంటప్పుడు పండ్ల ముక్కలు నీచు వాసన వచ్చాయనుకోండి. అసలు నోట్లోనే పెట్టుకోలేం కదా. అలాంటి ఇబ్బందులేమీ లేకుండా ఉండాలంటే హాయిగా ఈ సెట్టును వాడుకోవచ్చు. చికెన్, మాంసం, కూరగాయలూ, పండ్లూ.. ఇలా వేటిక గా ప్రత్యేకంగా కొసుకు నేలా వీటిని తయారు చేశారు. నాలుగు వేర్వేరు రంగుల్లో ఉంటాయి. కాబట్టి.. ఏ పనికి వాడాల్సిన దాన్ని దానికే వాడొచ్చు. పైగా దీనికి ఉండే కరెంటు కనెక్షన్‌తో అరగంటలో ఆరబెట్టుకోవచ్చు కూడా. ▢

# తియ్యటి రాఖీలు





అన్నయ్య మీద మాటలకందని మమకారం.
చిట్టి తమ్ముడి మీద చెప్పలేనంత అనురాగం.
ఆ ప్రేమకి సాక్ష్యమే రక్షాబంధనం. రాఖీలు తియ్యటి పండ్లు, మిఠాయిల రూపం దాలిస్తే ఇక చెప్పాల్సిందేముంది.
మాధుర్యానికి మచ్చుతునకలు. నచ్చితే మీరూ ఇలాంటివి ప్రయత్నించండి.















## డైట్‌లో ఇవి తప్పకుండా ..

**అధిక బరువుతో బాధపడుతున్న మహిళలు, యువతుల డైట్‌లో ఓట్స్ తప్పకుండా ఉండాల్సిందే.. కాలక్రమేణా ఈ జాబితాలోకి వచ్చి చేరింది. చిరుతిండిగానూ దీన్ని తింటున్నారు. అయితే బరువు తగ్గాలంటే ఈ రెండింటిలో ఏదీ తింటే మంచిది అంటే..**

ప్రొటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్లు వంటి పోషకాలను అందించడంలో ఓట్స్, మ్యూజ్లీ రెండే దేనికవే సాటి కానీ బరువుతగ్గాలనుకునేవాళ్లు మాత్రం ఓట్స్‌ను అల్పాహారంలో తీసుకుంటే ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. తృణ ధాన్యాల్లో గ్లూటెన్ లేనివి ఓట్స్ మాత్రమే. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు దీనిలో పుష్కలంగా ఉన్నాయి. మ్యూజ్లీలో పాల, పండ్లు , డ్రైఫ్రూట్స్, గింజలు అధికంగా ఉంటాయి. అందువల్ల దీనిలో కెలోరీలు ఎక్కువ. ఓట్ మీల్క్ ఎక్కువసేపు కడుపు ను నిండుగా ఉంచుతుంది. అల్పా హారంలో దీన్ని తినడం వల్ల ఆకలినీ నియంత్రిస్తుంది. దీనిలో ఉండే



ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. మ్యూజ్లీ జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. రోజూ ఒకే రకమైన అల్పాహారం తిని విసుగనిపించే వాళ్లు మిల్క్, వెజిటబుల్ ఓట్స్ మాత్రమే కాకుండా ఇడ్లీ, దోవ, వడ లాంటివీ దీంతో చేసుకుని తినొచ్చు. మ్యూజ్లీతో అది సాధ్యం కాదు. పైగా చాలామంది దీన్ని చక్కెరతో కలిపి తినడానికి ఇష్టపడతారు. ఓట్స్ రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. గుండె సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి బరువు తగ్గాలంటే రెండింటిలో ఓట్స్ బెటరన్నమాట. ▢

## సరదాగా చదివిద్దాం!

**ప్రతి తల్లిదండ్రులు** తమ పిల్లలతో పోటీపడాలని ఆరాటపడుతుంటారు. పరీక్షల్లో మంచి మార్కులు, ర్యాంకులు వస్తే బాగుంటుందని వారిపై ఒత్తిడి తెస్తారు. ఎవరిని టీవీలు చూడొద్దు. ఫోన్కి దూరంగా ఉండు అంటూ చాలానే శరతులు పెడుతుంటారు కదా! నిజానికి పిల్లల్ని ఎంత ఎక్కువ ఒత్తిడి చేస్తే అంత చదువుకి దూరంగా ఉంటారు. చదవమని బలవంతం చేయడం కంటే సరదాగా చదివేలా ప్రోత్సహించండి. అలాకాకుండా ఖినీ ఫ్రెండ్‌కి మార్కులు ఎక్కువ వచ్చాయి. నువ్వు ఇంకా బాగా చదవాలిఖి అన్న ప్రతిసారి అది వారికి టాస్క్ లా అనిపిస్తుంది. అందుకే ఎప్పుడూ వారితో పాఠ్య పుస్తకాలు కాకుండా అప్పుడప్పుడు కామిక్ బుక్స్న చదివించండి. ఉదాహరణకు కొంతమంది పిల్లలకి జంతువులంటే ఇష్టం. ఇంకొంతమందికి సూపర్ హీరోలు నచ్చుతారు. మరికొంతమందికి ఇంకో రకమైన ఆసక్తి ఉండొచ్చు. మీకి ఏవి ఇష్టమో వాటికి సంబంధించిన పుస్తకాలు చదివితే సరదాగా అనిపించడమే కాదు, పాఠ్యపుస్తకాలనూ ఇష్టంగా చదువుతారు. ▢



## తెలుసుకుందాం. .

**శిశువుల చర్మం** పెద్దవారితో పోలిస్తే ఐదురెట్లు ఎక్కువ పలుచగా ఉంటుందని పరిశోదనలు చెబుతున్నాయి. దీనివల్లే వారి చర్మం పొడిబారటం, ఇరిటేషన్‌తో పాటు



సుకుమారంగానూ ఉంటుందట. అందుకే, ఆ సమయంలో వారి స్కిన్‌కి తగినంత తేమను అందించాలట. ▢

## దేవుడెక్కడున్నాడు ?



**మనశ్శాంతి కోసం** మనం గుడికి వెళ్తాం. అందువల్ల ఆలయంలో ప్రవేశించగానే ఆవేశం లేకుండా అందరి పట్ల అభిమానం, ఆదరణ, వినమ్రత, సేవాభావాలతో మెలగాలి. రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాలి. కానీ నేడు మందిరంలో కూడా అలాంటి సద్భావన, ప్రశాంత వాతావరణం కనిపించటం లేదు. వేగంగా తిరిగేళ్లిపోవాలంటే తొందరపాటు, ఏవేవో విషయాల గురించిన అలజడి, ఆందోళన వంటివన్నీ మనసులో ముసురుకుంటే ఇక దేవుడెక్కడ కనిపిస్తాడు? దైవం ఎక్కడ అనే ప్రశ్నకు గీతాచార్యుడు చెప్పిన సమాధానం అర్జునా! ఈశ్వరుడు సర్వప్రాణుల హృదయాల్లో ఉంటాడు. తన మాయాశక్తితో సకల జీవులను యంత్రంలా నడిపిస్తున్నాడు. అతడు మనలో కూడా ఉన్నాడనే కదా అర్థం. ఈశ్వరుడు అనగానే సర్పభూషణుడు, చంద్రశేఖరుడు, ఫాలనేత్రుడు, గజచర్మాంబరధారి అంటూ ఆయా రూపాల్లోనే ఉంటాడని భావించాల్సిన అవసరం లేదు. దేవుడు 'సర్వంతర్యామి' అన్నది తెలుసుకోవాలి. ఇందుగలడందు లేడను సందేహం వలదని భక్తప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్యకశిపుడు వివరించినది మనకు తెలుసు కదా! కనుక సర్వేశ్వరుడు అందరిలోనూ ఉన్నాడు. మన మనసులోనూ కొలువై ఉన్నాడు. మరి దైవాన్ని సాక్షాత్కరింపచేసుకోవాలంటే. మన హృదయాలను పరిశుద్ధంగా ఉంచుకోవాలి. ▢

ఆధ్యాత్మికం

# వరల్డ్‌కప్ చెస్ ఛాంపియన్‌గా కార్ల్‌సన్

### భారత్ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఓటమి

**న్యూఢిల్లీ:** తొలిసారిగా నిర్వహించిన ఈ స్పోర్ట్స్ వరల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ గార్ల్‌సన్ ఛాంపియన్‌గా అవతరించాడు. అయితే భారత్ గ్రాండ్ మాస్టర్, తెలంగాణ స్టార్ ఇరిగేసి అర్జున్ ఓటమిపాలయ్యాడు. ఆదివారం ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజా ఫిరూజాతో జరిగిన ఫైనల్ పోరులో కార్ల్‌సన్ 3-1, 3-1తో విజయం సాధించాడు. సెట్ 1లో భాగంగా జరిగిన నాలుగు గేముల్లో కార్ల్‌సన్ రెండు గేముల్లో గెలిచి, మరో రెండింటిని డ్రా చేసుకున్నాడు. సెట్ 2లో భాగంగా జరిగిన నాలుగు గేముల్లో అతడు మూడు గేముల్లో నెగ్గి, ఒక గేమ్‌లో ఓడిపోయాడు. అమెరికాకు చెందిన హికారు నకముర మూడో స్థానం పొందగా, భారత్ గ్రాండ్ మాస్టర్, తెలంగాణ స్టార్ ఇరిగేసి అర్జున్ నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు. నకమురతో జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో అర్జున్ 2.5-3.5తో ఓటమి చెందాడు. ఐదు గేముల్లో అర్జున్ రెండింటిలో గెలిచి, ఒక గేమును డ్రా చేసుకున్నాడు. విజేతగా నిలిచిన కార్ల్‌సన్‌కు 2,50,000 డాలర్లు (భారత్ కరెన్సీలో 2.18 కోట్ల రూపాయలు) లభిస్తాయి. రెండో స్థానం పొందిన అలీరెజాకు 1,90,000 డాలర్లు (1.65 కోట్ల రూపాయలు), మూడో స్థానంలో నిలిచిన నకమురకు 1,45,000 డాలర్లు (1.26 కోట్ల రూపాయలు), నాలుగో స్థానంలో నిలిచిన ఇరిగేసి అర్జున్‌కు 1,15,000 డాలర్లు (1.33 కోట్ల రూపాయలు ప్రైజ్‌మనీగా లభిస్తాయి.



## వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్‌లో
# స్వర్ణంతో మెరిసిన మురళీ




**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్‌లో భారత్‌లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. కజికిస్తాన్‌లో ఆదివారం 2025 కోసనోవ్ మెమోరియల్ ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య ఈవెంట్ పురుషుల లాంగ్ జంప్‌లో భారతదేశానికి చెందిన మురళీ స్వర్ణం సాధించాడు. గాయం నుంచి ఇటీవలే తిరిగి వచ్చిన శంకర్, పోడియంపై అగ్రస్థానంలో నిలిచేందుకు 7.94 మీటర్ల ఉత్తమ ప్రయత్నాన్ని నమోదు చేశాడు. 26 ఏళ్ల శ్రీశంకర్ తన మొదటి ప్రయత్నంతోనే తన అత్యుత్తమ జంప్‌ను నమోదు చేశాడు. అతని తదుపరి మూడు జంప్‌లు 7.73 మీటర్లు, 7.58 మీటర్లు, 7.57 మీటర్లు అన్నింటిని అధికమించేలా పోటీ సవాలుగా మార్చింది. తన మొదటి ప్రయత్నాన్ని మెరుగుపరుచుకోవడానికి కష్టపడి, శంకర్ చివరికి 7.80 మీటర్లు మరియు 7.79 మీటర్లతో స్వర్ణం సాధించి తన ప్రచారాన్ని ముగించాడు. ఫిలిప్పీన్స్‌కు చెందిన జాన్రీ ఉబాస్ (7.53 మీటర్లు) మరియు అజర్‌బైజాన్‌కు చెందిన నజీమ్ బాబీవ్ (7.48 మీటర్లు) వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. శంకర్ ప్రస్తుతం 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ అర్హత సాధించే ప్రయత్నంలో ఉన్నాడు. పురుషుల లాంగ్ జంప్‌లో ప్రపంచ ఈవెంట్‌కు ప్రత్యక్ష అర్హత మార్కు 8.27 మీటర్లుగా ఉంది.

## వరల్డ్ రెజ్లింగ్‌లో
# లాకీకి రజతం

### గోల్డ్ పోరుకు సిటెండర్, పునియా ఓటమి

### భారత్ ఖాతాలో 8 పతకాలు

ఆట



**న్యూఢిల్లీ:** అండర్ 17, ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ రెజ్లర్ లాకీ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. దీంతో ఇప్పటివరకు, భారత్ ఖాతాలో 8 పతకాలు జమ కాగా, వీటిలో 3 స్వర్ణాలు, 4 రజతాలు మరియు ఒక కాంస్య పతకం ఉన్నాయి. ఇక బంగారు పతక పోరుకు భారత్‌కు చెందిన సిటెండర్ అర్హత సంపాదించాడు. అయితే కాంస్య పతక పోరులో భారత్‌కు చెందిన మరో రెజ్లర్ గౌరవ్ పునియా ఓటమి చెందాడు. గ్రీస్‌లోని ఏథెన్స్‌లో ఆదివారం జరిగిన జరిగిన ఈ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి చెందిన లాకీ 110 కిలోల పురుషుల ఫ్రీస్టైల్ విభాగంలో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. తటస్థ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ జెండా కింద పోటీ పడుతున్న మాగోమెద్రాసుల్ ఒమరోవ్‌తో జరిగిన ఈ పోటీలో, లాకీ బంగారు పతక పోరులో 4-6 తేడాతో ఓడిపోయాడు. అంతకుముందు, లాకీ సెమీఫైనల్లో ఇరాన్‌కు చెందిన అమిర్‌హోస్సేన్ నాగ్దలిపూర్‌ను 15-7తో ఓడించి, ఆ తర్వాత ఫైనల్స్‌లో 15-7తో ఆధిక్యంలో ఉన్నాడు. అలాగే పురుషుల 65 కిలోల ఫ్రీస్టైల్ కాంస్య పతక పోరులో భారత్‌కు చెందిన గౌరవ్ పునియా ఓడిపోయాడు. ఇరాన్‌కు చెందిన మోర్టెజా మొల్లమోహమ్మదితో పోరాడుతున్న పునియా, నిర్ణీత సమయంలో 8-8తో ముగిసిన తర్వాత కాంస్య పతకాన్ని కోల్పోయింది. ముందుగా పునియా రెపిచేజ్ రౌండ్‌ను అధిగమించాడు. సాంకేతిక ఆధిపత్యంతో పోలాండ్‌కు చెందిన మిచల్ మిచ్నీవిచ్‌పై 10-0 తేడాతో విజయం సాధించాడు. ఇక పురుషుల 60 కిలోల ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో భారత క్రీడాకారుడు సిటెండర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీ ఫైనల్లో కజకిస్తాన్‌కు చెందిన బెకాసిల్ అస్సాంబెక్‌పై 5-1 తేడాతో విజయం సాధించి సిటెండర్ బంగారు పతక పోరులో తన స్థానాన్ని సంపాదించుకున్నాడు.



# ఉత్కంఠ పోరులో పాకిస్థాన్ ఓటమి

### 2 పరుగుల తేడాతో వెస్టిండీస్ విక్టరీ

**న్యూఢిల్లీ:** నరాలు తెగే ఉత్కంఠ పోరులో చివరి బంతికి పాకిస్థాన్ ఓటమి పాలైంది. ఫ్లోరిడా వేదికగా పాకిస్థాన్‌తో ఆదివారం ఆద్యాంతం ఆసక్తి భరితంగా సాగిన రెండో టీ20లో వెస్టిండీస్ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. విండీస్ ఆల్‌రౌండర్ జాసన్ హోల్డర్ ఆఖరి బంతికి ఫోర్ కొట్టి తన జట్టును గెలిపించాడు. పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 133 పరుగులు చేయగా, వెస్లిండీస్ 8 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. పాకిస్థాన్ బ్యాటర్లలో హసన్ నవాజ్ (40) టాప్ స్కోరర్‌గా నిలువగా, సల్మాన్ అఘా (38) పరుగులతో రాణించాడు. మిగిలిన బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో జాసెన్ హోల్డర్ 4 వికెట్లు పడగొట్టగా, మోటీ 2 వికెట్లు, అకిల్ హోస్సేన్, చేజ్, జోషఫ్ తలా ఒక వికెట్ సాధించారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ తడబడింది. వరుస క్రమంలో వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా పయనించింది. అయితే జాన్సన్ హోల్డర్ (16), షెఫర్డ్ (15) కాస్త దూకుడుగా ఆడటంతో వెస్టిండీస్ తిరిగి గేమ్‌లోకి వచ్చింది. ఈ క్రమంలో ఆఖరి ఓవర్‌లో కరేబియన్ జట్టు విజయానికి 8 పరుగులు అవసరమయ్యాయి. షాహీన్ అఫ్రిది వేసిన తొలి బంతికి హోల్డర్ సింగిల్ తీయగా, రెండో బంతికి షెఫర్డ్ ఔటయ్యాడు. తర్వాతి మూడు బంతుల్లో మూడు పరుగులు వచ్చాయి. దీంతో ఆఖరి బంతికి వెస్టిండీస్ గెలుపునకు 4 పరుగులు అవసరం అయ్యాయి. ఆ బంతిని అఫ్రిది వైడ్‌గా సంధించడంతో వెస్టిండీస్ విజయ సమీకరణంగా మూడు పరుగులుగా మారింది. ఈ క్రమంలో హోల్డర్ ఆఖరి బంతిని బౌండరీకి తరలించాడు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో వెస్టిండీస్ 135 పరుగులు చేసి కేవలం రెండు పరుగుల ఆధిక్యంలో సంచలన విజయాన్ని హోప్ సేన తన ఖాతాలో వేసుకుంది. ఈ విజయంతో సిరీస్‌ను 1-1తో ఆతిథ్య వెస్టిండీస్ సమం చేసింది. పాకిస్థాన్ బౌలర్లలో మహ్మద్ నవాజ్ 3 వికెట్లు పడగొట్టగా, సైమ్ ఆయుబ్ 2 వికెట్లు సాధించాడు.

# టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఘోర పరాభవం

### అత్యల్ప స్కోర్‌కే ఆలౌట్

### 26 రన్స్‌తో టాప్ 1లో న్యూజిలాండ్

**న్యూఢిల్లీ:** గత కొన్ని సంవత్సరాలుగా టెస్ట్ క్రికెట్ నాటకీయ పతనాలకు సాక్ష్యంగా నిలిస్తోంది. టెస్ట్ క్రికెట్‌లో పాల్గొనే వివిధ జట్లు దారుణంగా అత్యంత తక్కువ స్కోర్లకే ఆల్‌ఔట్ అయి ఘోర పరాభవాన్ని ఎదుర్కొంటున్నాయి. వెస్టిండీస్ ఇటీవల టెస్ట్ క్రికెట్‌లో రెండవ అత్యల్ప జట్టు స్కోరును రికార్డు స్థాయిలో సాధించింది. దీంతో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లతో పాటు, అపఖ్యాతి పాలైన జట్టు పతనాల జాబితాలో చేరింది. టెస్ట్ క్రికెట్‌లో న్యూజిలాండ్ అత్యల్ప స్కోరు 26 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది మార్చి 1955లో ఇంగ్లాండ్‌తో జరిగింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో జరిగిన మ్యాచ్‌లో కివీస్ జట్టు ఇంగ్లీ బౌలింగ్ చేతిలో ఘోర పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 20 పరుగుల తేడాతో గెలిచింది. ఇది టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు చేసిన జట్లలో అగ్రస్థానానికి చేరింది. ఇక గత నెల (జూలై, 2025) 14వ తేదీన జమైకాలోని సబీనా పార్క్‌లో ఆస్ట్రేలియా చేతిలో 27 పరుగులకే ఆలౌట్ అయిన వెస్టిండీస్ అవాంఛనీయ చరిత్ర సృష్టించింది. మిచెల్ స్టార్క్ ఆరు వికెట్లు పడగొట్టి కరేబియన్ జట్టు పతనానికి దారితీసేలా చేశాడు. ఇది ఇప్పుడు టెస్ట్ క్రికెట్‌లో 2వ అత్యల్ప స్కోరుగా రికార్డయింది. అలాగే 1896లో గ్కెబెర్హాలో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 30 రన్స్‌కే దక్షిణాఫ్రికా ఆలౌటయి అవమానకరమైన పతనాన్ని చవిచూసింది. పర్యాటక జట్టుప్రోటీస్‌ను 288 పరుగుల తేడాతో ఓడించింది. ఇక 1924లో బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో 30 పరుగుల దారుణమైన స్కోరు కారణంగా దక్షిణాఫ్రికా మరోసారి ఈ జాబితాలో చోటు సంపాదించింది. ఇంగ్లాండ్‌తో మళ్లీ తలపడిన దక్షిణాఫ్రికా జట్టు సీమ్ అనుకూల పరిస్థితుల్లో ఇబ్బంది పడి ఇన్నింగ్స్ 18 పరుగుల తేడాతో టెస్టును కోల్పోయింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో 4వ అత్యల్ప జట్టు స్కోరుగా నమోదైంది. 1899లో కేప్‌టౌన్‌లో న్యూలాండ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 35 పరుగులకే పరిమితమైన కారణంగా ఈ జాబితాలో మూడోసారి చోటు దక్కించుకుంది. ప్రోటీస్ జట్టు ఇంగ్లీ బౌలర్లను ఎదుర్కోలేక 210 పరుగుల తేడాతో పూర్తిగా ఓడిపోయింది. టెస్ట్ క్రికెట్ ప్రారంభ సంవత్సరాల్లో ఇంగ్లాండ్ ఆధిపత్యం ఇదే.







# ప్రజల వద్దనే రూ.6,017 కోట్ల 2వేల నోట్లు

**ముంబై, ఆగస్టు 3:** రూ.2వేల నోట్లను ఇప్పటికే ఆర్బీఐ రద్దు చేసింది. చెలామణిలో ఉన్న నోట్లను వెనక్కి తీసుకుంది. దానికి కొంత సమయం కూడా ఇచ్చింది. అయినా కొంతమంది వద్ద రూ.2వేల నోట్లు ఇంకా ఉన్నాయి. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. చెలామణి నుండి తొలగించిన రెండేళ్ల తర్వాత కూడా రూ.6,017 కోట్ల విలువైన నోట్లు ఇప్పటికీ ప్రజల వద్దే ఉన్నాయని తెలిపింది. రెండు వేల రూపాయల బ్యాంక్ నోట్లు ఇప్పటికీ చట్టబద్ధంగా చెల్లుబాటులో ఉన్నాయి. ఆర్‌బిఐ మే 19, 2023న చెలామణి నుండి రూ.2,000 బ్యాంక్ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. 2023 మే 19 నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 బ్యాంక్ నోట్ల మొత్తం విలువ రూ.3.56 లక్షల కోట్లు అని ఆర్బీఐ తెలిపింది. ఇది జూలై 31, 2025 నాటికి రూ.6,017 కోట్లకు తగ్గిందని వెల్లడించింది. 2023 మే 19 నాటికి చెలామణిలో ఉన్న రూ.2వేల బ్యాంక్ నోట్లలో 98.31 శాతం తిరిగి వచ్చాయి. రెండు వేల రూపాయల బ్యాంకు నోట్లను మార్చుకునే సౌకర్యం రిజర్వ్ బ్యాంక్ యొక్క 19 ఇష్యూ కార్యాలయాలలో 2023 మే 19 నుండి అందుబాటులో ఉంది. రూ.2వేల నోట్లను ఈ విధంగా జమ చేయవచ్చు. 9 అక్టోబర్ 2023 నుండి రిజర్వ్ బ్యాంక్.. వ్యక్తులు - సంస్థల నుండి వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడానికి రూ.2,000 బ్యాంకు నోట్లను అంగీకరిస్తున్నాయి. ప్రజలు దేశంలోని ఏ పోస్టాఫీసు నుంచైనా ఇండియన్ పోస్ట్ ద్వారా రూ. 2వేల నోట్లను ఆర్బీఐ యొక్క ఏదైనా ఇష్యూ కార్యాలయానికి పంపి తమ బ్యాంకు ఖాతాలలో జమ చేసుకోవచ్చు. ఈ కార్యాలయాలు అహ్మదాబాద్, బెంగళూరు, బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ, పాట్నా, తిరువనంతపురంలలో ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోటును నవంబర్ 2016లో ప్రవేశపెట్టింది. పాత రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసినప్పుడు దేశ కరెన్సీ అవసరాలను త్వరగా తీర్చడానికి ఈ నోటును తీసుకిచ్చింది. ఇది సక్సెస్ కావడంతో పాటు ఇతర నోట్లు తగినంత సంఖ్యలో అందుబాటులోకి వచ్చిన వెంటనే 2018-19లో రూ.2,000 నోట్ల ప్రింటింగ్‌ను నిలిపివేసింది. రూ.2వేల నోట్లలో ఎక్కువ భాగం మార్చి 2017కి ముందు జారీ చేయబడ్డాయి. ఇప్పుడు వాటి జీవితకాలం ముగిసిపోయాయి. లావాదేవీలలో రూ.2,000 నోట్లను ఉపయోగించరు.



# రెండు బ్యాంకుల విలీనానికి ఆర్‌బిఐ ఓకే

**ముంబై, ఆగస్టు 3:** సహకార బ్యాంకింగ్ విభాగంలో ఇటీవల మోసాలకు గురైన న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంకు (ఎన్‌ఐసిబి)ను సారస్వత్ కో-ఆపరేటివ్ బ్యాంకులో విలీనం చేసేందుకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ విలీనం అధికారికంగా 2025 ఆగస్టు 4 నుంచి అమల్లోకి వస్తుంది. ఈ తేదీ నుంచి అన్ని ఎన్‌ఐసిబి శాఖలు సారస్వత్ బ్యాంక్‌లో భాగంగా పనిచేస్తాయి.సారస్వత్ బ్యాంకు విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఎన్‌ఐసిబి డిపాజిటర్లతో సహా ఖాతాదారులను 2025 ఆగస్టు 4 నుంచి సారస్వత్ బ్యాంకు కస్టమర్లుగా పరిగణిస్తామని తెలిపింది. వారి ప్రయోజనాలను పూర్తిగా పరిరక్షిస్తామని పేర్కొంది. ఈ విలీన ప్రక్రియలో భాగంగా ఎన్‌ఐసిబి ఆస్తులు, అప్పులన్నింటినీ సారస్వత్ బ్యాంకు స్వాధీనం చేసుకుంటుంది. డిపాజిట్లు, అడ్వానునసలతో సహా ఎన్‌ఐసిబి బ్యాంకింగ్ కార్య కలాపాలను సారస్వత్ వ్యవస్థలో విలీనం చేయ నున్నారు. ఈ విలీనంతో సారస్వత్ కో-ఆపరేటివ్ బ్యాంక్ దేశంలోనే అతిపెద్ద అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ గా మారుతుంది. మార్చి 31, 2025 నాటికి మొత్తం వ్యాపారం రూ.91,800 కోట్లుగా ఉంది. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంకు మార్చి 2025 నాటికి మొత్తం రూ.3,500 కోట్ల వ్యాపారం సాగించింది. 2025 ఫిబ్రవరిలో న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ కు చెందిన ప్రభాదేవి ప్రధాన కార్యాల యం, గోరేగావ్‌శాఖలో ఆర్‌బిఐ సాధారణ తనిఖీ సమయంలో రూ.122 కోట్ల అవకతవకలను కనుగొంది. ఫిజికల్ క్యాష్, లెడ్జర్ ఎంట్రీలమధ్య వ్యత్యా సాలతో వాల్ట్‌ల్లోని నగదులో




# వాణిజ్యం

# అత్యధిక పన్ను వసూలు చేసే దేశాలివే..

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేసే ప్రక్రియ భారతదేశంలో ప్రారంభమైంది. ఈ సారి చివరి గడువు తేదీ 15 సెప్టెంబరు 2025. అదే సమయంలో ఆదాయపు పన్ను వెబ్‌సైట్‌లో ఐటిఆర్-2, ఐటిఆర్-3 ఫారమ్‌లు కూడా యాక్టివేట్ చేశారు. దీని కారణంగా ఐటిఆర్ దాఖలు చేసే వారి సంఖ్య వేగంగా పెరుగుతోంది. ప్రపంచంలో అత్యధిక పన్ను వసూలు చేసే దేశాలు చాలా ఉన్నాయి. అక్కడ ప్రజలు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ప్రభుత్వానికి పన్నుగా ఇవ్వాలి. ప్రపంచంలో అత్యధిక పన్ను వసూలు చేసే దేశాలు ఏంటో తెలుసుకుందాం. భారత దేశంలో మీరు 39 శాతం పన్ను చెల్లించాలి. ప్రపంచంలోనే అత్యధిక ఆదాయపు పన్ను ఐవరీ కోస్ట్‌లో విధిస్తారు. ఇక్కడ, అధిక ఆదాయ సమూహంలోని వ్యక్తులు తమ ఆదాయంలో 60శాతం వరకు పన్నుగా చెల్లించాలి. నార్డిక్ దేశాలు అద్భుతమైన సంక్షేమ వ్యవస్థకు ప్రసిద్ధి చెందాయి. ఫిన్లాండ్‌లో దాదాపు 57శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ ప్రతిగా ఉచిత విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రత కూడా అందుబాటులో ఉన్నాయి. జపాన్‌లో ఆదాయపు పన్ను రేటు దాదాపు 56శాతం. కానీ ఇక్కడి వ్యవస్థ అద్భుతంగా ఉంది. అది ఆరోగ్య సేవలు అయినా, ప్రజా రవాణా అయినా అధిక పన్ను చెల్లించాల్సిందే. డెన్మార్క్‌ను తరచుగా ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశం అని పిలుస్తారు. దీనికి అతిపెద్ద కారణం దాని బలమైన సంక్షేమ వ్యవస్థ. 55.9శాతం పన్ను ఉన్నప్పటికీ, ప్రజలు సంతోషంగాఉన్నారు. ఎందుకంటే వారికి అధికనాణ్యత గల సేవలు లభిస్తాయి. ఆస్ట్రియాలో 55శాతంవరకు పన్నుచెల్లించాలి. ఇక్కడి సంస్కృతి, పరిశుభ్రత, సామాజిక నిర్మాణం చాలా బలంగా ఉన్నాయి. బెల్జియంలో పన్ను రేటు 53.7 శాతం. కానీ ఇక్కడ ఆరోగ్యసంరక్షణ, రవాణా, సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉండడం ఒక ప్రయోజనం. స్వీడన్‌లో ప్రజలు ఉచిత విద్య, ఆరోగ్య సంరక్షణను కూడా పొందుతారు. అందుకే ప్రభుత్వానికి 50శాతం పన్ను చెల్లించాలి. అయితే నెదర్లాండ్స్‌లో పన్ను 49 శాతం ఫ్రాన్స్. జర్మనీలలో పన్ను 45శాతంగా ఉన్నాయి.




# 'ఎఐకి అంత సీన్ లేదు': నీలేకని

**ముంబై, ఆగస్టు 3:** ఆధార్, యుపిఐ ఆవిష్కరణల్లో కీలక పాత్ర పోషించిన నందన్ నీలేకని భారత్‌లో కృత్రిమ మేధ (ఎఐ) ప్రభావం ఉద్యోగాలపై ఎలా ఉండబోతుందో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఎఐ భారతదేశ జాబ్ మార్కెట్‌పై పెద్దగా ప్రభావం చూపదని చెప్పారు. అందుకు బదులుగా భారీగా సంపదను, అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. సాంకేతిక నిపుణులు ఎఐలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడంతో పాటు వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టాలని కోరారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అధికారం కొంత మంది చేతుల్లో కేంద్రీకృతం అవుతుంది. ఈ ధోరణి ఇప్పటికే ప్రపంచ సాంకేతిక పర్యావరణ వ్యవస్థల్లో కనిపిస్తుంది. కానీ భారతదేశం అందుకు భిన్నమైన దృక్పథాన్ని నిర్మించాలి. ప్రపంచ శక్తులతో మనం పోరాడలేం. కానీ మన ప్రభావిత ప్రాంతంలో కోట్ల మంది ప్రజలు సమస్యలను పరిష్కరించడానికి నూతన ఆవిష్కరణలు చేయాలి. ఉద్యోగం పోతుందని భయపడే బదులు నైపుణ్యాల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కృత్రిమ మేధను ఉపయోగించాలి' అని నీలేకని అన్నారు.



# దేశంలో 30% పెరిగిన ఇంటి అద్దెలు

**ముంబై, ఆగస్టు 3:** ఈ యేడాది రెండో త్రైమాసికంలో దేశవ్యాప్తంగా ఇంటి అద్దెలు భారీగా పెరిగాయని ఓ నివేదిక తెలిపింది. నిర్మాణంలో ఉన్న ఇళ్లు అందుబాటులోకి రావడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మంది ఇళ్లను అద్దెకు ఇచ్చేందుకు ఆసక్తి చూపించడం, యువతలో నిరుద్యోగం తగ్గడంతో అద్దె ధరల పెరుగుదలకు కారణమయ్యాయని ఓ నివేదిక తెలిపింది. నివేదిక ప్రకారం, త్రైమాసిక పరంగా దేశంలో అద్దెలు 4.8శాతం, గతేడాదితో పోలిస్తే 29.6శాతం పెరిగాయి. స్థిరాస్తి రంగంలో డిమాండ్, సరఫరా కూడా 3శాతం మే పెరిగింది. అధికంగా గ్రేటర్ నోయిడాలో 20.7శాతం మేర అద్దెలు పెరిగాయి. ఆ తర్వాత నవీ ముంబైలో 19.4శాతం, ఢిల్లీలో 17.2శాతం, కోల్‌కతాలో 13.7శాతం, అహ్మదాబాద్‌లో 12.2శాతం, హైదరాబాద్‌లో 11.5శాతం, చెన్నైలో 11.2శాతం మేర పుంజుకున్నాయి. ఈ నగరాల్లో ప్రధానంగా సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఎక్కువ గిరాకీ ఉందని, సగటున 22శాతం పెరిగింది. ఇదే సమయంలో 3 బెడ్‌రూమ్ ఇళ్లకు 25శాతం మేర డిమాండ్ క్షీణించింది. దేశవ్యాప్తంగా 2 బెడ్‌రూమ్ ఇళ్లకు ఎక్కువ మంది ప్రాధాన్యత ఇస్తున్నట్లు నివేదిక తెలిపింది. మొత్తం ఇళ్ల డిమాండ్‌లో 46శాతం వాటా 2 బెడ్‌రూమ్‌లదే. అదేవిధంగా సెమీ-ఫర్నిష్డ్ ఇళ్లకు సగం కంటే ఎక్కువ గిరాకీ కొనసాగుతోంది. ఎక్కువ మంది రూ.10వేల నుంచి 20వేల మధ్య ఉండే ఇళ్ల కోసమే చూస్తున్నారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.